
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 17 - సంచిక 05
**అక్టోబర్ 2012**
**విడిప్రతి రూ॥ 12.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

పత్రిక చందా మనీ ఆర్డర్ ద్వారా కాని, డ్రాఫ్టు ద్వారా కాని పంపవలసిన చిరునామా
**"శ్రీ వేదమాత గాయత్రి ట్రస్టు"**
**గాయత్రి చేతనా కేంద్రము**
హెచ్.పి. రోడ్, మూసాపేట,
అశ్విని హౌస్ దగ్గర,
హైదరాబాదు - 500 018.

## ధర్మయజ్ఞం ద్వారా ధర్మోద్ధరణ

హిమాలయ శిఖరాల నుండి వస్తున్న పిలుపు మన హృదయాలను తాకుతున్నది. దుర్గమ హిమాలయాలలో మహాతపస్సు చేస్తున్న ఋషులు, సిద్ధపురుషులు ఇస్తున్న పిలుపు అది. ఆ పిలుపులో సంతాపం మిళితమై ఉన్నది. వారి మనోవేదన నుండి, వారి తీవ్ర ఆవేదన నుండి, వారి సంతాపం నుండి జనించిన ప్రశ్న ఏమిటంటే ధర్మాన్ని ఎవరు రక్షిస్తారు (ఆచరిస్తారు) ?

మన గుండెలలో సంవేదన ఉంటే, ఈ ప్రశ్నలోని వాడిని, వేడిని మనం అనుభూతి చెందుతాం. మనకు ఈ ఋషి వేదన తప్పక తగులుతుంది.

ధర్మం ప్రవచనం కాదు. ధర్మం బుద్ధిపరమైన తర్కవిన్యాసం, మాటల గారడీ కూడా కాదు. ధర్మం తపస్సు. ధర్మం తితీక్ష. ధర్మం కష్టాలను ఓర్చుకొనడం. ధర్మం పరదుఃఖ నివారణ, ఎదుటి వ్యక్తి దుఃఖానికి చలించిపోవడం. ధర్మం సత్యం కోసం, మంచికోసం జీవించే సాహసం, మరణించే సాహసం. ధర్మం కట్టుబాట్ల పరిరక్షణకై వెలువడే హుంకారం. ధర్మం సేవ యొక్క ఆర్ద్ర సంవేదన. ధర్మం పీడా నివారణకై ఆవిర్భవించే మహా సంకల్పం. ధర్మం పతన నివారణకు యుద్ధ భేరి, దుష్ట ప్రవృత్తులపై, దుష్ట కృత్యాలపై, దురాచారాలపై జరిగే మహోద్యమానికి శంఖారావం. ధర్మం సర్వహితం కోసం స్వహితం యొక్క త్యాగం.

అలాంటి ధర్మం తపోజ్వాలల నుండే ఉద్భవిస్తుంది. బలిదానంలో దాని మధుర నాదం వినిపిస్తుంది. మనందరి జీవితాలలో ఆ తపోజ్వాలలను రగిలించడానికి, ఆ జ్వాలలను మరింతగా ప్రజ్వలింపజేయడానికే వచ్చింది ఈ పిలుపు. మనం ఋషి సంతానం అనే సందేశాన్ని, దానితో ముడిపడిన కర్తవ్యాలను గుర్తు చేయడానికే వచ్చింది ఈ పిలుపు.

ఈ పిలుపులోని ప్రశ్నకు సమాధానం ఇవ్వవలసిన వాళ్ళం మనమే. మన జీవితాలలో ధర్మానికి నిజమైన పరిభాషను నింపుకోవలసింది మనమే. మన జీవితాన్ని ధర్మం యొక్క యజ్ఞ కుండంగా చేసినప్పుడు మాత్రమే, తపో జ్వాలలలో మన ప్రాణాలను నిరంతరం సమిధలుగా వేస్తున్నప్పుడు మాత్రమే ఈ పని జరుగుతుంది. ఈ ధర్మ యజ్ఞం ఫలితంగా ధర్మం దశదిశలకు విస్తరిస్తుంది.

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**ఫోన్ : 040-23700722, 9949111175, 9440769798**

**కోపం ద్వారా ఏమి సాధించలేము**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** ధర్మయజ్ఞం ద్వారా ధర్మోద్ధరణ 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** పిల్లలను పెంచే గురుతర బాధ్యత 2
3. **వేదమంత్రం :** వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః 3
4. **గాయత్రీ విద్య - 25 :** జప సాధన 4
5. **గాయత్రీ చిత్రావళి - 4 :** బ్రహ్మాణి (బ్రహ్మ విద్య) 6
6. **బాలల భవితకు బంగారుబాట-30 :** భగవంతుడు ఏకరూపుడే 7
7. **ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం):** సత్సాహస సంఘర్షణ ప్రకరణం 8
8. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 4 :** మహా మానవులు 10
9. **మస్తిష్కమే కల్పవృక్షం - 1** 13
10. **సూర్యసాధనా సంవత్సర ప్రత్యేకం :** సూర్యుని మహత్తు 17
11. **ప్రగతిశీల స్వావలంబనం - 3 :** కుటీర పరిశ్రమలు 18
12. **విజయదశమి ప్రత్యేకం :** సాహసం - సంకల్పంతో కూడిన గొప్ప పండుగ విజయదశమి 20
13. **పిల్లల సమగ్ర అభివృద్ధికి ఏమి చెయ్యాలి?** 22
14. **యువతకు ప్రత్యేకం :** ఐశ్వర్యం - 6 24
15. **ప్రతీక విజ్ఞానం** 26
16. **ఆదిశక్తి యొక్క లీలా కథలు - 28 :** అవరోధాలను గుర్తించి, జీవనశైలిని వికసింపజేసుకోండి 29
17. **అసలైన సంపద** 32
18. **మనం - మన ఆరోగ్యం :** స్నానం, ఈతకొట్టే కళ 34
19. **మీ స్వర్గాన్ని మీరే తయారు చేసుకోండి** 36
20. **గాంధీ జయంతి ప్రత్యేకం :** చిన్న పని, పెద్ద పని 38
21. **పూజ్య గురుదేవుల అమృతవాణి :** విగ్రహారాధన యందు దాగి ఉన్న సంకేతాలు, శిక్షణలు - 1 39
22. **నా వారితో నా మాట :** యుగనిర్మాణ పరివారం 43
23. **ఆరోగ్యమే మహాభాగ్యం-23 :** హోమియో వైద్య సేవ 45
24. **సుమతి సూక్తం - 1** 46
25. **నిత్యస్మరణీయులు - 10 :** సమైక్యతా స్ఫూర్తికుడు సర్దార్ పటేల్-3 48




## సద్గురు వచనామృతం

## పిల్లలను పెంచే గురుతర బాధ్యత

నీ ఇంటిలో అడుగు పెట్టిన నీ పిల్లలు సమాజాన్ని దేశాన్ని నిర్మించే భావి పౌరులు. వారి సద్ విద్య గురించి, వారి ఆత్మ సంస్కరణ గురించి నీవు శ్రద్ధ వహించాలి. భగవంతుడు నీకు అప్పగించిన కర్తవ్యం అది.

నీ ఇంటి వాతావరణం అనే మూసలో నీ సంతానపు మానసిక వ్యవస్థ, వారి అలవాట్లు, వారి సాంస్కృతికస్థాయి రూపొందుతాయి. నువ్వు ఇతరుల ఎడ దయ, ఉదారత, సంయమనం చూపనప్పుడు నీ సంతానం నుంచి నీవు ప్రేమను ఎలా ఆశించగలవు? విషయ వాసనల నుండి, భోగ విలాసాల నుండి కుత్సిత వాంఛ నుండి నీవు నీ మనస్సును మళ్లించజాలనప్పుడు వారు కాముకులు, ఇంద్రియలోలురు కాకుండా ఎలా ఉండగలరు? మద్య మాంసాలను, తినగూడని ఇతర పదార్థాలను నీవు ఉపయోగిస్తూ ఉంటే వారు తమ సహజ పవిత్రతను, పాలవంటి స్వచ్ఛతను ఎలా కాపాడుకో గలరు? సిగ్గు, లజ్జ, సభ్యత లేని నీ అలవాట్లను, తిట్లను శాపనార్థాలను చెడు నడతలను నీవు వదలనప్పుడు నీ పిల్లలకు ఆ చెడు అలవాట్లు ఎలా అంటకుండా ఉంటాయి?

నీ మాట, వ్యవహారం, రోజువారీ పనులు, నిద్ర, లేవటం, కూర్చోవటం రూపొందించే మూసలో అతని సున్నితస్వభావం అలవాట్లు రూపొందుతాయి. వారు నువ్వు చేసే ప్రతి పనిని అనుకరిస్తారు. నీవు వారికి ఒక మోడల్, ఒక నమూన, ఒక ఆదర్శం. కనుక నీ సంతానం మనుషులుగా ఉంటారా, నర పశువులుగా ఉంటారా అనేది నీ మీదనే ఆధారపడి ఉంటుంది.

*- అఖండజ్యోతి, జనవరి, 1951*

*అనువాదం: సత్యనారాయణ గుప్తా*

## పండుగలు

**అక్టోబర్ 2012**

| | |
|---|---|
| 02-10-2012 | మహాత్మాగాంధీ జయంతి |
| 04-10-2012 | మాతా భగవతీదేవిశర్మ జయంతి |
| 13-10-2012 | పండిత శ్రీరామశర్మ ఆచార్య జయంతి |
| 24-10-2012 | విజయదశమి |

**నవంబర్ 2012**

| | |
|---|---|
| 13-11-2012 | దీపావళి |
| 17-11-2012 | నాగుల చవితి |
| 28-11-2012 | కార్తీక పౌర్ణమి |

**భావాలను కప్పిపెట్టడం వల్ల అనారోగ్యం, గుండె జబ్బులు రావచ్చు**

వేద మంత్రం

# వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః

**ఆచార్యో బ్రహ్మచారి బ్రహ్మచారి ప్రజాపతిః ।**
**ప్రజాపతిర్వి రాజతి విరాడిన్ద్రో భవద్ వశీ ॥**
**(అధర్వవేద 11/5/16)**

**భావార్థం :** మన అధ్యాపకులు, నాయకులు, అధికారులు బ్రహ్మ చారులగుదురు గాక. వారు శీలభ్రష్టులు అయితే అవాంఛనీయ తత్వాలు పెరిగి దేశం పతనమవుతుంది.

**సందేశం :** ఎటువంటి సామాజిక వ్యవస్థ ఉన్నా, క్రమక్రమంగా దానిలో దురాలోచనలు, స్వార్థము, దుష్ప్రవృత్తులు తలెత్తుతాయి. వేద భగవానుడు వర్ణ వ్యవస్థననుసరించి బ్రాహ్మణుల మీద ఒక బాధ్యతను ఉంచాడు. వారు ఎల్లవేళలా జాగరూకులై దేశాన్ని జాగృతంగా ఉంచాలి. చెడు నుండి రక్షించాలి. 'వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః'.

దేశాన్ని నడిపేది ఉపాధ్యాయులు, నాయకులు, అధికారులే. వీరే దేశానికి మార్గదర్శకులు. ఈ మూడు వర్గాలవారు స్వార్థం చేత అంధులై, దేశాన్ని, తమను పతనం అనే గోతిలోకి పడటం మనం ప్రత్యక్షంగానే చూస్తున్నాము. ఉపాధ్యాయులలో డబ్బు సంపాదించడమే ప్రధానమయింది. స్కూళ్ళు, కాలేజీలలో అన్ని రకాల అవాంఛనీయ సంఘటనలు, రౌడీయిజం, జూదం, మద్యపానం, మత్తు పదార్థములు, ఇవన్నీ మామూలు విషయాలై పోయాయి. ఉపాధ్యాయులు శీలం లేని వారగుటచేత, ఫలితంగా విద్యార్థులు అనవసరమైన విషయాలలో తలదూర్చి తమ యొక్క, దేశం యొక్క భవిష్యత్తును నాశనం చేస్తున్నారు.

ఈ చరిత్ర హీనులు, భ్రష్ఠులైన విద్యార్థులు పెద్దైన తర్వాత నాయకులు, అధికారులై, తమ గురువులకే గురువులనిపించు కుంటుంటారు. తమ జ్ఞానం, విజ్ఞానం, విద్యాబుద్ధులు అందరి కొరకుకాక తమ స్వార్థం కొరకే వినియోగిస్తారు. వారి హృదయంలో మాతృభూమి పట్ల శ్రద్ధ, దేశభక్తి భావన మృగ్యమవుతాయి. అటువంటి నాయకుల, అధికారుల అండతో అపరాధులు, ధూర్తులు, దొంగలు నిర్భయులై దేశాన్ని, ప్రజలను దోచుకుంటుంటారు.

వారి వివేకహీన ప్రవర్తన వలన ప్రజాస్వామ్యంలో జన సామాన్యం ఎంత దుర్దశలో ఉన్నారో ప్రత్యక్షంగానే చూస్తున్నాము. అమాయకులైన ప్రజలు ఇటువంటి ఉపాధ్యాయులు, నాయకులు, అపరాధుల దురాచారాలను సహిస్తున్నారు. భ్రష్టాచారుల, శీల రాహిత్యం శిఖరం అంచు వరకు చేరుకున్నది. ప్రతివ్యక్తి ఏదో పదవి పొందాలని, ప్రజలకు సేవ అనే ముసుగులో దేశాన్ని దోచుకోవాలని కలలు కంటున్నాడు. ఇందుకోసం నీచులైన అపరాధుల నుండి సహాయం తీసుకుంటున్నాడు. అమాయకులైన ప్రజలను సామదాన భేద దండోపాయముల ద్వారా ఏదోవిధంగా లొంగదీసుకొనేందుకు షడ్యంత్రము బహిరంగంగానే రూపొందించుకుంటున్నారు. ఎంతగా ఆధ్యాత్మిక పతనము కలుగుతున్నదంటే అధికార ప్రాప్తికి కుటిల పన్నాగాలు, తదనంతరం అధికార మదం చూస్తుంటే రావణుడు వీరికంటే తక్కువ వాడనిపిస్తుంది.

ఋగ్వేదంలో ఒక స్పష్టమైన ఆదేశమున్నది 'ఆ దేహనామ భవః కేతురగ్ని' కేవలం శ్రేష్ఠమైన వ్యక్తియే ప్రజలకు నాయకుడవ్వాలి. నాయకత్వము చరిత్రహీనుల చేతుల్లోకి వెళ్ళకుండా చూడాలి. ఇదే బ్రాహ్మణుల కర్తవ్యం. కానీ నేడు వారే చరిత్రహీనులై, భ్రష్ఠులై దేశాన్ని పతనం చేస్తున్నారు.

ప్రతి ఒక్క పౌరుని కర్తవ్యం అతడు నిజమైన బ్రాహ్మణుడు కావాలి.

★★★

## సహకారుల ఆవశ్యకత

*బ్రహ్మ సృష్టి నిర్మాణం చేయాలనుకొని ఇంత పెద్ద కార్యం తన ఒక్కనివల్ల కాదని భావించి సనక, సనందన, సనాతన సనత్కుమారులు అనే నలుగురు మానస పుత్రులను ఉద్భవింప జేసుకొన్నాడు. ఆ తరువాత ఆయన సృష్టి కార్యక్రమం సరళం గాను, నిరాటంకంగాను సాగిపోయింది. సర్వసమర్థులకే ఇతరుల సహకారం లేకుండా పనులు జరగనప్పుడు సాధారణ మానవులు విర్రవీగితే ఏమవుతుంది? అందుకే కుటుంబ వ్యవస్థ దీని ఆధారంతోనే ఏర్పాటు చేయబడింది. ఈ సత్యాన్ని తెలుసుకొన్న మానవుడు గృహాన్ని దేవాలయంగాను, కుటుంబ సభ్యులను దేవతలుగాను భావించి గుళ్ళు, గోపురాల చుట్టూ తిరగటం కాక ముందు తమ గృహాలను తాము ఉద్ధరించుకోవాలి.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**కోపం వచ్చినప్పుడు ఒకటి నుండి పది అంకెల వరకు లెక్కపెడుతూ ఉంటే కోపం తీవ్రత తగ్గుతుంది**

## గాయత్రీ విద్య-25

# జప సాధన



మనోమయ కోశం యొక్క స్థితి, ఏకాగ్రత కొరకు జప సాధన చాలా ఉపయోగకరము. అన్ని ధర్మములు, మతములు, సంప్రదాయములు దీని ఆవశ్యకతను గుర్తించాయి. జపం చేయడం వలన మనస్సు యొక్క ప్రవృత్తులు ఒకే దిశలో పయనింపజేయుట సులభము.

ఒకసారి ఒకడికి ఒక భూతం సిద్ధించింది. భూతం చాలా బలమైనది. అది చెప్పింది "నేను నీ వశంలోకి వస్తాను, నువ్వు చెప్పిందల్లా చేస్తాను కాని నన్ను ఊరికే కూచోమంటే కూర్చోను. నేను పనిలేకపోతే నిన్నే తినేస్తాను" అతను సరే అన్నాడు. అతను చాలా పనులు చెప్పాడు. కొద్దిసేపట్లోనే అన్ని పనులు పూర్తి చేసింది. దానికి పని చెప్పలేక చాలా అవస్థ పడ్డాడు. చాలా దుఃఖించి తన గురువు దగ్గరకు వెళ్ళాడు. గురువు ఆ సిద్ధుడికి ఇలా చెప్పాడు "మీ ఆవరణలో ఒక నిచ్చెన వేసి భూతానికి ఇంకొక పని చెప్పేంతవరకు నిచ్చెన ఎక్కి దిగుతుండమని చెప్పు" ఇలా చెయ్యడం వల్ల ఆ సిద్ధునికి కష్టాలు గట్టెక్కాయి.

మనస్సు కూడా అటువంటి భూతమే. దానికి పని లేకపోతే ఏదో గందరగోళం చేస్తుంటుంది. అందువల్ల పని ఏమిలేకపోతే జపంలో నిమ్నగం కావాలి. ఇదేదో కాలయాపన కోసం చేసేది కాక ఒక నిర్మాణాత్మక, ఉత్పాదక, వైజ్ఞానిక శ్రమ. ఇలా తడవ తడవకు చేయటం వలన అలాంటి అభ్యాసం, సంస్కారం ఏర్పడతాయి.

రాతి మీద తాడు పదే పదే రాసుకుంటే రాయి కోసుకు పోతుంది. పంజరంలోని పావురం బయటకు వదిలినా తిరిగి అక్కడకే వస్తుంది. ఆవును అడవిలో వదలినా రాత్రికి తిరిగి వస్తుంది. అట్లే నిరంతర అభ్యాసం వలన మనస్సు కూడా దీర్ఘకాలం వరకు పనిచేయగలుగుతుంది.

జపం ఈ విధంగా చేయడం వలన ఒకే దిశలో పనిచేసేందుకు మనస్సు సిద్ధమవుతుంది. ఆత్మిక క్షేత్రంలో మనస్సు లగ్నం చేస్తే ఏదో ఒక రోజు సంపూర్ణ సఫలత లభిస్తుంది. మనస్సు అనే భూతం చాలా బలమైనది. ఇది ప్రాపంచిక కార్యాలలో కూడా సఫలతా పూర్వకంగా పనిచేస్తుంది. దీనిని ఆత్మిక క్షేత్రంతో జోడిస్తే భగవంతుని సింహాసనాన్ని కదిలించకుండా ఉండదు. మనస్సు యొక్క ఉత్పాదక, రచనాత్మక ప్రేరక శక్తి ఎంత విలక్షణమైనవి అంటే ప్రపంచమందు ఏ విషయంలోను దానికి అసాధ్యమనేదే లేదు. భగవంతుని ప్రాప్తించుకొనుట కూడా దానికి సరళమే. కష్టమంతా మనస్సును ఒక చోట కేంద్రీకరించటమే. జపమును ఒక పద్ధతిగా చేయడం వల్ల ఈ కష్టమును దాటవచ్చు.

మనస్సు అటు ఇటూ పోతున్నప్పటికి, దానిని ఒక భావనపై తడవ తడవకు కేంద్రీకృతం చేస్తే కాలాంతరంలో అది అలాగే తయారవుతుంది. గట్టి ప్రయత్నం చేయడం వలన సర్కస్‌లో కోతులు, సింహాలు, పులులు, ఎలుగుబంట్లు మొదలైన మృగాలు యజమాని చెప్పినట్లు చేస్తాయి. అతను చెప్పినట్లు ఆడతాయి. అలాగే చంచలమైన, చెడు మార్గంలో ఉన్న మనస్సును వశం చేసుకుని మన ఇష్టం వచ్చిన విధంగా నడిచేటట్లు చేయవచ్చు. పహిల్వానులు ప్రతినిత్యం దండీలు, బస్కీలు చేయడం వల్ల వారి శరీరం రోజురోజుకు దృఢంగా, పుష్టిగా తయారవుతుంది. నిత్యం జపం చేయడం ఒక ఆధ్యాత్మిక వ్యాయామం. దీనివల్ల ఆధ్యాత్మిక స్వాస్థ్యం (ఆరోగ్యం) సుదృఢమవుతుంది. సూక్ష్మ శరీరం బలంగా తయారవుతుంది.

ఒక్కొక్క నీటి బిందువుతో బిందె నిండుతుంది. చీమ ఒక్కొక్క గింజను తీసుకెళ్ళి తన బిలంలో ఎంతో ధాన్యాన్ని చేరుస్తుంది. ఒక్కొక్క అక్షరం చదువుకుని కొంత కాలానికి విద్వాంసుడు కాగలడు. ఒక్కొక్క అడుగుతో ఎంతో దూరంలో ఉన్న లక్ష్యాన్ని చేరవచ్చు. ఒక్కొక్క పైసా కూడబెట్టి ధనవంతుడు కావచ్చు. గడ్డి పరకలను కలిపి గట్టి త్రాడుగా తయారుచేయవచ్చు. జపంలో కూడా ఇలాగే జరుగుతుంది. మాల యొక్క ఒక్కొక్క పూస త్రిప్పటం వల్ల శక్తి జమ అవుతుంది. యోగ గ్రంథములలో జపమును యజ్ఞముగా, మహిమగలదానిగా వర్ణించారు. ఆత్మ మార్గంలో వెళ్ళేందుకు ఇష్టం ఉన్నవారికి జపం చేయడం అత్యంత ఆవశ్యకమని నిర్ధారించబడింది.

గీత యొక్క 10వ అధ్యాయములో 15వ శ్లోకములో యజ్ఞములలో జపయజ్ఞం శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది. మను స్మృతిలో రెండవ అధ్యాయములోని 86వ శ్లోకములో హోమాల, బలికర్మ, శ్రాద్ధం, అతిథిసేవ, పాక యజ్ఞం అన్నీ కలిపి కూడా జపయజ్ఞంలో 16వ వంతుకు కూడా సరిపోవని చెప్పబడింది. భరద్వాజ మహర్షి గాయత్రి వ్యాఖ్యలో "సమస్త యజ్ఞముల యందు జపయజ్ఞం అధిక శ్రేష్ఠమని వ్యాఖ్యానించాడు.

**మౌనం కోపాన్ని తగ్గిస్తుంది**

ఎన్ని కర్మలు, యజ్ఞములు, దానములు, తపములు అన్నీ కలిపినా కూడా జప యజ్ఞములో 16వ వంతుకు సమానం కావు. సమస్త పుణ్య కార్యములలో జపయజ్ఞం సర్వశ్రేష్ఠం" ఇలాంటి అగణిత ప్రమాణములు శాస్త్రములలో లభ్యం అవుతాయి. ఈ శాస్త్రములలో జపయజ్ఞం యొక్క ఉపయోగం, మహత్వం గొప్పగా చెప్పబడినవి. ఎందుకంటే **జపం మనస్సును వశం చేసుకునే రామబాణం.** మనస్సును వశం చేసుకోవడం అనేది గొప్ప సాఫల్యం. ఇది సాధించినట్లయితే జీవితమును ధన్యం చేసుకున్నట్లే. సమస్త ఆత్మిక, భౌతిక సంపదలు సంయమ మనస్సుతోనే లభ్యం చేసుకొనవచ్చు.

జపమునకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయములు క్రింద ఇవ్వబడ్డాయి.

1) జపం కొరకు ప్రాతఃకాలం బ్రహ్మ, ముహూర్తం సర్వోత్తమ కాలం. సూర్యోదయమునకు రెండు గంటల ముందు నుండి సూర్యోదయం వరకు బ్రహ్మ ముహూర్తమని చెప్పబడింది. సూర్యోదయానంతరం రెండు గంటల కాలము ప్రాతఃకాలం. ప్రాతఃకాలం కంటే బ్రహ్మ ముహూర్తం అధిక శ్రేష్ఠము.

2) జపమునకై పవిత్రమైన ఏకాంత స్థానమును ఎన్నుకోవాలి. మందిరం, తీర్థం, తోట, జలాశయం మొదలైన ఏకాంతమైన, శుభ్రమైన స్థానములు జపమునకు అధిక ఉపయోగకరం. ఇంట్లో జపం చేసుకొనవలసి వస్తే ఎక్కువ శబ్దములు ఉండని స్థలమును ఎంచుకోవాలి.

3) సూర్యాస్థమయం అయిన తర్వాత ఒక గంట వరకు జపం చేయవచ్చు. రాత్రి వేళల జపం చేయరాదు.

4) జపం కొరకు శుద్ధ శరీరంతో, శుద్ధమైన వస్త్రములతో కూర్చోవాలి. ఒకవేళ స్నానం చేయడానికి వీలుకాకపోతే (ఋతువుల ప్రతికూలత, అస్వస్థత వలన) ముఖం కడుక్కుని లేదా తడిగుడ్డతో శరీరాన్ని తుడుచుకుని కూడా జపం పూర్తి చేసుకోవచ్చు. నిత్యం బట్టలు ఉతుక్కోవడానికి వీలుకాకపోతే పట్టు లేదా ఉన్ని వస్త్రములతో పని గడుపుకోవచ్చు.

5) జపం ఉత్త నేల మీద కూర్చుని చేయరాదు. ధర్భాసనం, చాప మొదలైన గడ్డితో చేసిన ఆసనములు ఉపయోగించాలి.

పశు చర్మం, మృగ చర్మం మొదలైనవి హింస లేకుండా దొరకవు. అందువలన వాటిని ఉపయోగించరాదు.

6) పద్మాసనం వేసుకుని, వెన్నెముక నిటారుగా ఉంచుకుని జపం చేయాలి. ఉదయం తూర్పువైపు, సాయంత్రం పడమరవైపు కూర్చొని జపం చేయాలి.

7) తులసి మాలనుగాని, చందనంతో చేసిన మాలనుగాని వాడాలి. ప్రతిరోజు కనీసం ఒక మాల జపం చెయ్యాలి. జపం చేసేటప్పుడు మాలపై ఇతరుల దృష్టి పడకుండా ఉత్తరీయం లోపల ఉంచుకోవాలి.

8) జపం చేసేటప్పుడు సుమేరు (మాలలో ఉండే పెద్దపూస) దాటరాదు. ఒక మాల జపం పూర్తయిన తర్వాత దానిని మస్తిష్కానికి, నేత్రాలకు తాకించి, మాలను వెనక్కు త్రిప్పి జపం చేయాలి. ఈ విధంగా ఒక మాల జపం పూర్తయిన ప్రతిసారి మాలను వెనక్కు త్రిప్పి మరల జపం చేయాలి.

9) ప్రయాణాలలో, జబ్బు పడినప్పుడు, ఎవరైన రోగికి సేవలో నిమగ్నమైనప్పుడు, పురుడు, సూతకం మొదలైన సమయాలలో స్నానాది కార్యక్రమాలకు వీలుండదు. ఇటువంటి సమయాలలో మానసిక జపం చెయ్యాలి. మానసిక జపం పడుకునినైనా చేయవచ్చు. నడుస్తూనైనా చేయవచ్చు.

నియమిత సమయంలో, నియమిత సంఖ్యలో, నియమిత స్థానంలో శాంత చిత్తంతో ఏకాగ్రతతో జపం చెయ్యాలి. ప్రక్కన జలాశయం గాని, జలంతో నింపిన పాత్ర గాని ఉండాలి. ఆచమనం చేసి జపం ప్రారంభించాలి. ఏదైనా అనివార్య కారణం వలన జపం చేయలేకపోతే మరునాడు ప్రాయశ్చిత రూపంగా ఒక మాల ఎక్కువ జపం చెయ్యాలి.

11) పెదిమలను కదలిస్తూ ప్రక్క నున్న వారికి వినిపించకుండా జపం చెయ్యాలి. మల, మూత్ర విసర్జనకు వెళ్ళవలసి వస్తే, కాళ్ళు చేతులు, ముఖం కడుక్కుని మరల జపానికి కూర్చోవాలి. జపం చేసే సమయంలో మౌనంగా ఉండటం మంచిది. ఏదైనా చెప్పవలసి వస్తే సైగలతో చెప్పాలి.

12) జప సమయంలో మస్తిష్క మధ్యభాగంలో ఇష్టదైవాన్ని కాని, ప్రకాశ జ్యోతినిగాని ధ్యానం చెయ్యాలి. సాధకుని ఆహార, వ్యవహారాలు సాత్వికంగా ఉండాలి. శారీరిక, మానసిక దోషాల నుండి రక్షించుకునేందుకు వీలయినంత ప్రయత్నం చేయాలి.

13) జపం కొరకు గాయత్రీ మంత్రం సర్వశ్రేష్ఠమైనది. గురువు ద్వారానే గ్రహించిన మంత్రం మాత్రమే ఫలిస్తుంది. ఇష్టమైన మంత్రమును ఇష్టం వచ్చినట్లు జపించడం వలన విశేషమైన లాభం కలుగదు. ఎవరైనా అనుభవజ్ఞుల నుండి మార్గదర్శనం పొందాలి.

పైన చెప్పిన నియమాల ఆధారంగా చేసిన గాయత్రీ జపం మనస్సును వశంలోనికి తెచ్చుకునేందుకు, మనోమయకోశమును సువికసితం చేయడానికి అత్యంత ఉపయోగకరము.

★★★

**కోపం అగ్ని అయితే నవ్వు నీరు**

## గాయత్రీ చిత్రావళి - 4

# బ్రహ్మాణి (బ్రహ్మ విద్య)




ఈశ్వరుని అనంత శక్తులలో దివ్యజ్ఞాన ప్రకాశాన్నిచ్చే పరమ సతోగుణీ శక్తినే బ్రహ్మాణి లేదా బ్రహ్మవిద్య అని అంటారు. బ్రహ్మ జ్ఞానదేవత, వేదజ్ఞానము, తత్వజ్ఞానము ఆయన ద్వారానే ఉద్భవించాయి. బ్రహ్మ యొక్క నాలుగు ముఖాలు నాలుగు వేదాలకు ప్రతీకలు. ధర్మార్థకామమోక్షాల ఫలము ఈ జ్ఞానము ఆధారంగానే ప్రాప్తిస్తుంది. నాలుగు స్థితులు, నాలుగు ఆశ్రమాలు, నాలుగు వర్ణాలు, ప్రపంచపు నాలుగు దిశలు, మొదలైన చతుర్వర్గాల సంపూర్ణ సమస్యలు బ్రహ్మజ్ఞానం ఆధారంగానే పరిష్కరించబడతాయి. అందుకే బ్రహ్మవిద్యను చతుర్ముఖి అన్నారు.

బ్రహ్మశక్తి బ్రాహ్మీ. సమస్త దేవతల, జీవుల లేదా పదార్థముల యొక్క శక్తి దాని సారమే. శక్తి లేకపోతే అది నామమాత్రమే అవుతుంది. ఇతరులకు లాభము చేకూర్చుట అటుంచి తన అస్థిత్వ రక్షణ కూడా చేసుకోలేదు. అందుకే బ్రహ్మ సామర్థ్యము బ్రాహ్మీశక్తిగా చెప్పబడింది. సాధకులు ఈ సూక్ష్మభాగపు సారమును ఉపాసిస్తారు. బ్రహ్మకంటే బ్రాహ్మీశక్తి మహత్తు అధికము. ఎందుకంటే అది ఒక విస్తృత దేవతత్త్వం యొక్క అత్యంత శక్తివంతమైన తత్త్వము. బ్రహ్మ జ్ఞానం యొక్క కేంద్రీయ తత్త్వశక్తి అగుటవలన గాయత్రిని బ్రాహ్మీ అని అంటారు.

గాయత్రి యొక్క బ్రాహ్మీ స్వరూపాన్ని ఉపాసించుట వలన సాధకుని అంతఃకరణలో బ్రహ్మజ్ఞానము, తత్త్వబోధ, ఋతంభరా ప్రజ్ఞ, సూక్ష్మ దృష్టి కలుగుతాయి. దానితో మాయ యొక్క అజ్ఞానాంధకారము తొలగుతుంది. జీవి, ప్రకృతి, ఈశ్వరుల మధ్య పరస్పర సంబంధము చక్కగా అవగతమవుతుంది. అసంఖ్యాక గ్రంథ పతనము, వేలాదిమంది విద్వాంసుల ప్రవచనము వినుట వలన కూడా ప్రాప్తించని జ్ఞానము, బ్రాహ్మీశక్తి కృపతో సాధకుని అంతఃకరణలో స్వయంగా ప్రకటితమవుతుంది. ఆ మహాశక్తి ద్వారా ప్రసరించబడిన జ్ఞాన కిరణములు మనుష్యుని మానసం, హృదయములో ప్రవేశించుటచే ఆ దివ్య ప్రకాశములో సత్యము, ఆత్మ సాక్షాత్కారము కలుగుతుంది.

బ్రహ్మజ్ఞానం కలుగుట వలన ఫలము, జీవన్ముక్తి. ఆత్మ స్వయంగా ఆనంద స్వరూపము. ఆత్మజ్ఞానముతో పాటుగా బ్రహ్మానందము యొక్క రసాస్వాదన కలుగుతుంది. దాని ముందు ప్రపంచంలోని సమస్త రసాలు అత్యంత తుచ్ఛమని తెలుస్తుంది.

– అనువాదం : డా॥ తుమ్మూరి


**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**

**చదివించండి !!**


**కోపాలు విషాదానికి దారితీస్తాయి**

బాలల భవితకు బంగారు బాట-30

# భగవంతుడు ఏకరూపుడే



విరిసీ విరియని జ్ఞానంతో మిడిసి పడుతున్న ముగ్గురు మిత్రులు ఒక చెట్టు కింద చేరారు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూ ఎవరి గొప్పలు వారు చెప్పుకుంటున్నారు. నన్ను మించిన వారే లేరని ఎవరికి వారే గర్వపడుతున్నారు. ఇంతలో ఆ చెట్టు మీద సరసర పాకుతున్న ఒక జీవి మీద ఒకని దృష్టి పడింది. అది నల్లని రంగులో ఉంది. ఆకారం బల్లిలాగా ఉంది. ముఖం చేపలాగా ఉంది. నాలుక పాము నాలుకలాగా ఉంది. అతను తదేకంగా అటే చూడడం చూసి రెండవవాడు తలెత్తి చూశాడు. ఆ జీవి సరసర పాకుకుంటూ ఆకులమీదకు పోయింది. వెంటనే ఆకుపచ్చగా కనిపించింది. "ఇలాంటి జీవిని ఎప్పుడైనా చూశావా? ఆకుల్లో ఆకులా కలిసిపోయింది" అని మూడవవానిని అడిగాడు. అతను తలఎత్తి చూసేలోగా అది ఎర్రని పువ్వుల మీదికి పాకింది. అంతే, ఎర్రగా కనిపించింది.

మూడవవాడు వెంటనే అది ఎర్రగా ఉంటే పచ్చగా ఉందంటావేంటి? అని రెట్టించాడు. ఇంతలో అది కాండం మీదకి పాకింది. నల్లగా ఉంటే ఎర్రగా ఉందంటావేం? అని మొదటి వాడు రెట్టించాడు. ఈ విధంగా అది దేనిమీద పాకితే ఆ రంగులో కనిపించడం మొదలు పెట్టింది.

దాని రంగులను చూస్తూ ముగ్గురు మిత్రులు తన మాటే నిజమని, ఎదుటివాని మాట తప్పని వాదులాడుకోవడం మొదలు పెట్టారు. వారి వాదనకు తగ్గట్టుగానే ఆ జీవి కూడా అటు ఇటూ పాకుతూ రంగులు మారుస్తోంది, వారి వాదనను బలపరుస్తోంది. ఇలా వాదన సాగుతూనే ఉంది. ఇంతలో ఒకడు ఒక కర్రతో దాన్ని కింద పడేశాడు. మరొకడు పరుగెత్తుకుంటూ వెళ్ళి దాన్ని పట్టుకున్నాడు. విచిత్రంగా అది తెల్లగా మారిపోయింది. ముగ్గురి నోళ్ళూ ఒక్కసారే మూతపడిపోయాయి. తదేకంగా దాని వంకే చూస్తూ ఉండిపోయారు. కొయ్య బొమ్మల్లా స్తంభించిపోయారు.

ఇదంతా ఆ దారిగుండా పోతున్న సాధువు చూశాడు. వారి వద్దకు వచ్చి, వారి చేతుల్లో గిలగిలలాడుతున్న జీవిని, బొమ్మల్లా నిలబడ్డ మిత్రులను చూశాడు. వెంటనే "ముందు దానిని విడిచి పెట్టండి" అని గట్టిగా అరిచాడు. వాళ్ళు ఉలిక్కిపడి దానిని వదిలేశారు. అది సరసర పాకుతూ చెట్టుపైకి పోయింది. మళ్ళీ రంగులు మార్చడం మొదలు పెట్టింది. వారి ఆశ్చర్యానికి అంతే లేదు.

"స్వామీజీ! ఏమిటి ఈ వింత?" అని ప్రశ్నించారు. స్వామీజీ ముగ్గురిని కూర్చోమని వారితోపాటే తానూ కూర్చున్నాడు.

"నాయనలారా! భగవంతుని సృష్టిలో వేలకోట్ల జీవరాశులు ఉన్నాయి. ఈ జీవి వాటిల్లో ఒకటి. దీనిని 'ఊసరవెల్లి' అంటారు. ఒక్కొక్క జీవికి ఒక్కొక్క శక్తిని పరమేశ్వరుడు ప్రసాదిస్తూ ఉంటాడు. అందులో భాగంగానే ఊసరవెల్లికి రంగులు మార్చుకునే శక్తిని ప్రసాదించాడు. అది కూడా తనకు ప్రమాదం ఉన్నది అనుకున్నప్పుడు తాను ఏ పరిసరాల్లో ఉందో ఆ రంగులోకి మారిపోతుంది. ఆ విధంగా మీరు చూసిన రంగులన్నీ అశాశ్వతమైనవే. మీరు పట్టుకున్నప్పుడు కనిపించిన తెల్లరంగే శాశ్వతమైనది. ఊసరవెల్లి అసలు రంగు అదే. అందుకే సందర్భానుసారంగా మాటలను, మార్చే వారిని ఊసరవెల్లి అనడం వింటుంటాం".

"ఇంకా వినండి. భగవంతుడి స్వరూపము అంతే. లోకంలో వివిధ వర్గాల వారు అనేక రూపాల్లో అనేక విధాలుగా ఆరాధిస్తారు. ఎవరు ఏ విధంగా ఊహించుకుంటే వారికి ఆ విధంగా కనిపిస్తాడు. కానీ భగవంతుడు అనేవాడు ఒక్కడే. ఆయనకు రంగు, రూపం ఏవీ ఉండవు. మూలమూలల నుండి ప్రవహించి వచ్చిన నదులన్నీ ఒకే సముద్రంలో కలిసిపోతాయి. ఒకే రూపాన్ని పొందుతాయి. అదేవిధంగా ఎవరు ఏ రూపాన్ని ఏ రీతిలో ఉపాసించినా ఒకే పరమాత్మలో ఐక్యం అయిపోతారు. అదే సృష్టి రహస్యం. అదే పరమాత్మ లీల" అంటూ వారి అజ్ఞానాన్ని తొలగించాడు.

విన్నారు కదా! బాలలు! భగవంతుని రూపాలను సృష్టించు కొని మనలో మనం కలహించుకోవడం అజ్ఞానం.

*కం॥ భగవంతుని రూపంబని*
*భగవంతుని నామమనుచు వదరుట చూడన్*
*భగవంతుడు నవ్వుకొనుచు*
*జగమున జీవుల నొసగెను చతురుడు బాలా!*

– మధుర కవయిత్రి,
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**మాట్లాడటం కంటే వినడమే మంచిది**

## ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం)

# సత్సాహస - సంఘర్షణ ప్రకరణం

**అనౌచిత్యస్య సహనాత్తు, స్వమస్తిత్వం వివద్యతే ।**
**ద్వితీయా హానిరేషాస్యాదాక్రాంతారస్తు నిర్భయాః ॥ 29**

ఇంద్రియాల అనౌచిత్యాన్ని సహిస్తే, మనిషి ఉనికికే భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. మానవత్వం నశించిపోయి, పశువాంఛలతో, కుటిలత్వంతో నాశనదశకు చేరుకునే దుస్థితి కలుగుతుంది. ఇది రెండవ హాని. కాబట్టి ఈ రెండింటిని మొదటిది బలహీనులమయ్యి, ఆత్మన్యూనతాభావంతో ఉండడం, రెండవది దురలవాట్లకు లోనయ్యి, మానవతా అస్తిత్వాన్ని కోల్పోవడం జరుగుతుంది.

**స్వస్యాస్తు దుష్టతాయాస్తే పరిమాణే మహత్తమే ।**
**ప్రయోగ మాచరిష్యంతి, యచ్చ కష్టతరం భవేత్ ॥ 30**

ఈ దుష్టశక్తులను అదుపుచేసే యత్నం, తీవ్రమైన రీతిలో సాగాలి. లేకుంటే వాటి ప్రభావం మహత్తరమై, వాటిని అదుపు చేయడం కష్టతరంమవుతుంది. అందువల్ల ప్రయత్నం (అదుపు చేసే ప్రయత్నం) ఎప్పుడూ చేస్తూనే ఉండాలి. ఏ మాత్రం ఏమరుపాటుతో ఉన్నా, మన ఉనికికే ప్రమాదం వాటిల్లుతుంది.

**సాధనైః సాహసేనాపి యాస్యంతి మే సుపుష్టతామ్ ।**
**వ్యక్తయః కశ్చనాన్యేభ్యో విపద్వేతుకరా మతాః ॥ 31**

సాధన, సాహసం అనే రెండు రక్షణ కవచాలను ధరించి, మనిషి పరిపుష్టిని పొందాలి. యోగసాధన, తపస్సాధన అనేవి మనస్సును ఇతర ఆకర్షణలకు లోనుకాకుండా చేస్తూ జ్ఞానమార్గం లోకి పయనింపచేస్తాయి. సాహసం అనేది ధీరలక్షణం. ధైర్యంతో అంటే ఆత్మస్థైర్యంతో, స్థిరచిత్తంతో ఇంద్రియాలను అదుపుచేయ లేకపోతే తోక త్రొక్కిన త్రాచువలే తిరగబడి మన మనస్సును పామువలే చుట్టివేస్తాయి. అందువల్ల ఆ విపత్తును ఎదుర్కోవాలంటే ఇది ఒక్కటే మార్గం.

**అనీత్యా చరణం పాపం యథా భీరుతయా తథా ।**
**తస్యా అప్రతిరోధోఽపి పాపమేవానువిద్యతే ॥ 32**

అవినీతిని ఆచరించడం ఎంతటి పాపమో, భయంతో, ఇతరులు చేసే అవినీతిని ఆపకపోవడం, ఎదుర్కొనలేకపోవడం కూడా అంతటి పాపమే అవుతుంది. కౌరవసభలో అకృత్యాలను చూసి, నిర్లిప్తంగా మౌనం వహించిన భీష్మునికి పాపం సంక్రమించి, ఆ పాపఫలాన్నే అనుభవించడానికా అన్నట్లు చాలా రోజులు అంపశయ్యపై (ముళ్ళ శయనం) పరుండి ప్రత్యక్ష నరకాన్ని చవిచూశాడు. ద్రోణుడు ఎంతటి అద్భుత గురువైనప్పటికి, దుష్టద్యుమ్నుని ఖడ్గానికి బలి అయ్యి, శిరస్సులేని మొండెంగా మిగిలాడు. అందువల్ల పాపాన్ని చేయకపోవడంతో బాటు, పాపం జరుగుతుంటే, ఉదాసీనంగా, నిర్లిప్తంగా మౌనంగా ఉండడం తగదు. అది మహాపాపంగా పరిగణించబడుతుంది.

**వస్తుతో భీరవస్తే హిదుష్టతాం పోషయంత్యలమ్ ।**
**వరంసంఘర్షశీలాస్తే స్వయం గృహ్ణంతు హానికామ్ ॥ 33**

కావున పిరికితనంతో, "మనకెందుకులే" అన్న మూర్ఖత్వ భావనతో నిర్లిప్తంగా ఊరుకుంటే పాపాత్ములు, దుష్టశక్తులు మరింత విజృంభించి కరాళనృత్యం చేస్తారు. అందువల్ల వారిని హెచ్చరించడానికైనా, కనీసం బిగ్గరగా గొంతెత్తి, స్వరం పెంచి ఎదుర్కొంటే, ఆ దుష్టశక్తులు తరిమివేయబడడమో లేక పారిపోవడమో జరుగుతుంది. అందుకే తిరుగుబాటుతో కూడిన సాహసం కావాలి. ఇందుకు ఒక చిన్న ఉదాహరణ కథ ప్రాచుర్యంలో ఉంది.

ఒక ఊరి సరిహద్దులో పెద్ద పాము పుట్ట ఉంది. అందులో ఒక పెద్ద సర్పం అందరినీ కాటువేస్తూ, భయభ్రాంతులుగా చేసేది. దానివల్ల ఊళ్ళోజనం బయటకు రావడానికి, పొరుగూరి జనం ఊళ్ళోకి వెళ్ళే అవకాశం లేకుండా పోయింది. ఒకరోజు ఒక మునీశ్వరుడు ఆ గ్రామంలోకి అడుగుపెట్టబోతూ ఉంటే అక్కడి జనం పామును గురించి తెల్పి, నివారణ ఉపాయాన్ని సూచించమని కోరారు. అపుడు ఆ మునీశ్వరుడు పాము దగ్గరకు వెళ్ళగా, అతని ముందు పాము కూడా తలవంచి నమస్కరించింది. అపుడు ఆ మునీశ్వరుడు పాముకి హిత బోధ చేస్తూ, నీ వల్ల మనుష్యులంతా సుఖశాంతులకు దూరంమయ్యి భయంతో బ్రతుకుతున్నారు. ఇది నీకు తగదు. కాబట్టి ప్రజలను కాటువేయవద్దని ఆదేశించాడు. అతని ఆదేశానుసారం పాము కాటువేయడం మానివేసింది. మునీశ్వరుడు అక్కడ నుండి వెళ్ళిపోయాడు. నెలరోజుల తర్వాత మళ్ళీ వచ్చిన మునీశ్వరునకు

**తక్కువ మాట్లాడాలి, ఎక్కువ వినాలి**

ఒక చిత్రమైన దృశ్యం కనిపించింది. ఆ పాము నివసించే పుట్టవద్ద పిల్లలు ఉత్సాహంగా ఆడుకుంటూ కేరింతలు కొడుతున్నారు. ఆ పాము చిక్కిశల్యమై, రక్తసిక్తమైన దేహంతో, అతిదీనమైన స్థితిలో కనిపించింది. వెంటనే మునీశ్వరుడు దానికి కారణం ఏమిటని పామును ప్రశ్నించాడు. అపుడు ఆ పాము బదులిస్తూ, మునీశ్వరా! మీరు చెప్పినట్లే జనులను కాటువేయడం మానివేశాను. అందువల్ల ప్రజలకు భయం పోయి, నా మౌనాన్ని చేతకానితనంగా తీసుకుని, రాళ్ళతో కొట్టి హింసిస్తున్నారని రోదిస్తూ చెప్పింది. అప్పుడు మునీశ్వరుడు పాముతో ఇలా అన్నాడు "ఓ సర్పమా! ఎంత ఘోరం జరిగింది. నేను నిన్ను కాటువేయవద్దన్నానే కానీ, బుసకొట్టవద్దని చెప్పలేదు కదా! బుసకొడితే అది నీకు ఆత్మరక్షణగా ఉండి, ఇతరులకు భయాన్ని కలిగించి, నీకు ఈ దుస్థితి కలిగి ఉండేది కాదు" అని అన్నాడు. అందువల్ల అకృత్యాలు, అరాచకాలు జరిగినప్పుడు, పోరాటపటిమ లేనప్పుడు కనీసం బిగ్గరగా అరిచి, ఎదుర్కొనప్పుడే ఆ పాపకర్మ అడ్డుకోబడి మనకు పాపఫలం అంటదు. కాబట్టి అవినీతి చేయడం కంటే, దానిని సహించడం మరింత తీవ్రమైన పాపమని మనకు తెలుస్తోంది.

**పరం సాహసికా తేషాం ధర్మనిష్ఠాతు యాతయా ।**
**నిర్దోషాణామసంఖ్యానాం రక్షాభవతి సర్వథా ॥ 34**

అటువంటి ధర్మనిష్ఠతో కూడిన సాహసవంతుల ప్రయత్నం వలన నిర్దోషులు, సత్ప్రవర్తకులు రక్షించబడతారు. అటువంటి రక్షణ బాధ్యత వహించినవారే ధర్మప్రవర్తకులౌతారు. ఎల్లవేళలా సాహసకృత్యంతో ధర్మమార్గంలో తాము నడుస్తూ, మిగిలినవారిని నడిపిస్తారు. సూర్యుడు తన కిరణాలతో చీకటిని పోగొడుతూ, మిగిలిన గ్రహాలకు, చంద్రునివంటి ఉపగ్రహానికి దారిచూపుతాడు. గ్రహణాల వంటి ఆటంకాలు ఎన్ని ఎదురైనా తన ప్రకాశధర్మాన్ని విడనాడని ధర్మపరుడు. అందుకే ప్రత్యక్ష నారాయణుడుగా కీర్తించబడుతున్నాడు.

**ఆతంక వాదినాం భంక్తుం సాహసం ప్రతి రోధనాత్ ।**
**అతిరిక్తం న మార్గం తత్ కిమప్యస్తి మహామునౌ ॥ 35**

ఓ మహామునీ! ధర్మాన్ని ఆటంకపరిచే దుష్టశక్తులను నిరోధించుటకు ప్రతిఘటన తప్ప వేరే మార్గం లేదు. వారిని అడ్డుకోవడం తప్ప ఇతర సామ, దాన, భేద ఉపాయాలు సరితూగవు. కావున దండోపాయమే సరియైన ఉపాయం.

**కః ప్రభావో హింసకేషు పశుష్వాస్తే చ దుర్జనాః ।**
**ధర్మోపదేశ బోద్ధారః కిం భవంతి విచార్యతామ్ ॥ 36**

పశుస్వభావం కలవారికి ఎటువంటి ధర్మోపదేశాలు తల కెక్కవు. ఒకవేళ పండితులు ఎంతచెప్పవలెనని ప్రయత్నించినా, వారి గర్వం, అహంకారం, అన్నీ తమకే తెలుసునన్న ధోరణి ఆ మంచి మాటలను విననివ్వవు. అందువల్ల వారు వాలివలే, దుర్యోధనునివలే, రాక్షసులవలే దురాగతాలు చేస్తూ, లోక పీడకులుగా మారతారు. ఎన్ని ఉపదేశాలు చేసినా ఫలితం ఉండదు.

**యద్యేవం సంభవేత్తర్హి రావణోఽంగదబోధితః ।**
**దుర్యోధనశ్చ కృష్ణేన నమ్రౌస్యాతం న బోధితః ॥ 37**

అటువంటి ఉపదేశాలు ప్రభావం చూపగలిగితే అంగదుని, హనుమంతుని ఉపదేశాలు రావణునిలో మార్పును తెచ్చి లంకా నగర నాశనాన్ని ఆపి ఉండేవి కదా! పులస్త్య బ్రహ్మ మనుమడు, నిష్ఠాగరిష్ఠుడు, వేదపండితుడైనప్పటికి, రావణుడు తన దుర్గుణాల వల్ల పెడత్రోవపట్టి, వంశనాశనానికి దారి తీసినవి. మహా భారతంలో కూడా ఇట్టి దుష్టచరితుడైన దుర్యోధనుడు మనకు కనపడతాడు. శ్రీకృష్ణుడు, విదురుడు, భీష్ముడు వంటి మహా మహులు ఎందరు ఎన్ని విధాలుగా ఉపదేశించినా దుర్యోధనుని నడవడి కురువంశ నాశనానికి దారి తీసింది.

**లంకాకాండస్య కింస్యాతాం మహాభారత కస్యచ ।**
**ఆవశ్యకతా యతోదే వ్రత్యాక్రమణ రక్షకాః ॥ 38**

లంకానగరం, హస్తినాపురాధీశుల దుష్ట ప్రవృత్తులు తెల్పే రామాయణ, మహాభారతాలు ఎన్ని ఉపదేశాలు చేసినా ఫలించ లేదు. చెడును తొలగించాలంటే, విష్ణువువలే అవతారాలు ధరించి, రాక్షస నాశనం చేయగలిగినప్పుడే సాధ్యమవుతుంది. తార ఉపదేశాన్ని నిర్లక్ష్యం చేసిన వాలివలే, మండోదరి సూచనలను వినని రావణునివలే ప్రతి దుష్టశక్తి నాశనం కాక తప్పదు.

**సహనేన సుగుణుత్యావా శాంతి ప్రార్థనయాపివా ।**
**అసురతాయాః కుత ఆస్త ఆత్మరక్ష సుసంభవ ॥ 39**

సహనంతో, సుగుణాలతో, శాంతి వచనాలతో, ప్రార్థనలతో అసురుల మనసులను అనునయించకపోగా, ఆత్మరక్షణ కూడా లభించదు. సత్పురుషులు ఉపదేశాలను ధిక్కరించే దానవ గుణం వలన వారి మాటలను వినకపోవటమేగాక, వారిని బాధించే ప్రయత్నం కూడా చేస్తారు. అందువల్ల ఆత్మరక్షణ కూడా కరువై, అరాచకం ప్రజ్వరిల్లుతుంటే, నిస్సహాయుల వలే చూస్తుండటం జరుగుతోంది నేటి సమాజంలో.

– సాధన నరసింహాచార్య

**కోపం చూపించవలసి వస్తే కోపాన్ని నటించండి**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-4

# మహా మానవులు



1915 అక్టోబరులో బెనారస్ హిందూ యూనివర్సిటీ చట్టం ఆమోదం పొందింది. నాలుగు నెలల తర్వాత మాఘ శుక్ల పాడ్యమినాడు విశ్వవిద్యాలయ స్థాపన జరిగింది. వైస్రాయ్ లార్డ్ హార్డింగ్ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేశారు. బెంగాల్ గవర్నరు, మూడు రాష్ట్రాల డిప్యూటి గవర్నర్లు, 12 మంది సామంతరాజులు, పలువురు విద్వాంసులు, జమిందార్లు, వాణిజ్య వేత్తలు నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనిబిసెంట్ స్థాపించిన సెంట్రల్ హిందూ కాలేజీ ఈ విశ్వ విద్యాలయంగా వికసించింది. అయిదు సంవత్సరాల క్రితం దీని స్థాపనకు సంకల్పం తీసుకోవటం జరిగింది. ఇందుకోసం అనిబిసెంట్, మహామనీషి మదన మోహన మాలవ్యా, దర్భంగ మహారాజు రామేశ్వర సింగ్‌లు కలసి పని ప్రారంభించారు. 50 లక్షల రూపాయలు బ్యాంకులో జమ చేసి, కోటి రూపాయల సేకరణ జరిగిన తర్వాత విశ్వవిద్యాలయం స్థాపించాలని నిర్ణయించారు.

ప్రభుత్వము, రాజులు కలసి ఈ నిధిని సేకరించగలిగేవారే. అయితే, సంపన్నుల సహకారంతోపాటు సామాన్య ప్రజల నుండి విరాళాలు సేకరించాలని మహామనీషి మాలవ్యాజీ సూచించారు. మామూలు వ్యక్తుల నుండి విరాళాలు సేకరించడంలోని ఉద్దేశ్యం వారితో ఆత్మీయతా బంధాన్ని ఏర్పరచుకోవడం. సంపన్నుల విశేష సహకారంతోపాటు చిన్న చిన్న అంశదానాలను కలుపుకుని 1913 మార్చి నాటికి 21 లక్షల రూపాయల సేకరణ జరిగింది. 50 లక్షల సేకరణ లక్ష్యాన్ని చేరడానికి మరో రెండు సంవత్సరాలు పట్టింది. బికనీర్, జోధపూర్, కాశ్మీరు సంస్థానాల నుండి లభించే వార్షిక విరాళాలు ఈ మొత్తంలో చేరి ఉన్నాయి. ప్రజా సహకారాన్ని సమీకరించవలసిందిగా విద్వాంసులకు, నాయకులకు, సామాజిక కార్యకర్తలకు, పురోహితులకు, ధార్మిక రంగ ప్రముఖులకు విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాలకు చెందిన వ్యక్తులు భారీ సంఖ్యలో ఇందుకు స్పందించారు. రాత్రింబవళ్ళు కృషి చేశారు. అయిదు సంవత్సరాలలో లక్ష్యంలో సగానికిపైగా పూర్తయింది. పిడికెడు ధాన్యం, పైసా, అణా, రెండణాలు ఇలా చిన్న చిన్న మొత్తాలు ఈ అంశదానంలో ఉన్నాయి.

బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం కోసం విరాళాలు సేకరిస్తున్న కొద్దిమంది వ్యక్తులలో పండిత రూపకిశోర్ శర్మ అగ్రగణ్యులు. ఆగ్రా సమీపంలోని ఆవల్‌ఖేడాలో నివసిస్తున్న పండిత రూపకిశోర్ శర్మ భాగవతంలో ఉద్దండ పండితులు. పురాణం చెప్పడానికి, ప్రవచనాలు ఇవ్వడానికి ఆయన సుదూర ప్రాంతాలకు వెళ్ళేవారు. ఆయన ప్రవచన పద్ధతి మహామనీషి మదనమోహన మాలవ్యాను ఎంతగానో ప్రభావితం చేసింది. వీరిద్దరూ కొంత కాలం ఒకే గురుకులంలో కలసి చదువుకున్నారు. అయితే భాగవతం పట్ల భక్తి గౌరవాలు వీరిద్దరి మధ్య గల స్నేహ సంబంధాలకు మూలాధారాలు. భాగవత పురాణం చెప్పేటప్పుడు సనాతన ధర్మం కోసం శ్రోతల సహకారాన్ని సమీకరించమని మాలవ్యాజీ పండిట్‌జీకి సూచించారు. ప్రజల నుండి చిన్న మొత్తాలలో విరాళాలు సేకరించాలనే నిర్ణయం జరిగిన తర్వాత, అందుకు కనీసం రూ. 11,000/-లు సేకరించవలసిందిగా మాలవ్యాజీ పండిట్‌జీని కోరారు. పండిట్‌జీ దశలవారీగా కొంత మొత్తం సేకరించి పంపారు.

బెనారస్ హిందూ విశ్వ విద్యాలయ స్థాపనలో ప్రముఖ పాత్ర వహించిన పెద్దగా ఆనాటి శంఖుస్థాపన కార్యక్రమాలలో పండిట్‌జీ కూడా పాల్గొన్నారు. వ్రజభూమిలోని కొందరు పురోహితులు, విద్వాంసులు కూడా ఆయనతోపాటు వచ్చారు. వారి కుటుంబాలు, బంధువర్గం కాశీ యాత్ర కూడా కలసి వస్తుందని వారితో వచ్చారు. ఒక ఐదు సంవత్సరాల బాలుడు కూడా వీరిలో ఉన్నాడు. పండిట్‌జీ తన సహచరులు ఇద్దరిని తీసుకుని శంఖుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లు చూడడానికి వెళ్ళారు.

శంఖుస్థాపన ఉత్సవాలు పెక్కు రోజులపాటు జరిగాయి. విద్యార్థులకు ఆధునిక విషయాలను బోధించడంతోపాటు సనాతన ధర్మంలోని, భారతీయ సంస్కృతిలోని మూల సూత్రాలను కూడా నేర్పాలన్నది విశ్వ విద్యాలయం యొక్క లక్ష్యం. విశ్వవిద్యాలయం హిందూ ధర్మ విజ్ఞానంలో ఉన్నత స్థాయి శిక్షణ ఇస్తుంది. అందరు, అన్ని మతాలకు చెందిన విద్యార్థులు చేరవచ్చు. విశ్వ విద్యాలయ నియమావళిలో పై విషయాలను పొందుపరచారు. రెండు ముఖ్య విషయాలను కూడా చేర్చారు. విశ్వ విద్యాలయ వ్యవస్థలో, నిర్వహణలో హిందూ మతాన్ని ఆమోదించే వారికే బాధ్యతలు అప్పగిస్తారు. పాలక వర్గంలో ప్రభుత్వేతర సభ్యులు అధిక సంఖ్యలో ఉంటారు. ఇలా విశ్వ విద్యాలయ స్వరూప స్వభావాలు పూర్తిగా సనాతన ధర్మానికి అనుగుణంగా ఉన్నాయి.

విశ్వ విద్యాలయం సంకుచితత్వంతో, మతతత్వంతో తిరోగమనవాదంతో కూడుకుని ఉన్నదని కొందరు విమర్శిస్తూ వచ్చారు. విశ్వ విద్యాలయం పేరు నుండి 'హిందూ' పదాన్ని తొలగించాలంటూ కొందరు ఒత్తిడి తేవడానికి ప్రయత్నించారు. శంఖుస్థాపన రోజు వరకు ఈ ప్రయత్నాలు సాగాయి. విశ్వ విద్యాలయం సూత్రధారులు మొదటి నుంచి వీటిని పట్టించు కోలేదు. హిందూ అనే పదాన్ని తొలగించాలని కోరేవారు పొరపడు

**కోపానికి బద్ధ శత్రువు ఓర్పు**

తున్నారని ఆ తర్వాత మహాత్మాగాంధీ కూడా ప్రకటించారు. నేడు ప్రసిద్ధి పొందిన బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం అనే పేరే దానికి ఉండాలని ఆయన చెప్పారు.

**తన శిష్యునితో దీక్షాగురువు కలయిక :**

హిందూ ధర్మవిజ్ఞానాన్ని ఉచ్చస్థాయిలో వ్యక్తీకరించడం కోసం విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు. కనుక శంఖుస్థాపన మహోత్సవంలో యజ్ఞయాగాలు, ప్రవచనాలు వంటి కార్యక్రమాలు ఉండడం సహజమే. పండిట్‌జీ ఈ కార్యక్రమాల నిర్వహణలో పాల్గొన్నారు. యజ్ఞయాగాలకు, ఇతర ధర్మ అనుష్ఠానాలకు వచ్చిన పురోహితులకు వసతి, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం, వారికి పట్టణాన్ని చూపించడం వంటి పనులలో ఆయన నిమగ్నమై ఉన్నారు. ఆ కార్యక్రమాలు ఒత్తిడి మధ్య ఆయన తన కుటుంబ సభ్యుల గురించి అసలు పట్టించుకోలేదు. ఎవరు ఎక్కడ ఉన్నారు? ఏమి తింటున్నారు? ఎక్కడ విశ్రాంతి తీసుకుంటున్నారు? అనే సంగతి ఆలోచించే అవకాశమే లేదు. అసలు వారి విషయమే ఆయన దృష్టిలో లేకుండా పోయింది.

ఉత్సవాలలో ఐదు రోజులు గడిచాయి. వసంత పంచమి రోజు వచ్చింది. విద్యా దేవత సరస్వతి అవతరించిన ఆ పర్వదినాన ఉపన్యాసాలు, గోష్ఠులు, అధికారుల సమావేశాలు నిర్ణీత కార్యక్రమం ప్రకారం జరుగుతున్నాయి. ఆ రోజున సరస్వతీ పూజను ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు. మామిడి ఆకులతో, అరటి బోదెలతో వేదికను అలంకరించారు. 60-70 మంది విద్యార్థులు, అధ్యాపకులు వేదిక ఎదురుగా కూర్చున్నారు. వేదిక ఎదుటనే యజ్ఞకుండం ఏర్పరచారు. మంత్రోచ్చారణతో యజ్ఞం ప్రారంభమయింది. మాలవ్యాజీ కర్మకాండలను నడిపిస్తున్నారు. ఎదురుగా కూర్చున్న విద్యార్థులు కూడా ఆ మంత్రాలను పఠిస్తున్నారు. ఈ పిల్లలలో పండిట్‌జీ పుత్రుడు శ్రీరామ్ కూడా ఉన్నాడు. అతడి వయస్సు 5-6 సంవత్సరాలు ఉంటుంది. మామూలుగా ఆ పిల్లవాడు తన తల్లితో, ఇతర కుటుంబ సభ్యులతో కలసి ఉండేవాడు. ఆ రోజున పండిట్‌జీ కొంత దూరాలోచన చేసి అతడిని అక్కడకు తీసుకువచ్చారు. సరస్వతీ పూజలో పాల్గొనడంతోపాటు, మాలవ్యాజీ సాన్నిధ్యంలో కొద్ది సమయం గడిపే సదవకాశం ఆ పిల్లవాడికి కలిగించాలని ఆయన భావించి ఉండవచ్చు.

సరస్వతీ పూజ యథావిధిగా జరుగుతోంది. పిల్లలు మంత్రాలను పఠిస్తున్నపుడు, వల్లిస్తున్నపుడు వాతావరణం మరింత మనోహరంగా రూపొందుతోంది. వాళ్ళు చిన్నపిల్లలు కదా! అప్పుడప్పుడు వారి ఉచ్చారణలో దోషం వస్తున్నది. కాని ఆ విషయం పట్టించుకున్న వారు లేరు. వారి ఉత్సాహాన్ని పెంచడమే సముచితమని అక్కడి పండితులు, అధ్యాపకులు భావించారు. ఈ పిల్లలలో అందరి కన్నా చిన్నవాడు శ్రీరామ్. ఇతడు మంత్రాలు పఠిస్తున్నపుడు మాలవ్యాజీ దృష్టి ఇతడి మీద పడింది. ఇంత చిన్న వయసులో బాలుడు మంత్రోచ్చారణ చేస్తూ ఉంటే, ఆయన కళ్ళు ఆర్పకుండా తదేకంగా చూస్తుండిపోయారు. సరస్వతీ పూజ ముగిసింది. ప్రసాద వితరణ పూర్తయింది. ఆ వెంటనే మాలవ్యాజీ ఆ బాలుడి దగ్గరకు వచ్చారు. చేతితో ఆప్యాయంగా అతడి తల నిమిరారు.

ఆయన సమీపించగానే శ్రీరామ్ ఆయన చరణాలకు ప్రణామం చేశాడు. "నాయనా! నీ తండ్రిగారు ఎవరు?" అని ఎంతో ముద్దుగా అతడిని అడిగారు. శ్రీరామ్ జవాబు చెప్పేలోగా పండిట్‌జీ మాలవ్యాజీ ముందుకు వచ్చారు. ఆయన ముందు వినమ్రంగా నిలబడి, మీ స్నేహ వాత్సల్యాలను పంచుకున్న నేనే అన్నారు. మాలవ్యాజీ ఆ బాలుడి గురించి మరి నాలుగైదు విషయాలు అడిగారు. అతడిని కాస్సేపు అలా నిశితంగా చూస్తూ ఉండిపోయారు. "ఇతడికి ఉపనయనం అయిందా?" అని అడిగారు. "త్వరలో చేయాలి. మీ చేతులతో జరిగితే మా అదృష్టం పండినట్లే" అని పండిట్‌జీ జవాబు చెప్పారు.

మాలవ్యాజీ ముఖంపై చిరునవ్వు వెలిగింది. తెల్లటి ఆయన మీసాల వెనుక విచ్చుకున్న ఆయన పెదవులు మందహాసాన్ని చిందించాయి. తన మనసులోని మాట పండిట్‌జీ నోటి వెంట వెలువడిందన్న భావం ఆ మందస్మిత వదనంలో కదలాడింది. 'నేను మంత్రదీక్ష ఇస్తాను. సంకల్పం జరిగిపోయింది కనుక ఈ బాలుడు ఇప్పటి నుండి దీక్షలో ఉన్నట్లే, ఇంకా క్రియ జరగలేదు. సంకల్పం జరిగింది కదా. దీక్ష ప్రారంభమయిందని భావించండి. తగు సమయంలో దీక్ష కూడా జరుగుతుంది" అని మాలవ్యాజీ అన్నారు.

ఆ శుభ ముహూర్తం కొద్ది సంవత్సరాల తర్వాత వచ్చింది. ఆ రోజున చుట్టు ప్రక్కల స్థలాలలో కార్యక్రమాలు జరిగాయి. అనిబిసెంట్ ఉపన్యాసం ఇవ్వవలసి ఉన్నది. మైసూరు మహారాజు కృష్ణరాజు వడయార్, డాక్టర్ సుందర్‌లాల్ మున్నగు ప్రముఖులతో మాలవ్యాజీ విడివిడిగా సంప్రదింపులు జరుపవలసి ఉంది.

ఆ శంఖుస్థాపన మహోత్సవం విశ్వవిద్యాలయ చరిత్రలో ప్రధానమైన ఘట్టం. చరిత్రకు కొత్త మలుపు ఇచ్చిన సంఘటనలు మరెన్నో జరిగాయి. ఈ మహోత్సవం ఫలితంగా సనాతన ధర్మ సంస్కృతులు నవనాగరిక విద్యావిధానంతో మేళవించి ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్టుగా పరిణితి చెందాయి. విద్య, ధనం, శక్తి, కళ, సాధన, శౌర్యం అనే పాయలుగల గంగ అక్కడ ప్రవహించింది. మహాత్మాగాంధీ జాతీయతా భావనలతో పొంగిపొరలే ప్రసంగాన్ని ఆ సందర్భంగా ఇచ్చారు. ఆ ప్రసంగంలో ఆయన ప్రతిభా మూర్తులకు పిలుపునిచ్చారు. ప్రతిభామూర్తులు తమ కర్తవ్యాలకు విముఖులు అయినారని ఆయన అన్నారు. గాంధీజీ ఆ ప్రసంగంలో రాజులు, మహారాజులను, సంపన్నులను తీవ్రంగా విమర్శించారు.

శ్రోతలలో రాజులు, మహారాజులు ఉన్నారు. గాంధీజీ చేసిన

**భయపడుతుంటే అది ఇంకా పెరిగిపోతుంది**

ఈ విమర్శకు వారు ఉద్రేకం పొందారు. కార్యక్రమాన్ని బహిష్కరించి, సభా మండపం నుంచి వెళ్ళిపోయారు. ఇలా వెళ్ళిన వారిలో అనిబిసెంట్ కూడా ఉన్నారు. మాలవ్యాజీ మాత్రం ప్రశాంతంగా కూర్చుని ఉండిపోయారు. కొందరు సభ విడిచి వెళ్ళిపోవడాన్ని ఆయన పట్టించుకోలేదు. ఎలాంటి ఒత్తిళ్ళకూ లొంగకుండా సత్యాన్ని స్వీకరించడం, దానికి అండగా నిలబడడం ప్రతిబించిన మరెన్నో సంఘటనలు ఆ రోజుల్లో జరిగాయి. వాటి సంస్కారాలు వాతావరణంలో జీర్ణించిపోయాయి. అక్కడికి వచ్చిన ప్రజల మనస్సులను ప్రభావితం చేశాయి.

**మాలవ్యాకు సహచరులు పండిట్‌జీ :**

మాలవ్యాజీ సహచరులలో పండిట్‌జీ చిరస్మరణీయులు. మాలవ్యాజీ రాజకీయాలలో, విద్యారంగంలో, సాంఘిక సంస్కరణలో, సేవా కార్యక్రమాలలో నిమగ్నులు అయ్యేవారు. అయినా, భాగవత కథాగానం, భాగవత తత్వములను వ్యాఖ్యానించే పని వారికి ప్రియతమమైన ధర్మానుష్ఠానం. పండిట్‌జీ తమ ప్రజ భూమిలో అపర వ్యాసుడుగా ప్రసిద్ధి పొందారు. తాను మాలవ్యాజీకి వినమ్ర శిష్యుడనని, అనుచరుడనని పండిట్‌జీ చెప్పుకునేవారు. ఆయన కార్యరంగం కొంతవరకు పరిమితమైనదే. అయినా మాలవ్యాజీ కథాకథన శైలికి ప్రాతినిధ్యం వహించే ప్రవక్తగా ప్రజ మండలంలో ఆయన పేరు ప్రఖ్యాతులు గడించారు. ఆ ప్రాంతం లోని రాజ కుటుంబాలలో పండిట్‌జీ పట్ల అపారమైన భక్తి, గౌరవాలుండేవి.

పురాణ ప్రవచనం మాటలు అల్లే కళ కాదు. ప్రవచనం ఇవ్వాలంటే మన మనసులోని మాటను అందంగా ఆకర్షణీయంగా చెప్పే సామర్థ్యం ఉండాలి. అయితే చెప్పే విషయం వెనుక విశ్వాస బలం కూడా ఉండాలి. ఆయా ఉపదేశాలను తమ జీవితాలకు అన్వయించుకోవడం వల్ల ఆ బలం వస్తుంది. భాగవతం కరుణ, భక్తి మేళవించిన శాస్త్రం. ఆ మహా పురాణం ప్రేత పిశాచాల కషాయ కల్మషాలను సైతం క్షాళన చేస్తుంది. భాగవత పురాణంలో దాని మహిమను వర్ణించేటప్పుడు మహాపిశాచం కథను తప్పకుండా వినిపిస్తారు. కరుణతత్వం, భక్తితత్వం పండిట్‌జీ జీవితంలో వెలుగుల వెల్లువవలె ప్రకాశించేవి. ఆయన సంపర్కం లోనికి వచ్చిన ఫలితంగా ఎందరెందరో తమ చెడు అలవాట్లను వదులుకున్నారు. అలా వ్యక్తులు తమ దోషాలకు, వికృతులకు పూర్తిగా దూరమైన సంఘటనలు కోకొల్లలు.

పండిట్‌జీ నివాసానికి కొద్ది దూరంలో ఉన్న అడవిలో నివసించే దాంధూ అనే బందిపోటు దొంగ తన వృత్తిని వదులుకున్న సంఘటన ఒకటి ఉన్నది. ఆ ప్రాంతంలో అతడు భయోత్పాతం సృష్టించాడు. అతడికి స్వంత ముఠా లేదు. అయితే అతడు మహా బలవంతుడు. 25-30 మందిని ఒంటరిగా ఎదుర్కొనే సామర్థ్యం అతడికి ఉన్నది.

పండిట్‌జీ పురాణం చెప్పడానికి వెళుతున్నారు. దారిలో దాంధూ ఎదురైనాడు. అతడు ఇలా అన్నాడు మీరు బ్రాహ్మణులు, పూజనీయులు. కనుక మిమ్మల్ని అగౌరవపరచను. అయినా నేను దొంగను. దొంగతనం మానివేస్తే నాకు, నా వాళ్ళకు జీవితం ఎలా గడుస్తుంది? మీ పై బలప్రయోగం చేయను. కానీ మీ దగ్గర ఉన్నదంతా మారుమాట లేకుండా నాకు ఇచ్చి వేయండి.

ఈ మాటలు దాంధూ తీవ్ర స్వరంతో అన్నాడు. మామూలు మనఃస్థితిగల వ్యక్తి అయితే అతడి ఉద్దండతకు, కఠోర స్వరానికి, దురాక్రమణ ధోరణికి వణికిపోతాడు. భయభ్రాంతులు కల్పించే అతడి వ్యక్తిత్వం పండిట్‌జీ మీద ఏ మాత్రం పని చేయలేదు. ఆయన ఎంత నిశ్చింతగా వెళుతున్నాడో అంత నిర్ద్వంద్వంగా నిలబడ్డారు. దాంధూ కళ్ళలోకి సూటిగా చూడసాగారు. తన బెదిరింపు ఎంతమాత్రం పనిచేయకపోవడం చూచి, ఆ దొంగ ఆశ్చర్యపోయాడు. అతడు ఇలా అన్నాడు "పండిట్‌జీ! నేను చెప్పింది మీరు విన్నారు కదా".

పండిట్‌జీ ఇలా అన్నారు "విన్నాను కాని నేను ఇప్పుడు దమ్మిడి అయినా ఇవ్వలేను. పురాణం వినడానికి నీవు నాతో వస్తే మాత్రం అక్కడ నాకు అందే దాన దక్షిణలుగా వచ్చిన మొత్తం నీకు ఇచ్చి వేస్తాను. ఇది నా వాగ్దానం"

దాంధూ కళ్ళు అలా తెరిచి ఉండిపోయాయి. మొదట కలిగిన ఆశ్చర్యం కన్నా మరింత గొప్ప ఆశ్చర్యం ఇప్పుడు అతడికి కలిగింది.


ఇద్దరి మధ్యా కొంతసేపు సంభాషణ జరిగింది. పండిట్‌జీ చెప్పిన ఏ మాట పనిచేసిందో పురాణం వినడానికి దాంధూ ఒప్పుకున్నాడు. ఆయన వెంట బయలుదేరాడు. భాగవత సప్తాహం ఏడు రోజులు శ్రద్ధగా విన్నాడు. పాత సంస్కారాలు మధ్యమధ్యలో వెలికి వచ్చేవి. ప్రజలను బెదిరించాలని, భయపెట్టాలని అనుకునే వాడు. అయితే ఆ స్థితి ఎక్కువ కాలం సాగలేదు. సప్తాహం పూర్తి కాగానే, పండిట్‌జీ తనకు అందిన దాన దక్షిణలను ప్రోగుచేసి దాంధూ చేతుల్లో పెట్టారు. రూపాయలు, పైసలు, నగలు, తిను బండారాలు ఆ మూటలో ఉన్నాయి. దొంగ ఆ మూట ఎత్తి, తలమీద పెట్టుకుని "స్వామీ! ఎక్కడికి వెళ్ళాలో సెలవీయండి, అన్నాడు". పండిట్‌జీ ఇలా అన్నారు "నీవు దీన్ని ఎక్కడికి తీసుకు వెళ్ళాలని అనుకుంటే అక్కడికి తీసుకువెళ్ళు. నేను నా మాట నిలబెట్టుకున్నాను".

దాంధూ ఆ మూట ఎత్తి ప్రక్కన పెట్టాడు. పండిట్‌జీ కాళ్ళమీద పడ్డాడు. అదే పనిగా ఏడుస్తూ ఇలా అన్నాడు. "స్వామీ! నాకు దారి దొరికింది. నన్ను క్షమించండి. ఇక నుంచి నిజాయితీగా కష్టించి పనిచేసి పొట్టపోసుకుంటాను. అలా వచ్చిన డబ్బుతోనే నా కుటుంబాన్ని పోషిస్తాను". పండిట్‌జీని బ్రతిమాలి, కాళ్ళావేళ్ళా పడి ఆ మూటను వారి ఇంటివద్దకు తీసుకువెళ్ళడానికి బయలుదేరాడు. అతడిని చూచినవాళ్ళు ఇతను బందిపోటు దొంగ దాంధూ యేనా అని విస్తుపోయారు.

*– అనువాదం : ఎ. వేణుగోపాలరెడ్డి*

**జీవితంలో ముందుకు పోవాలంటే భయాన్ని అధిగమించాలి**

# మస్తిష్కమే కల్పవృక్షం - 1



**కావలసింది సహజంగా పొందడం :**

అలాబామాలోని (అమెరికా) "గాడ్స్‌డెన్" అనే నగరం దగ్గర ఒక గ్రామంలో చదువుకొనే హైస్కూలు విద్యార్థికి తన మిత్రుణ్ణి ఆటపట్టించాలని కోరిక కలిగింది. వసంత ఋతువు వస్తుండగానే పూతపూసిన మామిడి చెట్ల మీద కోయిల కూర్చుని "కుహూ కుహూ" అని కూస్తూ ఉంటుంది మధురంగా. గ్రామంలోని పిల్లలు దాన్ని రెట్టిస్తూ "కుహూ కుహూ" అని అచ్చం కోయిలలాగానే పలుకుతూ సంతోషపడిపోతారు. అలాగే వినోదంగా ఆ విద్యార్థికి కూడా మిత్రుణ్ణి ఏడిపించాలని ఉద్దేశ్యం కలిగింది. కాని అతని పద్ధతి చాలా విలక్షణమైంది, అతీంద్రియ శక్తి కలది అనిపించేది.

ఆ విద్యార్థి పేరు "ఫ్రేంక్ రెన్స్". అతనికున్న గొప్ప శక్తి ఏమిటంటే తన స్నేహితుడు ఏం మాట్లాడినా సరే అవే మాటల్ని అదే పద్ధతిలో ఒక్క లిప్తపాటు కూడా ఆలస్యం చేయకుండా తిరిగి వల్లించగలిగేవాడు. (తన మనసులోనూ అదే భావం వచ్చి ప్రకటిస్తున్నట్లనిపిస్తుంది).

శాస్త్రజ్ఞులు అతని అతీంద్రియ శక్తిని పరీక్షించారు కాని ఆ రహస్యం ఏమిటో తెలుసుకోలేకపోయారు. నిజానికి ఫ్రేంక్ రెన్స్‌కి కూడా ఆ రహస్యం తెలియదు. ఈ విద్యార్థిలో ఇంకో విశేషం ఏమిటంటే పాఠ్యపుస్తకం ఒక్కసారి చదివితే చాలు ప్రతి అక్షరం అతనికి కంఠస్తం అయిపోయేది. ఒకసారి పరీక్షా పత్రాలలో అతనికి తెలియని ప్రశ్న వచ్చింది. ఆ సమయంలో ఈ అతీంద్రియ శక్తి సహాయం చేసింది. ఒక విద్యార్థి మరొక విద్యార్థికి ముఖ భంగిమలతో జవాబు చెప్తుంటే చూచి సరిగ్గా అదే జవాబు పత్రంలో వ్రాశాడు.

విద్యార్థి దశలోనే ఇతని అతీంద్రియ శక్తి అందరికి అవగతమయింది. త్వరలోనే అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. ఇతని చర్యలు చూసిన వాళ్ళంతా ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టి చూసేవారు. ఫ్రేంక్ రెన్స్‌కి అమెరికా భాష తెలుసు కాని ప్రపంచంలో అందరు మాట్లాడే ఏ భాషనయినా సరే ఆ భాష మాట్లాడేవారిలాగే అనుకరించి భావగర్భితంగా, ఉచ్చారణతో మాట్లాడటం ఇతని విశిష్టత. 'జేరీ ల్యూనర్ అని ప్రసిద్ధి చెందిన హాస్యనటుడు ఒక కార్యక్రమం పెట్టాడు. అందులో "జినా లోలా బ్రిగిడా" అనే పేరు కల ఒక స్త్రీ కూడా పాల్గొంది. రెన్స్ లాగానే బ్రిగిడా కూడా ప్రపంచ భాషలన్నీ మాట్లాడగలదు. బ్రిగిడా ఒక్కొక్క భాషలో ఒక్కొక్క వాక్యం మాట్లాడుతుంటే రెన్స్ ఆ వాక్యాన్ని అదే ఉచ్చారణతో వల్లించాడు. తరువాత ఆమె రష్యన్, ఫ్రెంచ్, హిందీ, జర్మన్, ఇంగ్లీషు అన్ని భాషలు కలిపి కిచిడీ చేసి మాట్లాడటం మొదలెట్టింది. ఆ కిచిడీ భాష కూడా ఉన్నదున్నట్లు రెన్స్ మాట్లాడాడు.

ఈ విన్యాసాలు చూచిన ఒక వ్యక్తి ఇలా అన్నాడు. "రెన్స్ మాట్లాడేవాళ్ళ పెదవుల కదలికలను సూక్ష్మంగా పరిశీలించి వాళ్ళు పలకబోయే శబ్దాన్ని పసిగట్టి మాట్లాడతాడు" అని. రెన్స్ ఇతరులు మాట్లాడేటప్పుడు వాళ్ళతోపాటే ఆ పదాలు వల్లిస్తాడు. ఎలా చేయగలుగుతాడో అంతుపట్టదు. తరువాత అతను మాట్లాడేవారి ఎదుట నిలబడకుండా వారి వెనుక నిలబడి మాట్లాడటం ప్రారంభించాడు.

రెన్స్ ఆహార విహారాలు, సాత్వికమైన, ధార్మికమైన ఆలోచనల విషయంలో జాగ్రత్తగా ఉండేవాడు. "నేను చూపించే ప్రజ్ఞ ఒక్కసారిగా రాదు ముందునుంచి నేనెంతో ప్రయత్నం చేశాను" అంటాడతడు. ఆహార విహారాల విషయంలో ఒకవేళ ఏదైనా లోపం, తప్పు జరిగితే నేను నా ప్రదర్శన చేయబోయే ముందు అవసరమైన పరిశుద్ధి సాధన చేసి నా ప్రదర్శన ప్రారంభిస్తాను.

ఒకసారి న్యూయార్కులో ఇతనిపై అద్భుతమైన పరీక్ష జరిగింది. దాని కోసం ఒక డాక్టరుని నియమించారు. ఆయన శాస్త్ర సంబంధమైన ఒక 20 పేజీల వ్యాసం తయారు చేశాడు. అందులో వైద్యశాస్త్రానికి సంబంధించిన కొన్ని కఠిన శబ్దాలు ఎన్ని సార్లో ప్రయోగించాడు. ఆ శబ్దాలకి అర్థం చెప్పడం మహా మహా డాక్టర్లకి కూడా తెలియదు సరికదా, కనీసం స్పష్టంగా ఆ శబ్దాలను పలకలేరు కూడా! డాక్టరు ఒక మూలనుంచున్నాడు, రెన్స్ మరో మూలనుంచున్నాడు. రెన్స్ ఎదురుగుండా టేప్ రికార్డర్ ఉన్నది. డాక్టర్ ఉపన్యాసం చదువుతూ పోతున్నాడు. రెన్స్ వెంట వెంటనే దాన్ని వల్లిస్తున్నాడు. తరువాత టేప్ రికార్డర్ ఆన్ చేసి వింటే ప్రజలు ఆశ్చర్యంతో ముక్కు మీద వేలు వేసుకొన్నారు. మామూలు చదువు చదువుకొన్న రెన్స్ ఇంత కఠినమైన శబ్దాల్ని సునాయాసంగా, స్పష్టంగా చెప్పగలిగాడు. మనిషి యొక్క మనస్సుకు ఉన్న శక్తిని చూచి విస్మయం చెందారు.

టెలిఫోన్‌లోను, టెలివిజన్‌లోను రెన్స్ తన కార్యక్రమాలు నిర్వర్తించి పైన చెప్పిన నిజాలని ఋజువు చేసుకొన్నాడు. ఎంత దూరంలో ఉన్న వ్యక్తి అయినా సరే టెలిఫోన్‌లో ఏ భాషలో మాట్లాడినా సరే రెన్స్ చేతిలో ఫోను పట్టుకొని వింటూ ఆ

**భయం వల్ల వచ్చిన అవకాశాలను వదలుకుంటారు**

మాటలన్నిటికి వల్లిస్తాడు. పెదవుల కదలిక పట్టి గుర్తు పడుతున్నాడా అంటే అవతల వ్యక్తి రెన్స్‌కి కనపడదు. ఎంతో దూరంలో ఉంటాడు. టెలివిజన్‌లో అయినా అంతే. 1980 నాటికి రెన్స్ టెలివిజన్‌లో 25 కార్యక్రమాలు చేశాడు. జెరీ ల్యూవిస్ జాన్‌సన్, జైక్‌పార్‌లతో కలసి "ఐ హేవ్ గాట్ ఎ సీక్రెట్ టునైట్" అనే కార్యక్రమములలో పాల్గొని ప్రజలను ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఇది ఎంత ఆశ్చర్యంలో ముంచినా, కేవలం వినోదం కోసమే జరిగింది. "నా అంతరాత్మ ఒక్కొక్కసారి పలుకుతుంది" ముందు ముందు ప్రజలలో ఇటువంటి అతీంద్రియశక్తులు పుట్టి సామాన్యంగా అనిపిస్తాయి" అని "ఈ శక్తులు ఏదైనా గొప్పగొప్ప పనులకు ఉపయోగపడతగ్గవి" అని రెన్స్ చెప్తాడు. నేను ఈ దిశలోనే పనిచేయాలని నాకనిపిస్తున్నది. ఈ ప్రేరణ ఎక్కడి నుంచి వస్తున్నది? ఎందుకు వస్తున్నది? అంటే రెన్స్ కూడా తెలుసు కోలేదు.

మానసిక శక్తుల వికాసం నుంచే ఈ సామర్థ్యాలు జన్మిస్తాయి. సాధన, తపస్సు, అనుష్ఠానం మొదలైన వాటి ద్వారా మనో చైతన్యాన్ని ఈ స్థాయికి తేగలుగుతారు. కాని నిజానికి ఇవి మానసిక శక్తులే! ఆలోచన చేసేది మస్తిష్కం అంటారు. ఏదైనా కార్యక్రమం నిర్వహించాలంటే కావలసిన ఏర్పాట్లు, పనిముట్లు సమకూర్చడం కఠిన సమస్యలకి సమాధానం వెతకడం దాని పని.

దీని వెనుక అచేతన మనస్సు అనే పొర ఉంటుంది. అది రక్త సంచారం, గుండె కొట్టుకోవడం, శ్వాస-నిశ్వాసాలు, సంకోచ-వ్యాకోచాలు, కనురెప్పలు తెరవడం-మూయడం, నిద్ర-మెళకువ ఇలా అనవరతంగా సాగే శారీరిక క్రియా-ప్రక్రియల యొక్క స్వసంచాలిత విధి-విధానాలను నియంత్రిస్తూ ఉంటుంది.

అచేతన మనస్సులో అలవాట్లు జమ అవుతాయి. అవసరాలను తీర్చుటకై చేతన మనస్సు పనిచేస్తుంది. మస్తిష్కం యొక్క కార్యక్రమం ఇక్కడే పూర్తి అవుతుంది అని చెప్పాలి.

ఇంకా ముందుకుపోతే గారడీలతో నిండిన ప్రపంచం ప్రత్యక్షమవుతుంది. దీని అనుభూతి కలుగుతుంది కాని కారణము సిద్ధాంతము అర్థం కావు. ఈ విధమైన అనుభూతులు అతీంద్రియ మనోచేతనకి సంబంధించినవే అవుతాయి. భూతకాలంలోని అవిజ్ఞాత ఘటనల పరిచయం, భవిష్యత్తులో జరుగబోయే ఘటనల ఎరుక, దూర దూర వ్యక్తులతో ఆలోచనలు పంచుకోవడం, అదృశ్య ఆత్మలతో సంబంధం, పూర్వజన్మల స్మృతి, చమత్కారమైన రిద్ధి-సిద్ధులు, శాపాలు-వరదానాలు, ఇవన్నీ అతీంద్రియ అనుభూతులుగా పేర్కొనవచ్చు. మానవుని వ్యక్తిత్వపు స్థాయి ఈ ఉపచేతనా పొరలలో అంతర్నిహితంగా ఉంటుంది. శాస్త్రజ్ఞులు దీనిని "పేరాసైకికల తత్వం (పేరా సైకాలజి)" అంటారు. ఈనాడు ఈ విషయమై పరిశోధనలు నడుస్తున్నాయి. వాటిని "పరా మనోవిజ్ఞానం" లేక "పేరా సైకాలజీ" అని పిలుస్తున్నారు.

స్థూల, కారణ శరీరాల మధ్య ఒక సూక్ష్మ శరీరం కూడా ఉంటుంది. మూడు రకాల శరీరాలలో స్థూల శరీరంలో జ్ఞానేంద్రియాల, కర్మేంద్రియాల కలయిక ఉంది. సూక్ష్మ శరీరాన్ని మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే నాలుగు పొరలుగా విభజించవచ్చు. మనోవైజ్ఞానికులు దీనిని చేతన-అచేతన మనస్సులుగా విభజిస్తారు. వీటిని ఇంకా విభాగాలు చేసి, ఎన్నో రకాలుగా ఈ క్షేత్రాన్ని స్థితిగతుల్ని తెలుసుకోడానికి ప్రయత్నం చేస్తారు. కారణ శరీరాన్ని అంతరాత్మ అంటారు. అనుభూతులు, విశ్వాసాలు ఈ క్షేత్రంలో నివాసముంటాయి. ప్రత్యాహార, ధారణ, ధ్యానము, సమాధుల ద్వారా యోగులు ఈ క్షేత్రాన్ని మేల్కొల్పి సంస్కరించడానికి కృషి చేస్తారు.

అతీంద్రియ సామర్థ్యము సూక్ష్మశరీరం యొక్క మస్తిష్క చైతన్యం యొక్క విషయము. ఇంద్రియ శక్తుల ద్వారానే మానవుడు తన అనుభవాలను పొందుతాడు. ఈ ప్రయాసలో ఎంత దొరికితే అంతతోనే పనిగడుపుకొంటాడు. బ్రహ్మాండంలోని చైతన్యంతో సంబంధం పెట్టుకోగల శక్తి, ఆ క్షేత్రంలోని అనుభవాలను పొందగలిగే శక్తి మస్తిష్కానికి ఉన్నది. వికసించని స్థితిలో జ్ఞాన సంపాదన కొరకు ఇంద్రియాల మీదే ఆధారపడవలసి ఉన్నది. అవి ఎన్ని అనుభూతులను ఇవ్వగలుగుతాయో అంతగా వ్యక్తి యొక్క జ్ఞానభాండారం నిండుతుంది. మస్తిష్కంలోని చైతన్యం నడుస్తున్న రోజులు లేదా వెనుకటి ప్రయత్నాలతో అనుకున్న దానికంటే ఎక్కువ అభివృద్ధి కలిగితే, ఇంద్రియాల సహాయం లేకుండానే దగ్గర సంఘటనలు, దూరంగా జరిగే సంఘటనలు ఆచూకి తెలుస్తుంటుంది. అంతే కాకుండా బ్రహ్మాండంలో వ్యాప్తి చెందిన జ్ఞాన-విజ్ఞానాల లెక్కలేని ప్రవాహాలతో సంపర్కం కూడా కలుగుతుంది. ప్రయత్నపూర్వకంగా కొంచెం కొంచెం నెమ్మది నెమ్మదిగా దీనిని సంపాదించుకోగలరు. కాని అక్షయమైన రత్న భాండారంపై అధికారం హస్తగతమైతే అనాయాసంగా ధన కుబేరులు కాగలరు. అంతరిక్షంలోని అంతరాళంలో లెక్క లేనంత మంది మహానుభావుల జ్ఞాన సంపద చెల్లాచెదురుగా పడి ఉన్నది. సూక్ష్మ శరీరం ఆ జ్ఞాన భాండారంతో సంబంధం కలపగలదు. తన అనుభూతులని స్వల్ప సమయంలోని విస్తరింప చేయగలదు. ఇలా చేయడం మామూలు ప్రయత్నాలతో జరిగేవి కావు.

మానవుని యొక్క ఉపచేతన మనస్సు మస్తిష్కమనే గూటిలో ఉంటుంది. కాని దానిలో ఉండిపోవలసిన అవసరం దానికి లేదు.

**తల్లిదండ్రుల పట్ల ఉండవలసినది భయం కాదు అభిమానం**

దేశ, కాలాలను అతీతంగా వేల సంవత్సరాల పూర్వం జరిగినవి, వేల మైళ్ళ దూరంలో జరిగిన ఘటనలు ఇప్పుడే కళ్ళ ఎదుటే జరుగుతున్నట్లు చూడగలదు. చేతన మస్తిష్కం యొక్క ఒత్తిడి ఉప చేతన మనస్సు మీద నుంచి తొలగిపోతే, అది స్వేచ్ఛగా విహరించే అవకాశం పొందితే దాని జ్ఞానము, వేగము అనంతమై పోతుంది.

చాలా ప్రాణులలో ఈ సామర్థ్యం పుట్టుకతోనే వస్తుంది. ఇప్పుడు అటువంటి ప్రాణుల సామర్థ్యాలను వైజ్ఞానిక ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు. రేడియో సక్రియత కొలత ప్రమాణం కోసం ఫ్రెంచి వైజ్ఞానికులు "గాహగర్-బావుంటర్" అనే యంత్రం తయారుచేశారు. దీని ఖరీదు లక్షల డాలర్లు. చీమలలో ఈ సూక్ష్మ సంవేదన పుట్టుకతోనే ఉన్నదని ఈ మధ్య జీవ శాస్త్రజ్ఞులు పేర్కొనడంతో ఈ యంత్రాల తయారి ఆపివేశారు. ఈ ప్రయోగాలకి చీమలను ఉపయోగించుకుంటున్నారు.

వెదురు చెట్లకి పూలు కనుపించవు. వాటి వేళ్ళ దగ్గరే కొత్త మొలకలు ఏర్పడుతాయి. కాని 50 సంవత్సరాలకొకసారి అది పూస్తుంది. అవి కాయలవుతాయి కూడా! ఒక ఎలుక వంశవృద్ధి 50 సంవత్సరాల వ్యవధిలో అంచనా వేస్తే ఆ పాటికి దానికి మునిమనుమలు కూడా పుడతారు. ఎలుకలకి వెదురుకు పళ్ళు కాస్తాయి అని తెలియదు కాని వాటికి సుగంధ పరిమళాస్వాదన బుద్ధితో ఆ ఫలాల ఉపయోగం తెలుసుకొని వాటిని తెగ తింటుంది. దానివలన ఎలుకకు సంతానోత్పత్తి శక్తి ఎన్నో రెట్లు పెరుగుతుందిట. కాని వాటికి జ్ఞానం ఎలా కలిగింది అనే విషయం జీవశాస్త్రజ్ఞులు అర్థం చేసుకోలేకపోయారు.

భూటాన్ రాజు "వాంగ్ చుక్ జిగ్మెదోర్గీ" పై ఎవరో బాంబు విసిరారు. ఇది 1965 నాటి సంగతి. ఆక్రమణకారుల జాడ తెలుసుకోలేకపోయారు. గొప్ప సి.ఐ.డి.లు కూడా విఫలమయ్యారు. చివరికి ఈ బాధ్యత సైన్యానికి అప్పగించబడింది. సేనాధికారులు శిక్షణ పొందిన అలెక్సీ అనే కుక్కను ఎన్నుకొన్నారు. హ్యాండ్ గ్రెనేడ్ ముక్కను వాసన చూపిచ్చారు. ఆ ముక్కపై తుపాకి మందు వాసన తప్ప వేరే వాసనలుండటం ఎంతో విలక్షణమైన సంగతి. కాని కుక్క ఆ ముక్కపై పూతగా ఉన్న మనిషి వాసనని చమత్కారంగా కనిపెట్టింది. మహల్‌లో ఒకవైపుకి వెళ్ళింది. సంఘటన జరిగి కొంతకాలమయింది. అక్కడ ఆ వాసన బాగా తగ్గిపోయి ఉండవచ్చు. కాని కుక్క అక్కడి నుంచి మూడు మైళ్ళ దూరంలో ఉన్న ఒక ఇంటిదగ్గర ఆగింది. అక్కడి నుంచి బయలుదేరి ఒక బౌద్ధ మందిరంలో దూరింది. అక్కడ ఒక వ్యక్తి దాక్కున్నాడు. కుక్క సంకేతంతో వాడిని పట్టుకొన్నారు. అతను నేరం చేసానని ఒప్పుకున్నాడు.

అడవిలో సింహం కూర్చుని ఉంటుంది. లేడి ఆ చుట్టుప్రక్కలే పసరిక గడ్డి మేస్తూ ఉంటుంది. కాని దానికి భయం ఉండదు, కంగారు ఉండదు. ఎందుకంటే సింహానికి ఆకలి వేస్తే కాని వేటాడదు అని దానికి ఖచ్చితంగా తెలుసు. అప్పుడు ఎటువంటి భయము లేదు. సింహము మనసులోని విషయం లేడికి ఎలా తెలుస్తుంది? ఈ ఆశ్చర్యకరమైన విషయం గురించి జీవ వైజ్ఞానికులు పరిశోధన చేసినా అంతుచిక్కలేదు. ఆడ సింహం ఎప్పుడైనా తనతో సమానమైన శత్రువుతో పోరాడటానికి వెళ్ళవలసి వస్తే తన సంతానాన్ని ఒక సురక్షితమైన స్థానంలో దాచి వెళ్తుంది. పిల్లల కంటపడకుండా యుద్ధం చేస్తుంది. పిల్లలు తల్లి చెప్పిన చోటే ఉంటాయి. యుద్ధం సమాప్తం అయిపోయిందని తల్లి జయించిందని గ్రహించి పిలవకుండానే తల్లి దగ్గరకు వచ్చేస్తాయి. వాటికి ఆ అనుభూతి ఎలా కలుగుతుందో ఆ పరమాత్ముడికే ఎరుక!

ఇంతకు ముందు జరిగినవి, దూర సంచారం, భవిష్యత్తు గురించి కలలో సంకేతాలు కనిపించడం వీటన్నిటికి ఆధునిక మనోవైజ్ఞానికులు అయిదు జ్ఞానేంద్రియాలు కాక వేరే "సిక్స్ సెన్స్" అని పేరు పెట్టారు. ఈ ఆరవ అనుభూతి విషయంలో ఈ రోజుల్లో కుతూహలంతో పరిశోధనలు జరుగుతున్నాయి.

మనుష్యులలోనే కాక జంతువులలో కూడా ఈ విధమైన సూక్ష్మ తరమైన సామర్థ్యాలు కలిగి ఉండటం ఆశ్చర్యకరమైన విషయం. సముద్రంలో ఓడ ప్రయాణిస్తుండగా ఎక్కడినుంచయినా ఎలుక పారిపోతుంటే ముందు ముందు ఏదో సంకటం రాబోతున్నదని భావిస్తారు. ఈనాటికి, అత్యాధునికమైన యంత్రాలు కూడా సరియైన సమయానికి సరియైన సమాచారాన్ని అందించ లేకపోతున్నాయి.

బర్మాలోని కలాదానఘాట్‌లో ఒక పిల్లికి ఒక విచిత్రమైన సమాధి ఉంది. దానికి నాలుగు వైపులా ఇలా వ్రాసి ఉంది. "రైడీగారి ఈ పిల్లి సమయానికి సహాయపడకపోతే చనిపోయే వాళ్ళం, ఓడిపోయేవాళ్ళం" ప్రాణులలో ఉన్న అద్భుతమైన ఈ అతీంద్రియ సామర్థ్యం యొక్క చరిత్ర దీనిలో నిక్షిప్తమై ఉంది. చాలాకాలం క్రితం సంగతి. ఆ రోజుల్లో బర్మాలో ఇంగ్లీషు సైన్యానికి, జపాన్ సైన్యానికి మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకరోజు ఆంగ్లేయుల సేన జపాను సేనపై దండెత్తింది. జపాను వారు వెనక్కి తగ్గుతున్నట్లుగా నాటకం ఆడారు. నిజానికి వాళ్ళు వెనక్కి వెళ్ళలేదు. కందకాలలో దాక్కున్నారు. జపాను వాళ్ళు పారిపోయారనుకొన్నారు. జపానీయులు అప్పుడే వండి వేడి వేడి భోజన పదార్థాలు బల్లపై వదిలి వెళ్ళారు. ఆంగ్లేయ సైనికులు

**పై అధికారి పట్ల ఉండవలసినది భయం కాదు, గౌరవం**

ఆహార పదార్థాలపై ఒక్కుమ్మడిగా విరుచుకుపడ్డారు. వాళ్ళు ఇంకా ప్లేట్లు చేతిలోకి తీసుకోకముందే, వారి సైన్యంలోని సార్జెంట్ రైడీ గారి నల్లపిల్లి ఆహారం మీదకు దూకింది. ఘోరంగా గుర్రుగుర్రు మంటూ అరిచి ఆంగ్ల సైనికుల్ని వెనక్కి నెట్టింది. ఆంగ్లేయులు పిల్లిని బెదిరించారు, కాని పిల్లి కోపంగా గుర్రుగుర్రుమంటూనే ఉంది. అప్పుడే భయంకరమైన శబ్దం వినిపించింది పిల్లి అరుపులు ఆగిపోయాయి. నిజానికి ఆ భోజనానికి మందుగుండు సౌరంగానికి సంబంధం ఉంది. దానివల్ల సైనికుల ప్రాణాలు ఎగిరిపోయే ప్రమాదం ఉన్నది. పిల్లి ఆత్మాహుతి చేసుకొని తన స్వామిభక్తిని ప్రకటించింది. పిల్లి యొక్క ఈ త్యాగం మరో సందేశం అందించింది "మనం వేటిని తుచ్ఛంగా, పనికిరానివిగా అను కొంటామో వాటిలో కూడా విలక్షణమైన ఆత్మగుణాలు అతీంద్రియ సామర్థ్యం ఉంటుందని" అందుకే ఆ పిల్లికి సమాధి కట్టారు.

ఆంగ్లేయులు జర్మనీ వారితో యుద్ధం చేసేటప్పుడు క్రైంబర్‌వేల్ అనే చోట ఒక సంఘటన జరిగింది. మిస్టర్ జ్యోఫరీ అనే ఆయన ఒక పిల్లిని పెంచేవాడు. జర్మనీ వాళ్ళ బాంబులు పేల్చే ఓడ క్రైంబర్‌వేల్ మీదుగా వెళ్ళింది. కుటుంబంలోని వారు కంగారుపడి ఓ మూల కూర్చున్నారు. అప్పుడు వారి పిల్లి తోటలో స్నానాల గదిలోంచి దీనంగా మ్యావ్ మ్యావ్ అంటూ అరవసాగింది. జ్యోఫరీ దాన్ని లోపలికి రమ్మని పిలిచాడు. ఎంత పిలిచినా పిల్లి రాకపోవడంతో జ్యోఫరీ పిల్లి మరణావస్థలో ఉన్నది అనుకొన్నాడు. కుటుంబమంతా దాని దగ్గరకు చేరారు. వాళ్ళంతా స్నానాల గదిలో అడుగుపెట్టారో లేదో ఓడలోంచి వాళ్ళు బాంబులు కురిపించారు. వారి ఇల్లు విస్ఫోటంతో కుప్పకూలి బూడిద అయిపోయింది. పిల్లికున్న అతీంద్రియ శక్తి వలననే ఆ కుటుంబం రక్షింపబడింది.

న్యూరో సైక్యాట్రిక్ సంస్థానం కాలిఫోర్నియా డైరెక్టర్ ప్రొఫెసర్ క్రెగ్‌కు నియేశన్ అని పేరుగల ఒక మహిళ గురించి తెలిసింది. ఎవరయినా అజ్ఞాత వ్యక్తి యొక్క వస్తువును స్పృశించి ఆమె ఆ వ్యక్తి యొక్క రహస్యాలన్నీ చెప్పగలదట! గడచిపోయిన సంఘటనలే కాదు. జరుగుచున్నవి, జరుగబోయేవి అన్ని చెప్పి నిజం నిరూపించుకొందిట. ప్రపంచంలో ఎంతో దూరంలో ఉన్న వ్యక్తితో మాట్లాడటానికి సైన్సు టెలిఫోన్ కనిపెట్టింది, తీగలు లేని తంతి, మైక్రోవేవ్ యంత్రాలు కనిపెట్టబడ్డాయి. ఋతువులు వాటి పరివర్తన గురించిన సమాచారం అందించే యంత్రాలు కనిపెట్టబడ్డాయి. కాని ప్రపంచంలోని కోట్ల సంఖ్యలో వ్యక్తులలో ఎవరిదయినా సరే తెలియనివి, విశ్వాసనీయమైనవి, గోపనీయమైన విషయాలు భూత, భవిష్యత్, వర్తమానాలలోనివి నిజంగా చెప్పగలగడం సైన్స్‌కు ఒక సవాలు.

ప్రొఫెసర్ క్రెగ్ శ్రీమతి నియేశన్‌ని ఒక గదిలో ఉంచి ఆమెకు ఏ మాత్రం పరిచయంలేని ఒక వ్యక్తి యొక్క వస్తువును ఆమెకు ఇచ్చాడు. ఆ వస్తువును ఆమె చేతిలోకి తీసుకోగానే ఆ వ్యక్తి యొక్క రూపురేఖలు మాత్రమేకాక ఆమె గత జన్మలో ఆ వ్యక్తి జీవితంలో జరిగిన ఘటనలను సినిమా చూస్తున్నట్లుగా ఆమె వివరించేది. ఎడమ్ అనే వేరొక అమ్మాయికున్న అతీంద్రియ శక్తి గురించి వ్రాస్తూ ప్రొఫెసర్ క్రెగ్ "ఆమె వాసన చూసి, టెలిఫోన్ పట్టుకొని దూరపు వస్తువులను గురించి పుస్తకంలో చదువు తున్నట్లుగా చెప్తుంది.


ఈ సంఘటనలన్నీ ప్రొఫెసర్ క్రెగ్ పరామనోవిజ్ఞానం 1) దూరానుభూతిని 2) క్లెయర్ వాయన్స్ 3) దూరదృష్టి 4) ఆలోచన సంచాలన (టెలిపతీ)లకు సంబంధించిన ఘటనల ప్రామాణికంగా పరిశోధనలు చేశారు. వాటివల్ల మానవుని విలక్షణమైన అతీంద్రియ సామర్థ్యం తెలిసింది. కాని ఈ ఘటనలను వీటిలో ఏ వర్గంలోనూ పెట్టలేము.

సుప్రసిద్ధ వైజ్ఞానికుడు ప్రొఫెసర్ ఫర్డినెండ్ వాన్ న్యూట్రాయిటర్‌కు ఆయన సహోద్యోగి. ఒక విషయం చెప్పాడు. ఒక ల్యూథినియన్ బాలుడు ఏ భాషనుంచయినా, ఎంత పెద్ద వాక్యంగాని, గద్యంగాని, పద్యంగాని చెపితే ఆ బాలుడు అదే భాషలో కామా, ఫుల్‌స్టాప్‌లతోసహా తిరిగి చెప్తాడు. అంతేకాదు, మీరు మాట మాట్లాడటం ప్రారంభించగానే ఆ బాలుడు స్వయంగా అదే శబ్దం, అదే మలుపు, ఒడుపులతో మీతో కలిసి మాట్లాడతాడు, అది ఇదివరకే కంఠస్థం చేసి ఉన్నట్లుగా చెప్తాడు" అని ప్రొఫెసర్ ఫర్డినెండ్ అన్నాడు. పెదవుల కదలికను పట్టి ఉచ్ఛారణ తెలుసుకోవడంలో సిద్ధహస్తుడేమో! అని స్వయంగా పరీక్షించాలని నిర్ణయించుకొన్నాడు. ఆ బాలుణ్ణి ఒక గదిలో కూర్చోబెట్టాడు, రెండో వ్యక్తిని మరో గదిలో కూర్చోబెట్టి "నువ్వు ఎన్నో భాషల్ని కదంబంలా కూర్చి మార్చి మార్చి మాట్లాడుతూ ఉండు" అని చెప్పాడు. రెండు గదులలోనూ మైక్‌లు పెట్టి, ఒక మైక్‌ను ఎదురుకుండా గదిలోపెట్టి ప్రొ॥ ఫర్డినెండ్ అక్కడ కూర్చున్నాడు. ప్రయోగం ప్రారంభం అయింది. సామాన్యంగా ఒకటి రెండు భాషలు అందరికి వస్తాయి. కాని ఇదేమిట్రా ఈ పిల్లవాడు ఏ భాష పిల్లవాణ్ణి అక్కడ నుంచోపెడితే ఆ భాషలోనే మాట్లాడుతున్నాడు. ఎంత ఆశ్చర్యం? చదవకుండా అన్ని భాషలలో నిష్ణాతులు కావడం భౌతిక సిద్ధాంతాలలో సంభవం కాదు.

(సశేషం)

– *అనువాదం: శ్రీమతి టి. జ్ఞానప్రసూన*

**పిల్లలకు భయాన్నీ నూరిపోయకూడదు**



సూర్యసాధనా సంవత్సర ప్రత్యేకం

# సూర్యుని మహత్తు

సూర్యుడు ఈ ప్రపంచానికే ఆత్మ. ప్రపంచం యొక్క భౌతిక వికాసమంతా సూర్యుడి మీదే ఆధారపడి ఉన్నది. సూర్య శక్తి లేకుండా మొక్కలు పెరగవు, గాలి వీయదు, నీరు దొరకదు, చికిత్స కుదరదు. సూర్యుడు లేకపోతే మనం పుట్టడం మాట పక్కనపెడితే అసలు భూమి కూడా పుట్టుండదు.

ప్రకృతికి కేంద్రం సూర్యుడు. అన్ని శక్తులు సూర్యుడి నుండే లభిస్తాయి. ఆత్మ లేకుండా శరీరానికి అస్తిత్వం లేనట్టే సూర్యుడు లేకుండా జగత్తు లేదు. భ్రమరం తన జీవనోపాధి కోసం పువ్వు చుట్టూ తిరిగినట్టు, పృథ్వి కూడా తన జీవన రక్షణకు అవసరమయ్యే సామగ్రి కోసం సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తుంటుంది. భూదేవి మనకు తల్లి, సూర్యుడు తండ్రి. ఈ ఇరువురి రజవీర్యాలతోనే మనం జీవితాన్ని పొందాము. సూర్యతాపంతో శరీరంలోని ద్రవాలు పరిణితి పొందుతాయి. శక్తుల వికాసం, అవయవాల పౌష్టికత, మల నివృత్తి అన్నీ ఆ గొప్ప శక్తి మీదే ఆధారపడ్డాయి. ఇవి శరీరం జీవించటానికి కావలసిన సామాగ్రి, వాటి వికాసం, నిర్ధారణలకు సంబంధించిన విషయాలు. జడచైతన్య జీవధార లన్నింటిలో ఈ సాధారణ క్రమం కొనసాగుతూనే ఉంటుంది.

కష్టకాలంలో సూర్యుడి నుండి అసాధారణమైన సహాయం మనకు లభిస్తుంది. భాస్కరుని ప్రచండ రోగనాశక శక్తితో గడ్డు రోగాలన్నీ పోతాయి. కళ్ళ ముందున్న ఉదాహరణలను పరిశీలిద్దాం. **పగలు రాత్రి తేడా లేకుండా కష్టపడి, రోజుల తరబడి ఆకలి దప్పికలతో, పౌష్టిక ఆహారం అంటే ఏమిటో తెలియని రైతులు కఠోరమైన కాయకష్టం చేసినా ఆరోగ్యంగా, ధృఢంగా ఉంటారు. రోగాలు వారి జోలికి కూడా రావు. పొరపాటున వచ్చినా ఓ నాలుగు రోజుల్లో ఏ మందులు వాడకుండానే వాటంతటవే తగ్గిపోతాయి. కాని పట్టణాల్లో నీడలోనే పెరిగేవాళ్ళు, చక్కటి పౌష్టిక ఆహారం తినేవారు, సరైన విశ్రాంతిని తీసుకునేవారు ఎప్పుడు ఏదో ఒక రోగంతో బాధపడుతూనే ఉంటారు. కడుపు నొప్పి, అజీర్తి, మలబద్ధకం వంటి ఇబ్బందులలో ఏదో ఒకటి దాదాపు నూరుశాతం అందరికి ఉంటాయి. జలుబు, రక్తహీనత, ఊబకాయంలాంటి రోగాలు సర్వసాధారణం. క్షయ, నిమోనియా రోగాలతో పట్టణాల్లో చనిపోయినంత మంది పల్లెటూర్లల్లో చనిపోరు. అన్నిచోట్ల పురుషుల కంటే స్త్రీల ఆరోగ్యం ఎక్కువగా దెబ్బ తింటుంది. వీటన్నిటికి ఒకటే కారణం సూర్య కిరణాలను ఉపేక్షించడం. ఎండలో ఉండడం అసభ్యత, నీడ చాటున, ఇళ్ళల్లో ఉండడం సభ్యత అని లెక్కలేసుకున్నప్పటి నుండి అమూల్యమైన ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నారు. సభ్యత పేరుతో సూర్యుడిని తిరస్కరిస్తే ఆరోగ్యం మనల్ని తిరస్కరిస్తుంది.**

**ఆరోగ్యంగా ఉండడం కోసం సూర్యకిరణాలు చాలా అవసరమని తెలుసుకున్న ఋషులు సూర్య ప్రాణాయామం, సూర్య నమస్కారం, సూర్య ఉపాసన, సూర్య యోగం, సూర్య చక్ర భేదన మరియు సూర్య యజ్ఞం వంటి అనేక క్రియలకు ధార్మిక స్థానాన్ని కల్పించారు. సూర్యునిలో ఉన్నంత రోగనాశక శక్తి ప్రపంచంలోని మరే వస్తువులోను లేదు** అంటారు డా॥సొలె. కాన్సర్ వంటి భయంకర రోగాలను రేడియేషన్ వగైరా పద్ధతులతో కూడా నయం చేయడం కష్టం, కాని సూర్యకిరణాలను సరిగ్గా ఉపయోగించడం ద్వారా అవి నయమయ్యాయి.

క్షయరోగ నివారణలో నిపుణులైన డా. హరినిచ్ వారి అనుభవాన్ని ఇలా పంచుకున్నారు, "గత ముప్పై ఏళ్ళల్లో నా దగ్గరకొచ్చిన 22 వేల మంది రోగులపై చాలా మంచి మందులను వాడాను. కాని నాకు వాటి ఫలితాల పట్ల తృప్తి లేదు. గత మూడేళ్ళల్లో నా దగ్గరకొచ్చిన రోగుల మీద సూర్య చికిత్స విధానాన్ని ఉపయోగించాను, సూర్యశక్తికి మించిన ఔషధం పృథ్వి మీద లేదని నొక్కి వక్కాణిస్తున్నాను."

**రక్తం పల్చబడటం, రక్త హీనత, ఐరన్ లోపం, బలహీనత, అలసట, కండరాలు బిగుసుకుపోవడం వంటి రోగాలకు సూర్య చికిత్స చాలా అద్భుతంగా పని చేస్తుంది.** – డా. హొనర్గ్.

అమెరికాకి చెందిన ప్రసిద్ధ సూర్య చికిత్సకురాలు లేడి కివో తన అనుభవాలను పుస్తకంలో పొందుపరిచింది. దాని ప్రకారం, "ఈ సంవత్సరం చాలా బలహీనమైన పిల్లలు డజను మందికి పైగా నా దగ్గరకు వచ్చారు. వారి చర్మం బాగా పల్చబడి, ఎముకలు బైటకి కనిపించి, వంకరపోయే స్థితికి వచ్చాయి. వారి దినచర్య పరిశీలించాను. ఎండ మొహం ఎరుగని పిల్లలని తేలింది. వారికి ఒకటే మందు చెప్పాను. ప్రతిరోజు ఉదయం గంట సేపు నగ్నంగా ఆ పిల్లలను ఆరు బయట గాలి, వెలుతురు ఉన్న చోట తిప్పమన్నాను. రోజు రోజుకి వారి ఆరోగ్యం కుదుటపడి, కొద్ది రోజుల్లోనే చాలావరకు ఆరోగ్యవంతులయ్యారు."

**సూర్యుని వేడిని సరిగ్గా ఉపయోగించుకోగలిగితే ఆరోగ్యాన్ని ఖచ్చితంగా సంరక్షించుకోవచ్చు, అంతేకాక ముమ్ముందు ఎలాంటి రోగాలు రాకుండా చూసుకోవచ్చు.** – డా.ఎఫ్. ఫ్రిలాండ్, సివిల్ సర్జన్, మియో హాస్పిటల్.

ప్రపంచంలో సూర్యుడున్నంత కాలం మనుష్యులు అనవసరంగా మందుల కోసం వెంపర్లాడడం మూర్ఖత్వం. శక్తి, సౌందర్యం, ఆరోగ్యానికి కేంద్రమైన సూర్యుడిని దర్శించి, ఆయన సహాయంతో స్వస్వరూపాన్ని పొందాలి. – న్యోచి, ప్రసిద్ధ దార్శనికుడు.

సూర్య భగవానుని అద్భుత రహస్యాలు భారతీయులందరికి సుపరిచితమే. తప్పులు చేసిన పిల్లలను గురువులు ఎండలో నిలబెట్టి శిక్షించేవారు. యోగులు ఎండలో తపస్సు చేసేవారు. సూర్యుని రోగనాశక శక్తి గురించి తెలుసుకునే ఇవన్నీ చేసారు. సూర్యోపాసనతో కుష్టు రోగం పోయి ఆరోగ్యవంతమైన శరీరం దక్కుతుందని కూడా విశ్వసిస్తారు.

*– అఖండజ్యోతి, అక్టోబర్ 1940*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

**భయం చాలా శక్తివంతమైనది, కాని విశ్వాసం అంతకన్నా శక్తివంతమైనది**



ప్రగతిశీల స్వావలంబనం-3

# కుటీర పరిశ్రమలు

దాదాపు 120 కోట్ల జనాభా కలిగియున్న మన భారతదేశంలో సుమారు 50-60 శాతం మంది ప్రజలు వ్యవసాయపై ఆధారపడి జీవిస్తున్నారు. అట్లే గ్రామాల సంఖ్య కూడా చాలా అధికంగా ఉండి దాదాపు ఇదే శాతం ప్రజలు గ్రామాలలో నివసించు చున్నారు. రానురాను ప్రకృతిలో అనూహ్యమైన మార్పులు వచ్చుచున్నందున భూ వాతావరణ స్థితిలో కూడా మార్పులు సంభవించి, తరచుగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏర్పడుట పరిపాటిగా మారినది. దీనితో పంటల దిగుబడిలో అనూహ్యమైన మార్పులు సంభవించి బ్రతకలేక బడిపంతులు అనెడి ఒకనాటి సామెత నేడు బ్రతకలేక వ్యవసాయదారుడుగా రూపాంతరము చెందింది. నేడు వ్యవసాయం నష్టదాయకంగా మారింది. దీనితో గ్రామీణుల జీవనం భారంగా తయారై వారు నిరాశాజనకంగా కాలం వెళ్ళబుచ్చవలసిన పరిస్థితి దాపురించింది. భారతీయ గ్రామాలు ఒకనాడు జాతి ప్రగతికి వెన్నెముకగా నిలచి సంస్కృతికి, నాగరికతకు పట్టుకొమ్మలుగా విలసిల్లాయి. నేడు అస్థి పంజరాలుగా మారి, వెన్ను విరిగి సరియైన ఆసరా కొరకు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఇట్టి స్థితిలోనున్న గ్రామాలను పునరుద్ధరించి తిరిగి జవసత్త్వాల నింపి, ఆ గ్రామ ప్రజలను కూడా ఆర్థిక ప్రగతి పథంలో పయనించేలా చూడవలసిన ప్రధాన బాధ్యత మనందరిపై ఉన్నది.

**గ్రామోద్ధరణ ప్రణాళిక :**

1) గ్రామాల వారీగా సర్వేలు చేపట్టి ఆయా గ్రామ వాతావరణానికి అనుగుణంగా, అచ్చట చేపట్టవలసిన కుటీర పరిశ్రమలను గుర్తించాలి.
2) ఆయా పరిశ్రమలలో పనిచేసే వ్యక్తులకు అవసరమైన శిక్షణ నిచ్చి, తదుపరి పరిశ్రమల స్థాపనకు ఏర్పాట్లు చేయాలి.
3) నాణ్యమైన వస్తువులను తయారుచేసి, చక్కని ప్యాకింగ్‌తో ఆకర్షణీయమైన రీతిలో అమ్మకానికి సిద్ధము చేయాలి.
4) సహకార సంఘాలను ఏర్పాటు చేసి ముడి పదార్థముల సరఫరా, తయారై అమ్మకానికి వచ్చిన వానిని, సకాలములో అమ్మటానికి యంత్రాంగాన్ని సిద్ధము చేయాలి. రాజకీయా లకు, కులాలకు, మతాలకు, వర్గాలకు, వర్ణాలకు అతీతంగా ఈ సంఘాలు, పరిశ్రమలు పనిచేయాలి. ప్రజల సంక్షేమము, సమాజ సంక్షేమము తప్ప మరో ఆలోచన వీరికి ఉండరాదు.
5) గ్రామములోని ప్రజలకు కావలసిన నిత్యావసర వస్తువులను ఆయా మార్కెట్ల నుండి సరసమైన ధరలకు తెప్పించి, సరసమైన ధరలకు నాణ్యమైన సరుకును ఈ సంఘాలు అందించవలసి యున్నది.

ఈ క్రింది రంగాలలో కుటీర తరహా, మధ్యతరహా పరిశ్రమలను గ్రామాలలో ప్రారంభించుటకు అవకాశములు మెండుగా ఉన్నాయి.

నేటి కాలంలో పంచదార మిల్లుల స్థాపన పెరిగిపోవుటచే, ప్రజల జీవన విధానంలోని మార్పు వలన, పూర్వం వాడెడి బెల్లం, ఖండసార పంచదార్లకు బదులుగా తెల్ల పంచదార వినియోగం పెరిగినది. తత్ఫలితంగా గ్రామాలలో బెల్లం తయారీ, ఖండసారి పంచదార తయారీ గ్రామీణ పరిశ్రమలు మూతపడి నిరుద్యోగ సమస్యకు దారితీసింది. ఆరోగ్యపరంగా ఖండసార పంచదార మరియు బెల్లం ప్రాధాన్యతల గుర్తించి, అభివృద్ధి చెందిన దేశాలు వీని వాడకాన్ని ప్రోత్సహిస్తూ ఉండగా, మనము వీనికి దూర మగుట అత్యంత విచారకరం. కావున ప్రభుత్వము, సామాజిక పెద్దలు ప్రైవేటు పెట్టుబడిదారులు దీనిపై దృష్టి నిలిపి, ప్రజలకు తెలియజెప్పి మరల బెల్లం మరియు ఖండసార పంచదారల వాడకాన్ని ప్రోత్సహిస్తూ తద్వారా గ్రామాలలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మార్గంతోపాటు వాని ఆర్థిక ప్రగతికి పట్టు కొమ్మగా వానిని తీర్చి దిద్దుటకు చక్కని అవకాశం లభిస్తుంది.

మన ప్రజల ఆహారపు అలవాట్లలో కొంత మార్పును ప్రవేశ పెట్టుట ద్వారా రైతుల వ్యవసాయపు ఉత్పత్తులకు మంచి గిట్టుబాటు ధరలు లభించుటతోపాటు నష్టదాయకమైన వ్యవసాయం లాభ సాటిగా మారగలదు. దీనికై త్వరితగతిన చేపట్ట వలసిన చర్యలు-

1) రైతులు పండించే పంటలను ముడిసరుకుగా కాక, సిద్ధాహారంగా మార్చి (రెడీ టు ఈట్ ఫుడ్స్) మార్కెట్టులో ప్రవేశపెట్టాలి.
2) అధునాతన శాస్త్ర సాంకేతిక జ్ఞానాన్ని (ఫుడ్ టెక్నాలజీని వాడకం తెచ్చి, దాని సహాయంతో ముందుకు సాగాలి.
3) సహకార సంఘాల ద్వారా వీనిని కుటీర పరిశ్రమల స్థాయిలో ఏర్పాటు చేసి, తయారుచేసి విక్రయించాలి.
4) మహిళా కళాశాలలో, హోమ్ సైన్స్ కళాశాలలో నూతన

**భయం నరాల మీద ఒత్తిడి కలిగిస్తుంది**

ఆహార పదార్థాలు అనగా సిద్ధాహారములపై (రెడీ టు ఈట్ ఫుడ్స్) పరిశోధనలు చేపట్టి, రైతులు పండించిన ముడి ఆహార పదార్థాలను, సిద్ధాహార పదార్థాలుగా మార్పుచేసి రుచికరంగా, పౌష్టిక విలువలతో, చౌకగా లభించేలా కృషిచేయవలసి ఉన్నది. దీనివలన వంటచేసే సమయంలో ఆదా, వంట చెరకు ఆదా, ప్రజలకు పౌష్టికాహారం చౌకధరల్లో లభ్యం, ప్రజలు తమ ఆదా సమయంలో మరోపని చేసికొనుటకు తద్వారా అధిక కుటుంబ ఆదాయం – ఇన్ని లాభాలు ఒనగూడుతాయి.

5) జిగురు ఉత్పాదన, జనుము, గోగు పంటల ద్వారా నార ఉత్పత్తి పెంచి త్రాళ్ళు అల్లుట, అట్లే కలబంద ఉత్పత్తిని పెంచి, నారతో త్రాళ్ళు తయారుచేసి వాని అమ్మకాలను సహకార సంస్థల ద్వారా చేపట్టాలి. గోతాలు, సంచుల తయారీని, వాడకాన్ని ప్రోత్సహించవచ్చును.

6) పశుపోషణలో శిక్షణనిచ్చి, అధిక పాలదిగుబడినిచ్చెడి పశు సంతతిని పెంచి పోషించాలి. అట్లే పాల ఉత్పత్తుల తయారీని కూడా గుజరాత్ రాష్ట్రంలోలా మన రాష్ట్రంలో కూడా చేపట్టాలి. ప్రస్తుతం నష్టాలతో, రాజకీయాలతో, లంచగొండితనంతో కునారిల్లుచున్న సహకార వ్యవస్థలను ప్రక్షాళన చేసి, పటిష్ఠ పరచాలి.

7) రాష్ట్రములోని వ్యవసాయ కళాశాలలతోను, వ్యవసాయ పరిశోధనశాలలకు రైతులకు మధ్య తరచు ఇష్టాగోష్ఠులు నిర్వహిస్తూ ప్రయోగశాలల ఫలితాలను రైతులకు సకాలంలో అంది అధిక దిగుబడులు సాధించేలా చూడాలి. అట్లే వర్షాభావానికి తట్టుకొని అధిక దిగుబడినివ్వగలిగెడి వంగడాలను (అమెరికాలో మొక్కజొన్న, ప్రొద్దు తిరుగుడు పంటలపై సాధించారు) రూపొందించుకొనాలి.

8) మొక్కజొన్న ఉత్పత్తులపైన సోయాచిక్కుడు, ప్రొద్దు తిరుగుడు మున్నగు వ్యవసాయ ఉత్పత్తులనాధారముగాగొని, సిద్ధాన్న పదార్థాలను తయారుచేసి వినియోగంలోనికి తేవాలి.

9) టొమాటో, మిర్చి, కరివేపాకు, నిమ్మ మున్నగువానిపై కూడా తగిన ప్రయోగాలు చేపట్టి సంవత్సరమంతా వానిని వినియోగించేలా చూడాలి. రైతులకు గిట్టుబాటు ధర లభించాలి.

10) ఎలక్ట్రిక్ మోటార్లు, ఫ్యాన్లు, వగైరా రిపేర్లు మున్నగు వానిలో శిక్షణనిచ్చి సహకార సంఘాల ద్వారా వారి అవసరాలు తీరేలా చూడాలి.

11) గ్రామ పారిశుద్ధ వ్యవస్థను, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను, వైద్య సహాయ వ్యవస్థను మెరుగుపరచాలి. యువతకు వీనిలో తగిన శిక్షణనందించి, ప్రాథమిక చికిత్స, చిన్న చిన్న రోగాలకు గ్రామాలలో చికిత్స లభించేలా చూడాలి.

12) నిరక్షరాస్యత నిర్మూలనలో భాగంగా వయోజన విద్యను ప్రోత్సహించాలి.

13) గ్రామాలలోని బంజరు భూములలో వనాలను పెంచాలి. అట్లే రహదారుల వెంట చెట్లను పెంచి పోషించాలి. దుమ్ము, ధూళి లేవకుండా చూడాలి.

14) జనాభా నియంత్రణ గురించి ప్రజలకు తెలియజెప్పి, జనాభా విపరీత పెరుగుదల వలన కలిగెడి నష్టాలను వివరించి, పరిమిత కుటుంబాలను ప్రోత్సహించాలి.

15) వయోవృద్ధుల పోషణ, వారికి రక్షణ, వారి జీవనోపాధిపై శ్రద్ధ వహించెడి కార్యక్రమాలు చేపట్టి, కుటుంబ వ్యవస్థను కాపాడాలి.

16) వర్షపు నీటిని నిలువచేసి, భూగర్భజల సంపదను పెంపొందించుకోవాలి. చెరువులు, కుంటలకు తిరిగి పునః ప్రతిష్ఠ జరగాలి. లేనిచో నీటిఎద్దడితో దేశం నిలువునా చీలి, నీటి యుద్ధాలు జరిగెడి ప్రమాదం పొంచి ఉన్నది.

పై వానినన్నింటిని సహకార వ్యవస్థ ద్వారా చేపట్టి ప్రజలే ప్రభువులుగా మారి దేశ ప్రగతికి తోడ్పడాలి. ఆనాడు గ్రామాలు దేశానికి, దేశ ప్రగతికి నిజముగా వెన్నెముకగా నిలువగలవు.

– జి. చెన్నకేశవరావు

## గాంధీగారి ఆచరణ

*ఎవరైతే ఒక్కనాడు కూడా తమ సౌకర్యాలను వదలి కష్టమైన జీవితాన్ని జీవించలేదో అలాంటి వారు మీ ఆదేశం మేరకు తమ సర్వస్వాన్ని దేశ శ్రేయస్సు కోసం ఇవ్వడం చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇదెలా సాధ్యమయ్యింది అని జుగల్ కిశోర్ అనే ఆయన గాంధీజీని ప్రశ్నించాడు? గాంధీగారు చిరు మందహాసంతో దీంట్లో ఆశ్చర్యమేముంది చాలా సాధారణమైన విషయం ఇది. చెప్పినవాడు ఆ ఆదర్శాన్ని తన జీవితంలో అమలుపరచి ఉంటే ఇలాంటి చమత్కారాలు సహజంగా జరిగి పోతాయి. ప్రజలు చెప్పింది చేసిచూపే వారిని అనుసరిస్తారు. వాస్తవం చెప్పాలంటే నేను కూడా పరిపూర్ణుని కాలేదు. ప్రయోగాలు చేసుకుంటూపోతున్న సమయము అని బదులు పలికారు.*


*– ప్రజ్ఞాపురాణం నుండి*

**ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి**

విజయదశమి ప్రత్యేకం

# సాహసం-సంకల్పంతో కూడిన గొప్ప పండుగ విజయదశమి

పట్టణాల్లో, గ్రామాల్లో, పల్లెల్లో రావణుని దిష్టిబొమ్మలను తగలపెట్టుటకు ప్రయత్నాలు మొదలయ్యింది. అంటే విజయదశమి పండుగ వచ్చే రోజులు దగ్గరయ్యాయని అందరికి తెలిసిపోయింది. వెదురుబద్దలతో, గడ్డితో తయారయ్యే రావణుని బొమ్మలు ధూమ్-ధామ్ గా మండిపోతాయి. కళ్ళు చెదిరిపోయే కాంతులు విరజిమ్మ బడతాయి. చెవులు బ్రద్దలయ్యే పెద్ద పెద్ద శబ్దాలతో బాణాసంచా ప్రేలుతాయి. దానితో దసరా ఉత్సవం సమాప్తమైపోతుంది. నిజమైన విజయదశమి అంటే ఇంతేనా? ఇంకేమి లేదా? కేవలం సంబరాలతో పూర్తి అవటమేనా? లేక ఈ దశమితో ఏవైనా విజయ సంకేతాలు కలసి ఉన్నాయా? ఈ ప్రశ్నకు జవాబు అగ్నితో నిప్పు రాజుకొంటూ అలాగే ఉండిపోతుందా? ఎవరి మనసులోను దీని గురించి వ్యాకులతలేదు. కలత చెందే భావన లేదు. ఈ ప్రశ్నకు జవాబు ఇవ్వటానికి ఎవరికి తీరిక లేదు. చాలామందికి ఈ విజయ దశమిని ఏదో వేడుకగా, ఉత్సాహంగా ఏదో విధంగా అయ్యిందనిపించుకొని, తమ దైనందిన కార్యక్రమాలలో దొర్లుతూ, పొర్లుతూ, జారిపోతూ జీవితం గడుపుకొంటారే తప్ప, ఈ దసరా వేడుకలో ఉన్న అసలైన సత్యాన్ని పూర్తిగా మరచిపోయారు.



ఇలా నిర్లిప్తంగా ఉండుట మనేది మన సామాజిక జీవనాన్ని ఎగతాళి చేస్తున్నదనే మాట సత్యం. ప్రతివారు తమ తమ జీవన పెనుగులాటలో కొట్టుకొనిపోతూ; తమ స్వార్థచింతన, తమ అహంభావ చిక్కు ముడులలో ఇరుక్కు పోతున్నారు. ఇలాగయితే, మన సాంస్కృతిక, సామాజిక, దేశ క్షేమాన్ని రక్షించే బాధ్యత ఎవరు ఎత్తుకుంటారు? ఇది మన దేశ సంస్కృతిని ప్రమాదంలో పడవేయటంగాక ఇంకేమిటి? మనమందరం మన పూర్వ ఋషుల ఆదర్శాలకు వారసులం. వారు ఈ గొప్ప గొప్ప పండుగుల వెనుక ఉన్న ఆదర్శాలను, ఆచరణలను ఇచ్చిన ప్రేరణలను ఏనాడో పూర్తిగా మరచిపోయాము. పండుగులలో ఉన్న సాంస్కృతిక సంవేదన, మన మూర్ఖతలోని కుటిల ఊహాలలో ఇరుక్కుపోయి వాడిపోయింది. సత్యాలను తెలుసుకొని ఆచరించుట గాని, వాటిని అర్థం చేసుకొనే సాహసం, సంకల్పం బహుశః మనందరిలో నశించిపోయాయి.

ఒకప్పుడు ఈ విజయదశమి పండుగ, సాహసానికి ప్రతీకగా; సత్ సంకల్పాలకు బలం చేకూర్చగల గొప్ప పండుగగా ఉండేది. ప్రతివారి జీవితంలో ఈ రెండు గొప్ప శక్తుల జాగృతమయి సరియైన దిశలో నడపగల ప్రేరణ దీనిలో ఉన్నది. ఎన్నో పురాణాలలో ఐతిహాసిక కథలలో, ఈ విజయదశమికి సంబంధించిన ఎన్నో వీరోచిత కార్యాలు నిండి ఉన్నాయి. అసలు మన సంస్కృతిలోని సారమంతా వీటిలో నింపబడి ఉన్నది. ఈ పండుగకు సంబంధించిన, అన్నిటికంటే పురాతనమైన కథ రామాయణము. ఈ కథలో మర్యాద పురుషోత్తముడైన శ్రీరామ విజయగాథను, ఎంతో గొప్పగా వాల్మీకి మహర్షి తన రామాయణ కావ్యంలో వర్ణించాడు. అంతేగాక ఈ కావ్య ఆధారంగా అనేక పురాణాలలో, క్షేత్రీయ, ప్రాంతీయ భాషలలో విభిన్న కావ్యాలలో పలు వర్ణనలు ఉన్నాయి. ఇంకా ఎంతో మంది తమ తమ రచనలలో శ్రీరామచంద్ర ప్రభువు విజయ సంకల్పాలను వ్రాయుట జరిగింది. విజయదశమి నాడే శ్రీరాముడు తమ గురువు ఆశ్రమంలో గొప్ప ప్రకటన చేసింది "లోకంలోని రాక్షస మూకను సమూలంగా నాశనం చేస్తానని" వజ్ర సంకల్పం తీసుకొన్నది కూడా ఈ రోజునే. కొన్ని సంవత్సరాల తర్వాత జరిగిన సంఘటనా క్రమములో అనేక మార్పుల తదనంతనరం శ్రీరాముడు రావణుని సంహరించింది కూడా ఈ విజయదశమి తిథినాడే.

మరికొన్ని కథలు, కావ్యాలు ద్వారా లభించిన వివరణల ప్రకారం మాతా భగవతి మహిషాసుర మర్దని ఈ పుణ్య తిథినాడే మహిషాసురుడనే రాక్షసుణ్ణి వధించిన విషయం మనమందరం తప్పకుండా నమ్మవలసిన విషయం. ఇంకొక కవి తన గ్రంథంలో జగదాంబ తన విభిన్నశక్తుల సమూహంతో శరత్ఋతువులో వచ్చే నవరాత్రుల రోజులలో శుంభ, నిశుంభ రాక్షసులను, వారి సేనలతో సహా యుద్ధంలో సంహరించిందని వ్రాయుట జరిగింది. నవరాత్రులలోని తొమ్మిది-పది రోజులలో వరుసగా శుంభ,

భయం యొక్క మూలకారణం తెలుసుకోవాలి

నిశుంభ రాక్షసులను వధించి, దేవతలను రక్షించిన రోజు విజయదశమిగా ఆ మాత ఆదిశక్తి విజయగాథగా ప్రసిద్ధి చెందినది ఈ రోజే. కొంతమందికి ఈ విజయగాథ గురించి చదివిన తరువాత, ఇవన్నీ నిజాలు కావని అనిపించవచ్చు. కాని ఎవరైతే తమ జీవితంలో సత్యాన్ని ప్రేమిస్తారో, తమ భావాల మీద సమగ్ర గౌరవం ఉంటుందో వారందరికి ఈ గ్రంథాల ద్వారా ప్రేరణ లభించి తమ భక్తిని, పూజ్య భావాన్ని చాటుకొంటూ ఉంటారు.

పురాతన కాలం నుండి శక్తి ఉత్పాదన చేయు క్షత్రియ రాజులు ఈ విజయదశమి పండుగను చాలా గొప్పగా జరుపుకొనేవారు. ఆయుధపూజ చేసి దశమి రోజున సాహస కార్యాలు చేస్తూ తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకొనేవారు. మధ్యయుగకాలంలో ఈ పండుగ గురించి చిన్న, పెద్ద ప్రమాణాలు లభిస్తాయి. మహారాజు రాణాప్రతాప్ సాహసం, సంకల్పం, శౌర్యం, తేజం, తపస్సు వెనుక విజయదశమి మహాపర్వం యొక్క ప్రేరణ ఉన్నది. రాజుగా ఉన్నప్పటికి సామాన్య ఫకీరువలె జీవనం గడుపుతూ సామ్రాజ్యవాదులను జీవితాంతం ఎదిరించి పోరాడిన మహాయోధుడు. ఆయన ఏనాడు దేనికి భయపడలేదు, ఎవరి ముందు తలవంచలేదు. ఇంకా ఏనాడు తన సంకల్పాన్ని విడువలేదు. మహావీరుడు శివాజికి, సమర్థ రామదాస్ ఈ విజయదశమి ద్వారానే ప్రేరణ కలిగించే పాఠాలు నేర్పాడు. పరాజయం పొందని వీర ఛత్రపతి శివాజి ఎల్లప్పుడూ ఈ విజయదశమి పండుగను సాహసాన్ని, సంకల్పంతో జోడించి తన తోటి వీరులకు ప్రేరణ కలిగిస్తూ ఉండేవాడు.

ఇలా ప్రేరణ నొసగే ఈ మహాపర్వం పొగమంచుతో మసక బారిపోయిన రోజులలో పండుగను మామూలుగా జరుపు కొంటున్నామే తప్ప దానివెనుక ఉన్న ప్రేరణను కలిగించే సాహసం గాని, సంకల్పం గాని గుర్తించే క్రమము మరచిపోయాము. కాని ఈ పరంపరంలో సాహసము, పరాక్రమము, సంకల్ప ప్రేరణలు పొందిన కొంతమంది మహాక్రాంతికారులును ఈ సందర్భంగా స్మరించుట మన అందరి కర్తవ్యము. వారే శ్రీరామ ప్రసాద్ బిస్మల్, చంద్రశేఖర్ ఆజాద్. వీరు ఈ పండుగను ఎంతో ఉత్సాహ పూర్వకంతో జరుపుకొంటూ, "ఈ పండుగకు సాటిరాగల వేరే ఏ పండుగ ఉండదని, దీనిలో గొప్ప సాహసంతో కూడిన ఉగ్రమైన ప్రతాపం ప్రత్యక్షంగా ప్రేరణ కలిగించే విధంగా ఉందని" శ్రీ చంద్రశేఖర ఆజాద్ అంటుండేవాడు. ఇంకా "ఈ పండుగ దేశభక్తి కలిగిన వీరుల పండుగని" అనేవారు. పండిత రామప్రసాద్ బిస్మల్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడుగానే గాక గొప్ప కవిత్వం వ్రాసే కవి కూడా. ఈయన ఈ పండుగ ప్రేరణ గురించి ఎన్నో మంచి కవితలు వ్రాసాడు. అవన్నీ ప్రస్తుతం కాల ప్రవాహంలో కలిసిపోయాయి. కాని కొంతమంది ఆయన సమకాలీకులు ఆయన రచనలు కొన్నింటితోపాటు వారి గురించి కూడా కొంత వివరం తెలిపి ప్రతి నిత్యం స్మరించుకొంటూ కొన్ని రచనలు చేశారు. వీరి ద్వారా కొన్ని శ్రీ బిస్మల్ గారి అభిప్రాయాలు వెల్లడైనాయి. ఈ విజయదశమి పండుగను గురించి శ్రీ బిస్మల్ గారు. "ఈ పండుగ సాహసం, సంకల్పాల యొక్క అతి గొప్ప పండుగని" చెప్పారు. అయితే ఇందులో గమనించవలసిన విషయమేమనగా సాహసమనే మాటను ప్రయోగించుటలో ఆయన ఉద్దేశ్యం దేశానికి హాని చేసే ఆతంకవాదుల గురించేగాని, మనను వ్యతిరేకించేవారి గురించి కాదు. ఇలాంటి సంకల్పం తీసుకుని దేశంకొరకు బలిదానం చేయగల సాహసం చూపాలనేదే అంతేగాని మూర్ఖుల ఉన్మాదం అణచే ప్రదర్శన మాత్రం కాదు.

మహాక్రాంతి వీరుడు శ్రీ బిస్మల్ చెప్పిన ఆ మాటలు ఈనాడు కూడా మనకు అంతే ప్రేరణ చూపగలవు. ప్రస్తుతం మనలోని సాహసం, సంకల్పాలాలు దిక్కులు వెతుక్కుంటున్నాయి. మనం సాహసవంతులమే గాని నవనిర్మాణం కొరకు కాదు. మంచి పనులను కూడా అస్తవ్యస్తం చేయగల సాహసం మనది. ఇలా మనం మన సంకల్పశక్తిని అనేక దుర్భావనలను పెంచుకోవటం లోనే ఉపయోగించుకొంటున్నామే తప్ప దేశ ప్రగతి కోసం మాత్రం కాదు. మనలోని సాహసం వజ్ర సంకల్పాలన్నీ దేశాన్ని ఖండ ఖండాలుగా చేయుటకు పనిచేస్తున్నాయి.

ఈసారి మాత్రం విజయదశమి మన అందరి కొరకు విజయ సంకల్పాన్ని నింపుటకు వచ్చింది. మనందరం కలసి ఈ పండుగనే ప్రేరణ దిశలో జరుపుకోవటం ఎంతో మేలు కలిగిస్తుంది. మనలోని ప్రతివ్యక్తి సాహసంతో కూడిన సంకల్పశక్తిని కూడదీసుకొని మన వ్యక్తిగత జీవితంలోని, సమాజంలోని దుష్ప్రవృత్తులను నాశనం చేయుటకు ప్రతిజ్ఞ తీసుకోవలసి ఉన్నది. అనీతి, కురీతులకు విరుద్ధంగా సంఘర్షణ చేయగలగాలి. వేర్పాటువాదులకు విరుద్ధంగా పోరాటం చేయవలసి ఉంటుంది. మనలో ఈ మహా సంకల్పం నింపుకొని, ఈ విజయదశమి పండుగకు నిజమైన సార్థకతను చేకూర్చుదముగాక! ఈ సాహస సంకల్పాలను ఆచరించగల వ్రతశీలురు పవిత్ర జీవనం గడుపుతూ, ఈ విజయదశమినాడు శ్రీరామునికి నిజమైన భక్తులుగా మారుదాము. జగన్మాత శ్రీమహిషాసురమర్దిని మాతకు యోగ్యమైన సంతానంగా మారే ప్రతిజ్ఞ తీసుకొందాము. మనం దుష్ప్రవృత్తులనే రావణ దహనం చేయగలిగిననాడు నిజమైన విజయ దశమి పండుగను జరిపిన వారమైనామని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

*– అఖండజ్యోతి, అక్టోబర్ 2002*

*అనువాదం : జి. చెన్నకేశవరావు*

**భయం అనే రోగానికి ఆత్మవిమర్శే విరుగుడు.**

# పిల్లల సమగ్ర అభివృద్ధికి ఏమి చెయ్యాలి?

తల్లిదండ్రులకు తమ సంతానమే అన్నింటికన్నా ఎక్కువ. జీవితంలో వారు సంపాదించిన ధనము ఆస్తుల కంటే పిల్లలనే అధికంగా భావిస్తారు. కాని ఆ పిల్లల పెంపకంలో అంత జాగ్రత్త చూపరు. ఆ విషయం బహుశా వారికి తెలియకపోవచ్చు. ఏ వ్యక్తి కూడా తన ఆస్తుల పట్ల నిర్లక్ష్యం చూపరు. కాని ధనం కన్నా పిల్లలే ఎక్కువ అనుకొనే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలని బాగా గాయపరుస్తున్నారు. పిల్లలతో పాటు ఆనందముగా గడపటానికి వారికి సమయం ఉండటం లేదు. పిల్లలని పాఠశాలకి పంపటం వరకే వారి కర్తవ్యంగా భావిస్తున్నారు.

**పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తల్లి దండ్రులదే బాధ్యత.** వారు తమ ప్రేమ, వాత్సల్యమును పిల్లలకి ఇచ్చినప్పుడే అది సాధ్యమవుతుంది. పిల్లలు ఎప్పుడు తమ తల్లిదండ్రుల ప్రేమ కొరకు తపిస్తూ ఉంటారు. ఎక్కువ సమయం వారి సాన్నిధ్యంలో ఉండాలని కోరుకుంటారు. వారికి అది దక్కనప్పుడు ఒంటరి తనంతో బాధపడతారు. **పిల్లల సంతోషము కొరకు వారికి బహుమతులు ఇచ్చినంత మాత్రాన సరిపోదు. వారితో ఎక్కువ సమయం గడిపినప్పుడే మిక్కిలి సంతోషపడతారు. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపలేరో వారి పిల్లల వ్యక్తిత్వం దెబ్బతింటుంది. వారిలో మొండితనము, కోపము తెలియని బాధ చోటు చేసుకుంటాయి.**



తల్లిదండ్రులు తమ పిల్లల సమర్థత తెలుసుకోకుండా వారి కోరికలను అమాయక పిల్లల మీద రుద్దుతారు. వారిపై తలకు మించిన బరువు పెడతారు. వారు కోరుకున్నట్లు పిల్లలు చేయలేనప్పుడు వారిని దండిస్తారు. పిల్లలకి సహజంగా కోరికలు ఉంటాయి. కాని వారి తల్లిదండ్రులు తమ ఆశలతో వారిని మార్చడానికి ప్రయత్నం చేస్తారు. అందుకే అప్పుడప్పుడు పిల్లలు తమ తల్లిదండ్రులను ఎదిరించడం చూస్తుంటాము.

ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలని అర్థం చేసుకోలేరు. కనీసం ప్రయత్నం కూడా చేయటానికి ఇష్టపడరు. అందువల్ల పిల్లల నడవడిక వారికి పెద్ద సమస్య అవుతుంది. తల్లిదండ్రుల వ్యవహారం పిల్లలకి ఇబ్బందిగా ఉంటుంది. తల్లిదండ్రుల ప్రేమను పొందలేకపోవటం వల్ల పిల్లలు తమ ఇష్టం వచ్చిన రీతిగా ప్రవర్తిస్తారు. పిల్లలని విసుక్కోవటం, నిందించటం, వారిని ప్రశంసించకపోవటంలాంటి పనుల వలన వారి మనస్సు గాయపడుతుంది. పిల్లలు ఎప్పుడు తమ తల్లిదండ్రుల ప్రేమను కోరుకుంటారు. అది దక్కనప్పుడు వారిలో మార్పు రావటం సహజము. **తల్లిదండ్రులు తమ పిల్లల కోరికలను వారి స్థాయికి దిగి అర్థం చేసుకోవాలి. పెద్దవాళ్ళ ఆశలు నెరవేరకపోతే వారిని నిందించటం, వారితో వ్యంగ్యంగా మాట్లాడటం, ఇతర పిల్లలతో పోల్చటంలాంటివి చేయటం వల్ల వారిలో పట్టుదల, మొండి తనము, విద్రోహభావన లాంటివి మొదలవుతాయి. పెద్దల పట్ల హీనభావం ఏర్పడుతుంది. ఎప్పుడు ఉదాసీనంగా కనపడతారు.**

పిల్లలు తెల్ల కాగితంలాంటివాళ్ళు అని వాటిపైన మనము కావలసిన విధంగా వ్రాసుకొనవచ్చని కొందరు అంటారు. పూర్తిగా అది నిజం కాదు. పిల్లలు ఒక వాయిద్యం లాంటివాళ్ళు. వాయిద్యం యొక్క "ట్యూన్" ముందుగానే నిర్ధారింప బడుతుంది. ఉదాహరణకి వీణ, హార్మోనియం, తబలా మొదలగునవి వాటి వాటి యొక్క ధ్వనులే వస్తాయి. అదేవిధంగా పిల్లలు కూడా వారి జీవితాన్ని ఎలా నిర్ధారణ చేసుకోవాలో నిర్ణయించుకుంటారు. 'జీవితం' అనే వాయిద్య యంత్రం మీద ముందుగానే "ట్యూన్" చేసుకుంటారు. కాని సంరక్షకులు తమ కోరికలకి అనుగుణంగా ఉండే సంగీతం వినాలని అనుకుంటారు. కాని అది కుదరదు. అప్పుడప్పుడు సంరక్షకుల అభిప్రాయాలు పిల్లల అభిప్రాయాలు కలవచ్చు. కాని అది ఎల్లప్పుడూ సాధ్యం కాదు.

సంరక్షకులు తమ పిల్లలపై పూర్తి ఆధిపత్యాన్ని చూపాలని అనుకుంటారు. వారికి స్వేచ్ఛ ఇవ్వరు. వారి కోరికలపై ధ్యాస పెట్టరు. కేవలం తమ కోరికల కలలని పండించుకోవాలని అనుకుంటారు. ఈవిధంగా వారి ఉత్సాహాన్ని నీరు కారుస్తారు. సంరక్షకులు తమ కోరికలు నెరవేరాలని పట్టుదలతో పిల్లలని వేధిస్తుంటారు. బాల్యంలో పిల్లలు ఆనందంగా ఉంటారు. కాని వారి ఆనందాన్ని వారి సంరక్షకులే లాగేసుకుంటున్నారు. చాలా మంది సంరక్షకులు పిల్లలకి స్వేచ్ఛనివ్వరు. ఎలా కూర్చోవాలి, ఎలా మాట్లాడాలి, ఎలా నవ్వాలి, ఇలా ప్రతిదానికి ఆంక్షలు పెడతారు. తమ పిల్లల జీవితం వారు అనుకున్నట్లుగానే ఉండాలని అనుకుంటారు. పిల్లలు అన్ని రంగాలలో రాణించాలి అంటే వారికి కొంత స్వేచ్ఛ ఇవ్వటము అవసరము. పిల్లల అభివృద్ధికి తల్లిదండ్రులు ఆటంకం కాకూడదు. వారి పురోగమనానికి చేతయినంత వరకు సహాయం చేయటానికి ప్రయత్నం చెయ్యాలి. వారిని ప్రోత్సాహించాలి. వారి పనులలో అనవసరంగా జోక్యం చేసుకోకూడదు.

పిల్లల మనస్సు చాలా కోమలంగా, సున్నితముగా ఉంటుంది. వారి మనస్సు, అన్ని దిశల వైపు మళ్ళుతుంది. ఆ వాతావరణ

మనిషి జీవితానికి భగవంతుడిచ్చే గొప్ప వరం ప్రశాంతత

ప్రభావము వారి మీద పడుతుంది. వారికి వారి పద్ధతిలో అభివృద్ధి పొందటానికి పూర్తి అధికారం ఉంటుంది. అప్పుడప్పుడు వారి ప్రయత్నాలు అవ్యక్తంగా, అస్పష్టంగా ఉండవచ్చు. దాన్ని ఎదుర్కొనే ప్రయత్నాలు చేయవచ్చు. వారిని ఆ సమయంలో సంరక్షకులు అపరాధిలాగా క్రమశిక్షణ తప్పినట్లు భావిస్తారు. వారిని శిక్షించటానికి వెనుకాడరు. పిల్లలు తమ పద్ధతిలో అభివృద్ధి చెందుటకు చేసే సంఘర్షణ మాత్రమే అది. సంరక్షకులు ఎక్కువ మంది తమ పిల్లలపై శత్రువులులాగా విరుచుకుపడతారు. పిల్లలని కఠినంగా శిక్షిస్తారు. కోపంతో పిల్లలని బాదటం, చెవులు పట్టుకొని లాగటం, బెదిరించటం, నిందించటం, కర్రతో కొట్టడం, చెప్పులు విసరటం లాంటివి చేస్తారు. పిల్లల సున్నితమైన మనస్సులలో ఇవి ముద్రపడిపోతుంది. **బాల్యంలో వారిని కొట్టిన దెబ్బలు, చిహ్నాలు శరీరము మీద ఉండకపోవచ్చు కానీ మనసులో ఉండి పోతాయి. వారు పెద్దవారు అయిన తర్వాత కూడా మరచిపోలేరు. పిల్లలని మానసికంగా హింసించటం వల్ల వారి దృష్టిలో దోషులుగా మిగిలిపోతారు.** ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వారు చేసిన ఈ వికృతమైన పనుల వల్ల పిల్లలు ఇతరుల దృష్టిలో హీనంగా చూడబడటానికి కారకులవుతున్నారు. ఈ విధంగా సంరక్షకులు పిల్లల వికాసానికి అవరోధం అవుతున్నారు.

సంరక్షకులు ద్వారా జరిగిన అవమానాలు, కష్టాలు పిల్లలు ఎప్పటికీ మరచిపోలేరు. ఎవరైతే వారిపట్ల ప్రేమగా వ్యవహరిస్తారో వారితోనే ఎక్కువ సమయం గడుపుతారు. సంరక్షకులు ప్రేమ చూపినప్పటికి వారి మనస్సుకి తగిలిన గాయాన్ని మరువలేరు. దానివల్ల పిల్లలు ఇల్లు వదిలి పారిపోవాలి అనుకోవటం, లేక పారిపోవటం కూడా జరుగుతుంది. చెడు స్నేహాలలో చిక్కుకుంటారు. తమ బాధను అర్థము చేసుకొని ప్రేమగా చూచే వ్యక్తుల కోసం వెతుక్కుంటారు. ఒంటరితనంతో బాధ పడతారు. తల్లిదండ్రులు పిల్లల సమస్యలని తేలికగా కొట్టేస్తారు. చిన్నతనం లోనే ఏదైనా త్వరగా నేర్చుకోవచ్చని సంరక్షకులు వారిని ఒత్తిడి చేస్తూ ఉంటారు. పిల్లల అభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులు ఉండాలి. **పిల్లలు తమ తమ పద్ధతిలో నేర్చుకోవటానికి తల్లి దండ్రులు ప్రోత్సహించాలి. తమ పిల్లలు మంచి సంస్కార వంతులు అవటానికి అవసరమైనంత వరకు సహాయం చెయ్యాలి. పిల్లలకి తమ జీవిత మార్గాన్ని స్వయంగా ఎన్నుకొనే అవకాశం ఇవ్వాలి. పిల్లల కోరికలని అణచకూడదు. ఆ విధంగా చేసినట్లయితే వారి జీవితాలు నిరాశజనకంగాను, ఉదాసీనంగా మారతాయి.**

పిల్లల పట్ల మితిమీరిన ప్రేమ చూపరాదు. మరీ సున్నితం గాను ఉండకూడదు. ఎక్కువ స్వేచ్ఛకూడా ఇవ్వకూడదు. అవసరమయితే క్రమశిక్షణ కొరకు కఠినంగా కూడా ఉండాలి. పిల్లవాడు చెడు మార్గములో తిరుగుతున్నప్పుడు శిక్షించటం కూడా అవసరమే. ఎక్కువ స్వేచ్ఛ లభించిన పిల్లలు చెడిపోవటానికి కూడా అవకాశం ఉంటుంది. పిల్లల అభివృద్ధి కొరకు వారి ఉపాధ్యాయులను కలసి నిర్ణయాలు తీసుకోవాలి. పిల్లలు ఏ విషయం అయినా తెలుసుకోవటానికి కుతూహలము చూపిస్తున్నారో తప్పకుండా వారికి చెప్పవలసిన అవసరము ఉన్నది. క్రొత్త విషయాలు తెలుసుకోవటానికి వారు జిజ్ఞాస చూపితే వాటిని అణచివేయరాదు. వారికి కావలసినవి ఎన్నుకొనే అవకాశం ఇవ్వాలి. సంరక్షకుల యొక్క ఆశల ప్రకారంగా పిల్లలు ఉన్నా లేకపోయినా వారిని చెడు స్నేహాల నుంచి కాపాడాలి. సంరక్షకులు పిల్లలని నిందించినా, కొట్టినా వారిపట్ల పిల్లలకి హీనభావం ఏర్పడుతుంది.

సంరక్షకులు పిల్లల వ్యక్తిత్వ నిర్మాతలు కారు. వారు వారి వ్యక్తిత్వాన్ని నిర్మించుకొనే సమయంలో సహాయం మాత్రం చెయ్యాలని గుర్తించుకోవాలి. సాధారణంగా పిల్లలు మంచివాళ్ళే. కాని పొరపాటున దారితప్పితే వారిని సరిచెయ్యాలి. వారిని స్వయంగా వారి మార్గాన వారిని వెళ్ళనివ్వాలి. ఇతర పిల్లల కన్నా వెనుకబడినప్పుడు ప్రోత్సహించి వారిని ముందుకు తేవటానికి సహాయపడాలి. పిల్లల చక్కని ప్రవర్తనకు ప్రోత్సాహం లభించాలి. పిల్లలతో మాట్లాడటం ఒక కళ. సంరక్షకులు ఆ కళని నేర్చుకోవాలి.

సంరక్షకులు తమ పిల్లల యొక్క అభిరుచులను అర్థం చేసుకొని అంగీకరించాలి. **పిల్లలే దేశము యొక్క భవిష్యత్తు. ప్రతి క్రొత్త తరానికి ఒక లక్ష్యం, ఒక పద్ధతి ఉంటుంది. వారి అభిప్రాయాలతో సంరక్షకులు ఏకీభవించాలి.** వారికి ఎక్కువ చెప్పవలసిన అవసరము లేదు. ఉపదేశాలు ఇవ్వవలసిన అవసరము ఉండదు. వారికి ఉచితమైనది ఏది? అనుచితము ఏది? తెలియచేస్తే స్వయంగా వారే వివేక మార్గములో నడుస్తారు. నిర్ణయాలు స్వయంగా తీసుకో గలుగుతారు. చదువు విషయంలో కూడా వారికి ఇష్టమైనదే చదువుకోవటానికి సహాయపడండి. సంరక్షకులు వారి కోరికలను పిల్లలపై రుద్దకూడదు. పిల్లలు స్వయంగా అభివృద్ధి పొందు తున్నప్పుడు వారిని ప్రోత్సాహించండి. సంరక్షకులు తమ పిల్లలు అన్ని రకములైన విద్యలు నేర్చుకోవాలని కోరుకుంటారు. ప్రత్యేకంగా ఒకే విద్య ఏదైనా నేర్చుకోవటానికి సంరక్షకులు ఇష్టపడరు. ఎందుకంటే వారి దృష్టిలో అది కష్టము. తమ పిల్లలు నిర్భయంగా, స్వతంత్రంగా ఉండాలని కోరుకోవాలి. పిరికివాళ్ళు, ఇతరుల మీద ఆధారపడేవాళ్ళు, చదువురాని పిల్లల కన్నా హీనమైన వాళ్ళు.

**అందువల్ల సంరక్షకులు పిల్లలకి చెయ్యమని చెప్పేవి ముందు తాము ఆచరించాలి. వారు అలా చేసినట్లయితే తమ పిల్లల పట్ల న్యాయం చేసినవారు అవుతారు. పిల్లలకి అవసరమైనవన్నీ ఇవ్వగలుగుతారు.**

*– అఖండజ్యోతి, జూన్ 2012*
*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజ్యం*

**కోపతాపాలు ప్రశాంతతను ఛిన్నాభిన్నం చేస్తాయి**



యువతకు ప్రత్యేకం

# ఐశ్వర్యం - 6

కంప్యూటర్ టెక్నాలజిలో డిఫాల్టు సిస్టమ్ అని అంటుంటారు. డిఫాల్టు అంటే ఆ కంప్యూటర్‌ని ఎప్పుడు ఓపెన్ (Open) చేసిన అది ఒక నిర్ధారిత పద్ధతిలో ఉంటుంది. అంటే అది దాని సహజ స్థితి. దానిని కావాలంటే మార్చుకోవచ్చు.

మనం మారాలి అనుకుంటున్నాము. కాని మనం ఒక పద్ధతికి అలవాటు పడిపోయాం. మీరు కాస్త జాగరూకతతో లేకపోతే మళ్ళీ ఇదివరకు ఎలా ఉన్నారో అలాగే తయారవుతారు. "మేము ప్రయత్నం చేస్తున్నాము. జరగటం లేదు." ప్రయత్నం చేస్తే జరగకుండా ఎలా ఉంటుంది? ఆలస్యం కావచ్చు. అవరోధాలు రావచ్చు. అవరోధాలు వస్తున్నాయంటే నువ్వు ప్రయత్నిస్తున్నావని కదా! ప్రయత్నించకపోతే అవరోధాలే రావు. కొందరు ఏం చెప్తారంటే అసలు ప్రయత్నం చెయ్యకుండా ఉన్నవాళ్ళే చాలా హాయిగా ఉన్నారండి". ప్రయత్నం చెయ్యకపోతే నువ్వు కూడా హాయిగా ఉంటావు, కానీ ఆ హాయికి విలువలేదు. పరీక్షకు చదువు కుంటున్నవాడికి టి.వి. చూస్తూ కూర్చున్నవారు, క్రికెట్ మ్యాచ్ చూస్తున్నవారు చాలా హాయిగా ఉన్నట్లు కనిపిస్తారు. కాని ఆ హాయి ఎందుకు పనికివస్తుంది? కష్టే ఫలి. కష్టపడ్డప్పుడు, ఆ కష్టానికి ఫలం అందుకున్నప్పుడు ఆ సుఖమే వేరు, ఆ ఆనందమే వేరు.

మీ మూడ్ (mood) పాడైపోయిందనుకోండి. ఉత్సాహం తగ్గిందనుకోండి. ప్రక్కవాళ్ళ చెప్పుడు మాటలు విన్నారనుకోండి. అంటే మీ సిస్టమ్ డిఫాల్ట్‌లో ఉందన్నమాట. మరల యధాస్థితికి వెళ్ళిందన్నమాట. **మన సిస్టమ్ మనం అనుకున్నట్టుగా ఉండాలి.** ఇతరుల మాటలు వినవద్దు అనటం లేదు, ఇతరుల సలహాలు తీసుకోవద్దు అనటం లేదు. ఇతరుల సలహాలలో ఉపయోగ పడేదేమైనా ఉంటే దానిని మాత్రమే తీసుకోండి. ఇతరులు చెప్పింది వినండి. కాని ఆ విషయంపై అవగాహన లేనివారు సలహాలు ఇస్తుంటారు. గాయత్రి ఆడవాళ్ళు చెయ్యవచ్చా? ఎవరు చెప్పాలి. గాయత్రీ మంత్రమంటే తెలియని వాళ్ళు మాట్లాడుతుంటారు. 12 కోట్ల గాయత్రీ మంత్రం చేసి, దానిని ఉపయోగించుకుని అత్యున్నత స్థితికి వెళ్ళిన వ్యక్తి ఆడవాళ్ళు గాయత్రి చెయ్యవచ్చు అంటే, ఆయన మాట వినం.

డాక్టరు దగ్గరకు వెళ్ళాం. ఆయనేదో మందు వ్రాసిచ్చాడు. రోజు 3 సార్లు, నాలుగు సార్లు వేసుకోమని చెప్పాడు. సైడ్ ఎఫెక్ట్ (side effects) వస్తాయండి. ఒకసారి మాత్రమే వేసుకుంటాను అంటావు. మరి ఇంక డాక్టరు దగ్గరకు వెళ్ళటం ఎందుకు? డాక్టరు దగ్గరకు వెళ్ళాక ఆయన చెప్పినట్లు విను. లేదా నీకు ఇబ్బందిగా ఉంటే ఆ ఇబ్బందేదో చెప్తే మందు తగ్గించాలా లేక మందు మార్చాలా అనేది ఆయనే చెప్తాడు. నువ్వే మార్చేసుకున్నావనుకో ఇంక ఆ డాక్టరు దగ్గరకు వెళ్ళటం ఎందుకు?

అందువల్ల ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఎక్స్‌పర్ట్ (expert) సలహా అడగండి. ఆ సలహాను వెంటనే అమలుపరచాలి. "నేను రేపు చేస్తాను" అంటే ఇంక మీరు మారరు. అసంభవం. మీలో ఉన్న పనికిరాని అలవాట్లను ఈ క్షణం నుంచి మానెయ్యాలి. తక్షణం మానలేదు. మీరు మారరు.

**కాని మీ మనస్సులోని భావాలను కాగితం మీద పెట్టగలిగితే మీరు ఆ పని ఖచ్చితంగా చేయగలరు. అందుకే డైరీ వ్రాయడం అలవాటు చేసుకోవాలి.** ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే మీకు వచ్చే కలలను వ్రాసుకోవాలి. మీ కలలు ఆరు నెలల ముందు మీ జీవితాలలో రాబోయే మార్పులను చెప్తాయి, హెచ్చరికలు చేస్తాయి, సూచనలు ఇస్తాయి. ఆరు నెలలపాటు మీరు ప్రతిరోజు మీకు వచ్చేటటువంటి కలలను వ్రాసుకోగలగాలి. ఆ కల వచ్చిన సమయం, వారం, తేది రికార్డు చెయ్యాలి.

పూర్వకాలంలో రాజులు స్వప్నాలను విశ్లేషించటానికి తగిన వ్యక్తులను పెట్టుకునేవారు. వచ్చిన స్వప్నాల మీద వారు అనేక విషయాలలో నిర్ణయం తీసుకునేవారు. డైరీని మీరు పడుకునే టప్పుడు ప్రక్కన పెట్టుకోవాలి. ఎప్పుడు కలవస్తే ఆ కలను వ్రాసుకోవాలి. కళ్ళు తెరిస్తే కల ఎగిరిపోతుంది. గుర్తుండదు. కళ్ళు తెరవక ముందే డైరీ పెన్సిల్ / పెన్ పట్టుకోవాలి.

డైరీ ప్రతిరోజు వ్రాయాలి. డైరీ రాత్రిపూట పడుకునే ముందు వ్రాస్తారు. మీకు చెప్పిన ఎనిమిదో, తొమ్మిదో పాయింట్స్ ఉన్నాయి. వ్యవస్థ, లోతైనశ్వాస, కృతజ్ఞత మొదలైనవి. అన్నింటికి మార్కులు వేసుకోండి. ఒక్కొక్కదానికి పది మార్కులు. ఒక్కొక్కదానిలో మీకు మీరు ఎన్ని మార్కులు వేసుకుంటారో చూచుకోండి. ఎప్పుడయినా బోరు (విసుగు) కొట్టినా, ఇంకా చాలులే అనిపించినా మరల మీరు యధాస్థితికి వెళ్ళినట్లే.

చిన్నప్పుడు నేను గీతాప్రెస్ గోరఖ్‌పూర్ వారి పుస్తకం "బాలక్" చదివాను. అక్కడివే ఈ పాయింట్స్ అన్నీ. అప్పటి నుండి ఇప్పటివరకు ఏ పాయింట్ మారలేదు. అందులో అమ్మ నాన్నలకి సహాయం చేయాలని చెప్పాడు. నాన్నగారికి నేనేం సహాయం చేస్తాను? అమ్మకు వంటలో సహాయం చేద్దామని వెళ్ళేవాడిని. అమ్మ ఏం అనేదో తెలుసా "నాన్న! నువ్వు వంటింటిలోకి రాకుండా ఉంటే అదే పెద్ద సహాయం". ఎందుకు? సహాయం చేయటం చాతకానప్పుడు నువ్వు వాళ్ళకి అడ్డం పడినవాడివి అవుతాడు. మాష్టారే అలా ఉండేవారు కదా అని పని ఎగ్గొట్టకండి.

**మిన్ను విరిగి మీద పడ్డా చలించనివారే జీవితంలో పైకి రాగలరు**

"ప్రయత్నించాను, అవలేదు మాష్టారు!". మరల ప్రయత్నం చేయి. "అవలేదు మాష్టారు!" మరల మరల ప్రయత్నిస్తూ ఉండటమే. ఎంతవరకు? చివరి వరకు.

మనస్సును మార్చుకోవాలి. చేసి తీరాలనే పట్టుదల ఉండాలి. ఈ మార్చుకునే దానినే "ఆత్మబోధ" అంటాము. "నేను ఆత్మను, నేను దివ్యాత్మను, ప్రపంచం అంతా నాది" అని అనుకోకండి. "నేను ఆత్మను అనుకొంటే ఏమి లాభం?" నీకు తెలుసా నీవు ఆత్మవని? ఎందుకు మనలను మనం మోసం చేసుకోవడం? వద్దు. నీవు మనిషివి. సందేహం లేదు కదా! నువ్వు ఆలోచించిన దాన్ని ఎవడు అడ్డుపెట్టలేడు. నువ్వు చేయదలచుకున్న దాన్ని ఎవడు ఆపలేడు. రాత్రి పడుకునేటప్పుడు డైరీ వ్రాయాలి. దానిని ఆత్మబోధ అని వ్రాసుకోండి. కొందరు నిద్ర ఎలా కంట్రోలు చేసుకోవాలి అని అడుగుతున్నారు. **పని మీద శ్రద్ధ ఉంటే ఆటోమేటిక్‌గా నిద్ర కంట్రోలయిపోతుంది.**

విజయవాడలో మా చెల్లెలు, మా చెల్లెలు కూతురు, నేను కబుర్లు చెప్పుకునేవారం. తొమ్మిదిన్నరకి "అన్నా నిద్రవస్తుంది" అనేది. నేనేం మాట్లాడేవాడిని కాదు. టివి ఆన్ చేసేవాడిని. అంతా టివి చూస్తుండేవాళ్ళం. మరి ఆ నిద్ర ఏమయింది అప్పుడు? టెక్స్ట్ బుక్ తెరవగానే నిద్ర వస్తుంది అంటే మీకు చదువుమీద శ్రద్ధ (interest) లేదని అర్థం చేసుకోవాలి.

మరేమి చేయాలి? మనకి మనమే ఇంట్రస్ట్ (interest, ఇష్టం) కలిగించుకోవాలి. మిమ్మల్ని మీరు తరచి, తరచి చూచుకోండి. గొప్పవాళ్ళమవ్వాలని అనుకుంటే పని మీద ఇష్టం కలుగ చేసుకోవాలి. మీ టైము వృధాచేసేవారిని, మీ ధనాన్ని వృధాచేసే వారిని, మీ వనరులు వృధాచేసేవారిని దగ్గరకు రానీయకండి. దొంగ అని తెలిస్తే ఎవరినైనా ఇంట్లోకి రానిస్తామా? మీ టైము వృధాచేసేవారందరు పెద్ద దొంగలు. మీ స్నేహితులని, బంధువులని పేరు పెట్టుకుని మీ కాలాన్ని తినేస్తుంటారు. ఒప్పుకోకండి. ఎక్కడ గట్టిగా ఉండాలో ఎక్కడ గట్టిగా ఉండకూడదో నేర్చుకోండి. అభ్యాసంతో వస్తుంది.

చాలామంది, పని మొదలుపెట్టి మధ్యలో మానేస్తుంటారు. ఏ పని మధ్యలో మానెయ్యకూడదు. మీరు అస్తవ్యస్తంగా చేసే పనులు చూచుకోండి. మీ ఇంట్లో చెప్పులు ఎలా పెడతారు. ఇంటికి రాగానే చెప్పులు అలా పడేస్తారా? ఏదైనా పద్ధతిగా పెడ్తారా? పుస్తకాలు, బట్టలు అన్నీ పద్ధతిలో చక్కగా పెట్టుకోవాలి. ఇది చాలా ముఖ్యం. ఇలా చేయని వాడు ఎదగలేడు. ఎందుకంటే జీవితం అనేది నిరంతరం సాగుతుంటుంది. (Life is a Continuous Process) ఒకటి తప్పిందంటే అన్నీ తప్పుతాయి. దండెం మీద బట్టలు ఆరేస్తారు. ముద్దముద్దగా పడేస్తారు. సవ్యంగా ఆరెయ్యాలి. సాగదీసి మరీ ఆరెయ్యాలి. అలా చేయకపోతే కోటీశ్వరులు కాలేరు.

మీరు బాగా గుర్తుంచుకోవలసినది ఏమంటే బాధ్యతను తీసుకున్నవారే అవతార పురుషులు. వారి జీవితాన్ని వ్యవస్థగా మలచుకున్నారు. వారు సమాజంలో ఉన్న అవ్యవస్థ చూచారు. మీ జీవితాన్ని ఇలా చేసుకోండి. వ్యవస్థగా వస్తుంది అన్నారు. ఈనాడు వాళ్ళ ఫోటోలకు దండలేస్తున్నాం. వారికి ఎవరు చెప్పారు ఇలా చేయమని? ఒక మంచిని పదిమందికి చెప్పాలనే బాధ్యత స్వీకరించారు అంతే.

కొందరి వంట ఇల్లు ఉంటుంది. కంచాలు పద్ధతిలో ఉండవు. చిన్న కంచం ముందుపెట్టి పెద్ద కంచం వెనుక పెట్టాలనే అనే సింపిల్ వ్యవస్థ లేదు. వాళ్ళ జీవితాలు అలాగే ఉంటాయి. ఇక పెద్ద పెద్ద సమస్యలు వస్తే వారేమి చేయగలరు? ప్రతి ఒక్కరు వారి వారి లోపాలు చూచుకుని సరి చేసుకోవాలి. చాలామంది ఇళ్ళలో దువ్వెన చూస్తే భలే ఆనందమేస్తుంది. మట్టి పూడుకుపోయి ఖాళీలు ఉండవు. తల దువ్వుకున్నప్పుడే దాని శుభ్రం చేస్తే ఆ మట్టి ఉండదుగా! ఇన్ని తప్పులు జరుగుతుంటాయి. ఇలా చేస్తుంటే కోటేశ్వరులు ఎలా అవుతారు?

ఇళ్ళలో పైన నీళ్ళ టాంక్‌లో నీళ్ళు నింపుతుంటారు. నీళ్ళు టాంక్ నిండి బయటకు వచ్చి కారిపోతుంటాయి. ఎప్పుడో ఆపుతారు. దీనివలన రెండు తప్పులు జరుగుతున్నాయి. 1) నీరు వృథా 2) కరెంటు వృథా. మీకు మంచి నీళ్ళు ఉన్నాయని నీళ్ళే కదా అని వృథా చెయ్యవచ్చా? మీ స్కూటర్‌లో కార్బరేటర్ ఏదో లీకవుతుంది. మీరు దానిని వెంటనే బాగు చేయించరు. మీరు ఐశ్వర్యవంతులు కాలేరు. మీ ఇంట్లో పంపులలో నుంచి నీరు లీక్ అయి కారిపోతున్నాయి. బాగు చేయించరు. మీరు ఐశ్వర్యవంతులు కాలేరు. చాలా సీరియస్‌గా చెప్తున్నాను. అక్కడే లీకింగ్ మొదలయ్యింది. బావిలో నీళ్ళు తోడుకోవడానికి బక్కెట్టు వేశావు. బక్కెట్టులో చిల్లులుంటే ఎన్ని నీళ్ళు వస్తాయి మీకు? చిల్లులు ఎక్కువ ఉంటే అసలు నీళ్ళే రావు. కేవలం శ్రమ మాత్రమే మిగులుతుంది. **అలాగే మీరు టైమును ఎంత సద్వినియోగ పరచుకున్నా, ఎంత కష్టపడి పనిచేసినా, ఇవి మీ స్వభావంలో ఉండే కన్నాలు మిమ్మల్ని పైకిరానివ్వవు.** వీటిని సరిచేసుకోవాలి. మనం సరిచేసుకుంటుంటే వ్యాఖ్యానం చేసే వాళ్ళుంటారు. మంచి పని చేస్తుంటే "ఆహా ఎన్నాళ్ళు చేస్తావులే, చూస్తాగా" ఇలాంటి మాటలు పట్టించుకోకండి. "ఎవరు ఏమన్నా నిరాశపడను నేను మారాలి అనుకున్నాను, మారుతున్నాను".

వనరులున్నా శారీరిక శ్రమకు భయపడి వనరులను ఉపయోగించుకోలేనివాడు ధనవంతుడు కాలేడు. ఇంక కృతజ్ఞత. మీరు ఎక్కడెక్కడ కృతజ్ఞత చూపించగలరో అక్కడక్కడ కృతజ్ఞత చూపించడం నేర్చుకోవాలి. కాని ప్రతిచోట కృతజ్ఞత పైకి చూపించ లేకపోవచ్చు. ఈ క్లాసు తీసుకున్నారు. థాంక్స్ మాష్టారు! అని అనక్కర్లేదు. అమ్మ మంచి నీళ్ళు ఇచ్చింది థాంక్యూ అనక్కర్లేదు. కాని నీ మనస్సులో ఆ ఫీలింగ్ వచ్చి తీరాలి.


– డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు
యువతకు ఇచ్చిన ఉపన్యాసముల నుండి

(మాష్టారు గారి ఉపన్యాసముల సి.డి.లు కావలసిన వారు సంప్రదించండి ఫోన్: 9441901275)

**జీవితంలో సమతుల్యంగా (బాలెన్స్‌డ్‌గా) ఉండటం నేర్చుకోవాలి**

# ప్రతీక విజ్ఞానం

ప్రతీకలు జీవితంలోని మనోవైజ్ఞానిక సత్యాలు. విస్తృతమైన జ్ఞాన విజ్ఞానములు, శిక్షణ-ప్రశిక్షణలు, తమను తాము సంక్షిప్తం గావించుకొని, ప్రతీకల రూపంలో బోధనకు సులువుగా మార్గ దర్శనం చేస్తున్నాయి. సత్యము వైజ్ఞానికమైనదైనా లేదా ధార్మిక, ఆధ్యాత్మికతలకు చెందినదైనా ఏదైనా సరే, దానిని హృదయంగమం చేసుకోవాలంటే ప్రతీకల (చిహ్నాల) సహాయం తీసుకొనటం తప్పనిసరి. కార్బన్‌డైఆక్సైడ్ యొక్క స్వరూపాన్ని (లక్షణాలను) అర్థం చేసుకొనడానికి $Co_2$ అనే పదం చాలు. అదే విధంగా నీటి గురించి దాని లక్షణాలను చెప్పటానికి $H_2o$ అంటే సరిపోతుంది. యుగద్రష్టయైన స్వామీ వివేకానంద కూడా వేదాంత జ్ఞానము, ఆధ్యాత్మిక ఉపాసనా రంగములలో దీని ఆవశ్యకతను గురించి నొక్కి వక్కాణించారు. బ్రహ్మ స్వరూపమును తెలియజేసి ఆ పరమసత్యమువైపు మనం చూసే విధంగా ప్రతీకలు ఉండాలని ఆయన అభిమతం. వాస్తవమేమిటంటే ఆ పరమాత్మకు అన్నింటికంటే సార్థకమైన ప్రతీక ఈ విశ్వబ్రహ్మాండమే.



ఆచార్యులు (గురువులు) ప్రతీకోపాసనను గురించి తమదైన శైలిలో వివరించటానికి ప్రయత్నం చేశారు. బ్రహ్మసూత్రాలకు సంబంధించిన శ్రీ భాష్యంలో ఆచార్య రామానుజుల వారు, **ఆ బ్రహ్మణి బ్రహ్మదుష్టయాను సంధానమ్"** అని చెప్పారు. అనగా "బ్రహ్మము కానటువంటి వస్తువేదైనా ఉంటే, అందులో బ్రహ్మదృష్టిని ఉంచటం, బ్రహ్మను పరిశోధించటమే" అని అర్థం. శంకరాచార్యుల వారు ఈ సత్యాన్ని ఈ క్రింది విధంగా విశ్లేషిస్తున్నారు.

**మనో బ్రహ్మేత్యుపాసీతేత్యధ్యాత్మ**
**అథాధి దైవాత్మా కాశౌ బ్రహ్మేతి**
**తథా ఆదిత్యో బ్రహ్మేత్యాదశః**
**స య నామ బ్రహ్మేత్యుపాస్తే ఇత్యేవ మాదిపు**
**ప్రతీకోపాసనేషు సంశయః**

అనగా మనస్సును బ్రహ్మరూపంలో ఉపాసించు, ఇది అంతరంగ ఉపాసన. ఆకాశాన్ని బ్రహ్మ రూపంలో ఉపాసిస్తే అది ఆధిదైవికమైనది. మనస్సు అంతరంగమునకు ప్రతీక అయితే, ఆకాశం బాహ్యతత్వమునకు ప్రతీక. ఈ రెండింటి ఉపాసన బ్రహ్మ రూపంలో చేయవలసి ఉంటుంది. శ్రీ అరవిందుల వారి అభిప్రాయాన్ననుసరించి ప్రతి ఒక్క పదార్థము ఏదో ఒక ఉన్నత స్థాయి సత్యమునకు ప్రతీక. ప్రపంచంలోని అన్ని మతములలోను, ఉపాసకులందరు ఎలాంటి అభ్యంతరం లేకుండా చిహ్నమును ఉపయోగిస్తారు. ఇస్లాము, ప్రొటెస్టంట్ ఈ రెండు మతాలవారే ప్రతీకల ఉపయోగాన్ని అవసరంగా భావించటం లేదు. సమగ్రంగా పరిశీలించితే, మానవజాతి యావత్తు ఏదో ఒక రూపంలో ప్రతీకలను ఉపయోగిస్తున్నారు.

చిహ్నాల చరిత్ర చాలా దీర్ఘమైనది, విస్తృతమైనది కూడా! జనార్ధన మిశ్రాగారు "భారతీయ ప్రతీక విద్యా" అనే తన గ్రంథంలో, ప్రప్రథమంగా సృష్ట్యాది నుండే చిహ్నముల కల్పన ఆరంభమైనది అని వ్రాశారు. గుహలలో నివసించే ఆదిమానవులు అందంగా కన్పించే పక్షులు, జంతువుల బొమ్మలను రంగురంగుల రాళ్ళతో తమ గుహల గోడలపైన చిత్రిస్తుండేవారట. అప్పటినుండే చిహ్నముల వికాసక్రమం ప్రారంభమైంది. మానవుని ఆలోచనలు అభివృద్ధి చెందేకొద్దీ చిహ్నముల యొక్క రూపాలు కూడా అభివృద్ధి చెందసాగాయి. వాని సంఖ్య కూడా పెరిగింది. చిహ్నములను జోడించడం మానవుని సహజ స్వభావం. సమున్నతమైన చిహ్నాలు ఒక ప్రత్యేకమైన జాతి యొక్క అభివృద్ధికి ప్రమాణాలుగా నిలబడేవి. మహాభారతము, రామాయణము, వేదాలు, ఉపనిషత్తులు మొదలైనవన్నీ ప్రతీకలతో నిండి ఉన్నాయి.

"ఆలోచనల అభివృద్ధి" అనే చరిత్ర పుటలను తిరగవేస్తే, మానవుడు ప్రప్రథమంగా చిహ్నాలు, సంకేతాల ద్వారానే తన పనులను చేసుకునేవాడు అని అర్థమవుతుంది. అప్పట్లో అతనికి భాషరాదు. "మన సంస్కృతి" అనే గ్రంథంలో శ్రీ సుదర్శన సింహ చక్రవర్తి మానవుడు కల్పించుకున్న ప్రతీకలన్నీ ప్రాచీన నిత్య ప్రతీకల ఆధారంగా నిర్మించుకున్నవే అని ఖచ్చితంగా తెలుస్తుంది. ప్రతీకల ఉత్పత్తి విషయంలో అభిప్రాయ భేదాలు ఉండవచ్చు కానీ, అసలు వాని పుట్టుక మాత్రం భారతదేశంలోనే ప్రారంభమై, క్రమంగా ఇతర దేశాలకు వ్యాపించింది. భారతీయ వేదాంతంలో ప్రతీకలు, ప్రతీకవాద, సంకేతవాద, ప్రతీక ప్రక్రియ, ప్రతీక విజ్ఞానము మొదలైన అనేక రూపాలలో లభిస్తున్నాయి. పాశ్చాత్య దేశాలలో దీనిని సింబాలిజమ్, సిగ్నిఫికెన్స్, మిమియోసిస్, సిమియోలాజి మొదలైన రూపములలో వ్యక్తం చేయబడినది. ప్రతీకవాదము చిహ్నముల యొక్క దార్శనిక, భాషిక (language), మనోవైజ్ఞానిక, సాంస్కృతిక అంశములన్నింటితో కూడుకున్నదై ఉంటుంది.

**ఇతరులను విసుక్కుంటే వారు మీకు దూరం అవుతారు**

అరవింద మహర్షి యొక్క అభిప్రాయాన్ని అనుసరించి ప్రతీకలు (చిహ్నములు) ఈ క్రిందివిధంగా ఉంటాయి. **1) రూఢ ప్రతీకలు:** వేదకాలపు ఋషులు తమ పరిసరములలో ఉండే పదార్థములలో కనపడునవి. ఇవి ప్రకటీకృతమవుతూనే జీవంత మవుతాయి. ఋషులు వీనికి ప్రాణమును పోసిరి, ఇవి వారి జీవితములలో ఒక అంగంగా మారిపోయినవి. వారి అంతర్దశనములు. ఆధ్యాత్మిక కాంతిరూపములో వారికి ప్రకటిత మవుతుండేవి. **2) జీవంత ప్రతీకలు:** వ్యావహారిక జీవనము నుండి లేదా ఆయా పరిస్థితుల నుండి సహజంగా వికసించి అంతే సహజంగా జీవితాన్ని ప్రభావితం చేసేవి. **3) సహజమైన ఔచిత్యం ఉన్న ప్రతీకలు:** ఆకాశము, ఆకాశ ప్రదేశము సనాతన బ్రహ్మకు ప్రతీకలు. ఏ జాతిలోనైనా దీనికి అర్థం ఒకటిగానే ఉంటుంది. సూర్యుడు ఈ అఖిల విశ్వంలో అతిమానస ప్రకాశము యొక్క దివ్య విజ్ఞానాన్ని వ్యక్తం చేస్తాడు. **4) మానసిక ప్రతీకలు:** సంఖ్యలు, రంగులు వీనికి ఉదాహరణ

స్వామీ వివేకానంద ప్రతీకలను ప్రముఖంగా రెండు విధాలుగా విభజించారు. 1) నిత్య ప్రతీకలు 2) కల్పిత ప్రతీకలు. నిత్య ప్రతీకలు తమ భావానికి లేదా పదార్థంతో ఎల్లప్పుడూ సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఆ భావాన్ని మరి ఇంక ఏ విధంగాను సూచించటం సాధ్యం కాదు. ఉదా: ఆకాశమునకు ప్రతీక శూన్యం. దీనిని ఇక దేనితోను పోల్చలేము. తరువాత ఊహల ద్వారా కల్పించబడిన ప్రతీకలు వెలుగులోనికి వచ్చాయి. శక్తుల యొక్క పేర్లు, దేశాల జెండాలు, ఇంకా ఇలాంటివే మరికొన్ని ఇతర చిహ్నాలు కల్పించబడినవి. కల్పితమైన ప్రతీకలు ఏదో ఒక భావము, సంఘటన లేదా బాహుళ్యాన్ని సూచిస్తాయి. ఏదైనా ఒక దేశము, లేదా ఒక సంస్థ, లేదా ఒక వ్యక్తి తనదైనా జెండా లేదా చిహ్నమును నిర్ణయించుకుంటే, ఆ చిహ్నంలో ఆ వ్యక్తి లేదా దేశం లేదా తత్సంబంధమైన భావము ఇమిడి ఉంటుంది. క్రిస్టియానిటిలో "క్రాస్" (శిలువ) అనే చిహ్నం ఏసుక్రీస్తు భరించిన వేదనకు చిహ్నం. రష్యా దేశపు ఎలుగుబంటి, అమెరికాకు చెందిన ఏనుగు, ఆస్ట్రేలియా దేశపు కంగారు, భారతదేశపు సింహాలు కూడా ఇదే భావాన్ని ప్రదర్శిస్తాయి. ఒకజాతి ఏదైనా ఒక శ్రేష్టమైన చిహ్నాన్ని ఎంచుకొని, దానిని దురుపయోగపరచి అవమానపరిస్తే, ఆ ప్రతీక ఆ అత్యాచారానికి చిహ్నంగా మిగిలిపోతుంది. హిట్లరు యొక్క క్రూరత్వము హిందూ సంస్కృతి యొక్క మంగళ చిహ్నమైన స్వస్తిక్‌ను కళంకితం కావించింది. ఇదే విధంగా ప్రేమ, సాహసాలను ప్రతీక అయినా ఎర్ర జెండా, రష్యాలో నాస్తికత, జడ సామ్యవాదములకు చిహ్నంగా మారిపోయింది.

'భారతీయ సంస్కృతిలో ప్రతీకలు యదార్థములు, వాస్తవాలు. ద్రష్టలైన ఋషులు తమ అనుభూతులు, సాక్షాత్కారముల ద్వారా ఆకాశంలో ఈ చిహ్నాలను చూడగలిగేవారు. తరువాత వాటిని సమాజంలో ప్రవేశపెట్టేవారు. అక్షరములు, వర్ణములు, రంగులు, ప్రకాశములు మొదలగు ప్రతీకలన్నీ వారు మనకు ప్రసాదించిన వరాలే! ఉపాసనకు ఉపయోగించే దేవీ దేవతల యొక్క చిత్రములు, రూపముల వెనుక ఈ సత్యమే పనిచేస్తూ ఉన్నది. ఋషి సత్యములు ఈ భౌతిక హద్దులను దాటి, మనస్సు కావల, భావ జగత్తులోని సత్యాలను, ఆ ప్రతీకలతో జోడిస్తూ ఉండేవారు. ఈ విధంగా ఏ చిహ్నము (ప్రతీక) ఏ భావముతో సంబంధించబడి ఉంటుందో, అదే ఆ భావము యొక్క నిత్య ప్రతీకగా ప్రతిపాదింపబడుతుంది, ఎందుకంటే మనస్సు ఆ ప్రతీకకు సంబంధించి ఆ భావమే స్ఫురిస్తూ ఉంటుంది గనుక. నిత్య ప్రతీకలు పలురకాలుగా ఉంటాయి. ఉదా: చిహ్న ప్రతీకలు, రంగుల ప్రతీకలు, పదార్థ ప్రతీకలు, ప్రాణి ప్రతీకలు, పుష్ప ప్రతీకలు, శాస్త్ర ప్రతీకలు, వృక్ష ప్రతీకలు, వేష ప్రతీకలు మొదలైనవి.

చిహ్న ప్రతీకలలో తంత్రోపాసనకు చెందిన యంత్రములు, సాముద్రిక శాస్త్రమునకు చెందిన త్రిభుజము, చతుర్భుజములు, అక్షరములు మొదలైనవన్నీ వస్తాయి. ఇవి ప్రకృతి యొక్క మూల అర్థముతో సంబంధం కలిగిఉంటాయి. తంత్రములో వజ్రశక్తి అభివ్యక్తమవుతుంది. భారతీయ సంస్కృతిలో స్వస్తిక్ అన్నింటి కన్నా ప్రధానమైన చిహ్నము. రేఖాకృతులన్నీ స్వస్తిక్‌లో ఇమిడి ఉన్నవి. ప్రణవమైన ఓంకారము యొక్క ఆకృతి నాదరహితమై నప్పుడు, స్వస్తిక్‌గా భావించబడుతుంది. స్వస్తిక్ నలువైపులు ప్రగతి, రక్షణ, ఉన్ముక్త ద్వారమును సూచిస్తుంటాయి. దీనిని శుభకరమైన అర్థముతో ప్రయోగించటం జరుగుతుంది. స్వస్తిక్ బుద్ధిని ప్రసాదించే విఘ్నేశ్వరుడి యంత్రము. ఈ మంగళ చిహ్నాన్ని విదేశీయులు తల్లక్రిందులు చేసి అపవిత్రం గావించారు. క్రైస్తవుల శిలువ కూడా దీని సంక్షిప్తరూపమే.

చిహ్న ప్రతీకలవలెనే రంగుల ప్రతీకలు కూడా ముఖ్యమైనవి. వీటిని ముఖ్యంగా ఉపాసనా పద్ధతులలో ప్రయోగిస్తారు. సత్, రజ, తమో అనే మూడు గుణాల ఆధారంగా రంగుల ప్రతీకలు ఉంటాయి. తెలుపు సత్వ గుణ ఆధారంగా ఉంటుంది. ఇది ప్రతిభ, యశస్సు, శాంతి, సత్యము, ధర్మమునకు ప్రతీకగా నిలుస్తుంది. ఎరుపు రంగు రజోగుణ చిహ్నము. నలుపురంగు తమో గుణాన్ని సూచిస్తుంది. ఇది అభావము, అంధకారము, మృత్యువు మొదలగు వాటిని తెలియజేస్తుంది. రెండు లేక అంతకన్నా ఎక్కువ గుణములు కలిసి ఏర్పడే కార్యము యొక్క రంగు మిశ్రమ రంగు అవుతుంది. క్రోధములో తమస్సు, రజస్సు రెండూ మిశ్రమమై ఉంటాయి. కానీ ఎక్కువ భాగం రజోగుణం యొక్క విశేష ప్రభావముంటుంది. అందుచేత దీనిరంగు నలుపు అయినప్పటికి దీనిని నీలలోహిత మన్నారు. తేలికపాటి గులాబి రంగుకు చిరునవ్వుకు ప్రతీకగా భావించడమైనది. శ్రీ అరవిందుల వారి అభిప్రాయాన్ని అనుసరించి రంగు, కాంతి రెండూ ఒకదాని వెంట ఒకటి అనుసరించి ఉంటాయి. రంగు ఎక్కువ సాంకేతికపరంగా ఉంటే, ప్రకాశం ఎక్కువ గతిశీలంగా ఉంటుంది. రంగు శక్తుల నుండి వేరుగా ఉండదు. మనస్సును పసుపు రంగుతోను, హృదయాన్ని గులాబి రంగుతోను, ప్రాణాన్ని వంకాయరంగుతోను సూచించటం జరుగుతున్నది.

**విసుగుకి మూలకారణం అసంతృప్తి**

పదార్థముల చిహ్నాల విషయానికొస్తే, శంఖం మంగళకరమైన చిహ్నంగా భావించబడుతున్నది. ఇది పవిత్రతకు సంకేతం. పదార్థముల ప్రతీక కేవలం భావముల యొక్క మూర్తీభవించిన రూపమే. సృష్టికర్తయొక్క భావమే పదార్థములుగా మార్పు చెందుతాయి. వాటి చిహ్నములు వేర్వేరుగా ఉంటుంటాయి. బంగారం స్థిరత్వానికి, దృఢత్వానికి ప్రతీక. పాలు ఉన్నతస్థాయి చేతనత్వ ప్రవాహానికి ప్రతీక. నది చేతనత్వము యొక్క కదలికకు, పర్వతం ఆరోహణ శీల (ascending) చేతనత్వమునకు, భూమి సహనానికి ప్రతీకలుగా భావించబడినాయి. ఆవు, హంస, గుఱ్ఱము ప్రాణులకు ప్రతీకలుగా భావించబడడమే కాదు, ఆధ్యాత్మిక జగత్తులో వీనికి విశేష స్థానమున్నది. సాధకుడు తన యొక్క తీవ్రమైన ధ్యానస్థితిలో చూడగలిగే ఈ ప్రతీకలను బట్టి తన స్థితిని, స్థాయిని ఆకళింపు చేసుకొనగలడు. వేదాలలో ఆవుకు దివ్య ప్రకాశమని అర్థం. వృషభం శక్తికి, సామర్థ్యానికి, ధర్మానికి చిహ్నము. గుఱ్ఱము, ఏనుగు బలానికి ప్రతీకలు కాగా, హంస జ్ఞానభావమును ప్రదర్శిస్తుంది.

పాము ప్రకృతిలో శక్తికి సంకేతం. విశ్వబ్రహ్మాండాన్నంతటిని మోస్తూ ఉన్న అనంతనాగుడు (ఆదిశేషుడు), ఎల్లలు లేని దిక్ దిగంతాల స్వరూపుడు. లేడి ఆధ్యాత్మిక మార్గంలో తీవ్రతను సూచిస్తుంది. ముక్తినొందిన అంతరాత్మను హంస సూచిస్తుంది. తెల్లని పావురం శాంతికి, నెమలి విజయానికి, కొంగ సుఖానికి సందేశ వాహకులు. కాగా ఆస్ట్రిచ్ పక్షి గతి యొక్క వేగాన్ని సూచించటానికి ఉపయోగకరమవుతుంది. రాజసిక సామర్థ్యాన్ని, ప్రచండతను పంది సూచిస్తుంది. అంధకారమయమైన ప్రాణ శక్తుల స్వభావము, తామసిక ఉగ్రతాభావాన్ని బర్రె సూచిస్తుంది. మేక కాముకత్వానికి సంకేతం. కుక్క స్వామిభక్తితో నిండిన అనురాగానికి, ఆజ్ఞను పాలించటానికి సంకేతం. కప్ప వినమ్రతకు, ఉపయోగపడటానికి, చేప ఎల్లప్పుడూ అన్ని రకాలైన నిర్మాణాలను చేస్తుండే చంచలమైన ప్రాణికి సంకేతాలు. ఈగలు క్షుద్రతరమైన (అల్పమైన) ప్రాణి యొక్క చిన్న చిన్న వస్తువులకు, చెదలు భౌతిక శక్తిలో అల్పమైనవే అయినా వినాశకర శక్తికి సంకేతాలుగా భావించబడినవి.

పుష్పముల సంకేతాల గురించి చెప్పాలంటే, తామరపువ్వు ఐశ్వర్యానికి, సుఖానికి సూచనగా నిలుస్తుంది. అంతేకాదు, ఇది వికసించిన (ఉన్నతస్థాయి) చేతనత్వమునకు సంకేతం. ఈ భూమిపై భగవంతుని ఉనికికి ప్రతీక ఎఱ్ఱతామర. సాధారణంగా తామర పువ్వును శృంగారము, శోభ, క్రీడలను సూచించడానికి ఒకే విధంగా ఉపయోగిస్తుంటారు. దూర్వా, కుశ, తులసి, అశ్వత్థ, వట, పలాశ, అశోక, బిల్వ వృక్షాలు దేవతలకు ప్రతీకలుగా భావించబడుతున్నవి. అలాంటి వృక్షాలు అవచేతన ప్రాణమును కూడా దర్శింపచేస్తాయి. వృక్షాలవలెనే వాద్య యంత్రాలు కూడా కొన్ని సందర్భాలలో ప్రతీకలుగా నిలుస్తున్నవి. వానిలో శంఖము ఆధ్యాత్మిక పిలుపు నందిస్తే, వేణువు శ్వాసగా, భగవంతుని పిలుపుగా వినబడతాయి. శంఖం విజయానికి ఘోషణ. వీణ సామంజసానికి (**सामंजस्य सूचक** అన్యోన్యత) ప్రతీక. మృదంగము నాట్యానికి, డమరు తీవ్రమైన నృత్యానికి చిహ్నాలు, భేరీ యుద్ధమునకు సూచిక, అలాగే బాణము లక్ష్యాన్ని సూచిస్తుంది. గద శక్తికి, కత్తి శస్త్ర బలానికి, త్రిశూలము ఛేదించటానికి సూచనలు. ఢాలు అంటే సంరక్షణ అని అర్థము. చక్రము ప్రకృతి పైన క్రియను చూపించే శక్తి. సుదర్శన చక్రము శ్రీకృష్ణుని యొక్క శక్తికి, క్రియాశీలతకు చిహ్నంగా నిలుస్తుంది.

శిఖ, యజ్ఞోపవీతం, మేఖల, తిలకం, మాల, దండం, కాషాయ వస్త్రం, పీతవస్త్రము మొదలైనవన్నీ వేషము యొక్క ప్రతీకలలో అంతర్గతంగా నిలుస్తాయి. యజ్ఞోపవీతం గాయత్రి యొక్క స్థూల ప్రతీక. దానిలోని మూడు గ్రంథులు క్రమంగా బ్రహ్మగ్రంథి, విష్ణు గ్రంథి, రుద్ర గ్రంథికి సంకేతాలు. హద్దులు సంయమానికి సూచన. తిలకం దిద్దుకోవటమనే నిష్ఠ, శోభ, శృంగారము, సంపదలను సూచిస్తుంది. కాషాయ వస్త్రాలు వైరాగ్యానికి ప్రతీక. వసంత కాలపు రంగు (ఆకుపచ్చ) మనస్సులోని చంచలత్వాన్ని, అసంయమతను దూరం చేసి, ఉల్లాసాన్ని సంచారం కావిస్తుంది. మనస్సు, వాక్కు, శరీరం బాధకు గురి అయినప్పటికి ఎవరినీ దండించకుండా ఉండగలగటం దండాన్ని చేతబూనటంలోని అర్థం. అందుచేతనే సన్యాసులు దండమును ధరిస్తారు. బ్రహ్మచారి రావికొమ్మను దండంగా ధరిస్తాడు. బ్రహ్మచారులు దండం ధరించటంలో వారు బ్రహ్మచర్యమనే వ్రతంలో ఉన్నట్లు తెలియజెయ్యడం.

ఇవేకాకుండా, రకరకాలైన ఇతర ప్రతీకలు కొన్ని ఉన్నాయి. సూర్యుడు అంటే అంతరంగంలోని సత్యముగా తెలుసుకోవాలి. చంద్రుడు ఆధ్యాత్మిక ఆనందాన్ని చూపిస్తాడు. నక్షత్రాలనగా నిర్మాణమని అర్థం. అగ్ని శక్తివంతమైన క్రియను సూచిస్తుంది. ఇంద్రధనస్సు శాంతికి, ముక్తికి చిహ్నం. మబ్బులు అంధకారాన్ని సూచిస్తాయి. పాతాళము పృథ్విలోపల అవచేతనమును పరిచయం చేస్తుంది. మంచు ఆధ్యాత్మిక సమృద్ధిని, భగవంతుని దయ అవతరణాన్ని సూచిస్తుంది.

చిహ్నాలకు సంబంధించిన ఈ జ్ఞానము మానవ హృదయంలోని రహస్యాలనే కాదు, ఈ యావత్ సృష్టిలోని గతిశీలమైన చేతనత్వము యొక్క రహస్యాలను కూడా తెలియచేస్తాయి. ప్రతీక విజ్ఞానమనే కారణంగానే, సముద్రమంత విశాలమైన జ్ఞానాన్ని కూడా, కడవ అంత చిన్న మట్టి పాత్రలో ఇమిడించగలము. తగినంత సమాచారం లేకపోవటం చేత, ప్రతీక విజ్ఞానంలోని అధికాంశ రహస్య భాగము వికృతమై కేవలం కల్పనగా మిగిలి పోయింది. సమృద్ధమైన ఈ విజ్ఞానాన్ని తిరిగి ప్రతిపాదించవలసిన అవసరం ఈనాడు ఎంతైనా ఉన్నది. ప్రతిపాదించబడటమంటే, జీవితం యొక్క మనోవైజ్ఞానిక సత్యములను సరియైన అర్థములో తెలుసుకొనడమే.

*– అఖండజ్యోతి, జనవరి 2000*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**విసుగు వల్ల ఏమి లాభం ఉండదు**



ఆదిశక్తి యొక్క లీలాకథలు - 28

# అవరోధాలను గుర్తించి, జీవనశైలిని వికసింపజేసుకోండి

ఆదిశక్తి లీలాకథ అత్యంత పరమ ఆత్మకళ్యాణకరమైనది. దీని పారాయణ వలన, శ్రవణం వలన, మంత్రముల యొక్క మననము వలన శక్తి సాధకుడు చిత్తములోని కుటిలత్వము, కుసంస్కారము, కుచక్రమునుండి విముక్తి పొందుతాడు. మానవుని జీవనమునందు వచ్చే ఆపదలు, విపత్తులు మరియు అతనిని చుట్టుముట్టు సంకటములు, చికాకులు వీటన్నింటికి కారణము అతని యొక్క సంచితదుష్కర్మలే! నియంత యొక్క ఈ నియమమును తెలుసుకున్న మానవులు తమ జీవితములోని సంకట పరిస్థితులలో జగన్మాత ఆదిశక్తి భగవతీ మహామాయను శరణు వేడుతారు. ఈ సత్యము తెలియనివారు, అవగాహన లేనివారు మాత్రమే అటు ఇటు పరుగెడుతూ దెబ్బలు తింటూ ఉంటారు. ఎవరైతే తమ కష్టాలకు ఇతరులను నిందిస్తూ వారిపట్ల ద్వేషము, వైరము పెంచుకుంటూ ఉంటారో వారు తమ అంతః కరణమును దహించుకుంటూ ఆ అగ్నిలోనే కాలిపోతారు. దానితోపాటు చెడు పనులు, కుతర్కములు, చెడు సంస్కారముల నూతన శృంఖలను నిర్మించుకుంటారు. దానివలన వారి భావి జీవితము, రాబోయే భవిష్యత్తు దట్టమైన అంధకారంలో కూరుకు పోతుంది.

ఉజ్జ్వల భవిష్యత్తును, సుఖప్రదమైన జీవితమును కోరుకునే మానవులు సత్కర్మలు అనే ఆధారమును పట్టుకునే నడవాలి. దీనికొరకు సాధనాత్మకమైన జీవితమును అలవరచుకోవాలి. అప్పుడే మానవుడు దుస్తరమైన సంకటములనుండి సునాయాసముగా బయటపడతాడు. మహామాయకు శరణాగతి చేసుకునే సాధకులు వర్తమానకాలములో మాత్రమేకాక భవిష్యత్తును కూడా స్వయముగానే బంగారమువలె సుఖప్రదంగా ఉజ్జ్వలంగా మలచుకుంటారు. దీనికోసము చక్కని స్వభావము, నిర్దోషియైన, నిశ్చలమైన మరియు పసిబిడ్డల సరళమైన మనస్సు అవసరము.

ఆదిశక్తి లీలాకథయొక్క గత సంచికలో సురథుడనే మహారాజు కథను చెప్పటం జరిగింది. ఈ మహారాజు సురథుడు స్వారోచిష మన్వంతరమునకు చెందిన రాజు. ఆయన చైత్రవంశమున జన్మించాడు. సమస్త భూమండలము మీద ఆయన ఆధిపత్యము వహించాడు. జగన్మాత యొక్క ఈ లీలాకథ ప్రతీకాత్మకమైనదేగాక, మంత్రాత్మకమైనదికూడా అన్న సత్యమే ఇక్కడ ప్రథమంగా వక్కాణించబడినది. ఈ ప్రతీకకు అర్థముతోపాటు దీని మంత్ర సాధన విధానము కూడా తెలుపబడినది. కథాభాగాలలో ఈ రెండింటిని సుస్పష్టము చేసే ప్రయత్నము జరిగినది. ఈక్రమంలో సురథుడు అనే మహారాజు మానవుని జీవాత్మకు ప్రతీక. ఆ రాజు ఆధిపత్యము సంపూర్ణమైన దేహరాజ్యము మరియు మనో రాజ్యముల మీద ఉంటుంది. జీవాత్మవద్ద పుణ్యసంపద ఉన్నంత వరకు అతని పాలన నిష్కంటకముగానే సాగుతుంది. కానీ పుణ్యాత్మకుడగు జీవాత్మతోపాటు కొంత పాపము, దుష్కృతము కూడా వెంటవస్తుంది. ఇదే వాని అంతఃకరణములో ప్రమాదమును కలిగిస్తుంది. దీని ప్రభావము వలన వాని చేతన యొక్క చైతన్యము శిధిలమౌతుంది. అప్పుడు అతనిమీద సాధనయొక్క శత్రువులు ఆక్రమణ చేస్తారు. ఈ తత్త్వమే మంత్రమయమైన లీలాకథ తరువాతి మంత్రములో తెలుపబడినది.

**తస్య పాలయతః సమ్యక్ ప్రజాః పుత్రానివౌరసాన్ ।**
**బభూవుః శత్రవో భూపాః కోలావిధ్వంసినస్తదా ॥ (1/1/5)**

ఆ కాలంలో రాజులు ప్రజలను తమ కన్నబిడ్డవలె పాలించే వారు. మహారాజు సురథుని యొక్క 'కోలా' నగరమును ధ్వంసం చేయు క్షత్రియరాజులు ఆయనకు శత్రువులుగా మారారు.

ఆదిశక్తి లీలాకథలోని ఈ కథ మంత్రములలో ఇతిహాస పురాణముల యొక్క అనేక సంకేతాలు అందించబడినవి. వీటితోపాటు ఇందులో ఎన్నో ఆధ్యాత్మిక రహస్యములు కూడా ఇమిడి ఉన్నాయి. ఈ రహస్యములను ఆ శక్తులను సాధన చేసే సాధకుడు తన సాధనాక్రమంలో సాక్షాత్కరింపజేసుకుంటాడు. ఈ విషయము చరిత్రపరంగా చూస్తే 'కోలా విధ్వంసి'. ఇది ఒక విశేషమైన క్షత్రియకులానికి సంబంధించిన సంకేతము. దక్షిణ భారతదేశములో కోలానగరము ప్రసిద్ధిచెందినది. ఈ నగరము ప్రాచీనకాలంలో ఒక రాజ్యమునకు రాజధాని. ఏ క్షత్రియులైతే ఈ నగరము మీద ఆక్రమణ చేసి దానిని ధ్వంసము గావించారో వారే కోలావిధ్వంసి అని పిలువబడ్డారు. ఈ సత్యమే కాకుండా శ్రీదుర్గాసప్తశతి యొక్క భాష్యకారులు ఈ మంత్రములలో గల 'కోలావిధ్వంసినః' అనే శబ్దమునకు పలు అర్థములను ఉటంకించారు. 1. కోల అనగా వరాహము. అనగా రాజు పందిని

**అనుమానం పెనుభూతం**

చంపి దాని మాంసమును తింటాడు. 2. 'కోలా' అను నగరము రాజా సురథుని రాజ్యమునకు రెండవ రాజధాని. దానిని ధ్వంసము గావించిన రాజు. 3. 'కోలా' ఒక ప్రత్యేకమైన ఆయుధము. దీని ద్వారా కోలావిధ్వంసినః అనే పదమునకు అర్థము కోలా అను శస్త్రముతో విధ్వంసము గావించిన రాజు అని తెలియవస్తుంది.

ఈ చిన్న చిన్న వివరణలేకాకుండా 'బ్రహ్మవైవర్త పురాణము' లోని ప్రకృతి ఖండమునందు దుర్గ ఉపాఖ్యానం ఉన్నది. ఇందులో మహారాజు సురథుడు కోలానగరిని ముట్టడించాడు అని వర్ణించబడి ఉన్నది. **కోలాం చ వేష్టయాభాస సురథస్య మహామతేః (62/3).** శ్రీదేవీభాగవత మహాపురాణములో కోలావిధ్వంసి అనే పర్వతనివాసులు అందరు మ్లేచ్ఛులు. **మ్లేచ్ఛాః పర్వత వాసినః ప్రాప్తః (5/32/79)** ఈవిధంగా భిన్నభిన్న అభిప్రాయములేకాక అమ్మ సంతానమైన శక్తి సాధకులకు తమ యొక్క ఆధ్యాత్మిక అనుభవము కూడా ఉన్నది. దీని ప్రకారంగా **కోలావిధ్వంసిః** అంటే జీవాత్మ యొక్క మొత్తము కులాన్ని పాడుచేసే శత్రువులు. జీవాత్మ యొక్క పూర్తి సాధనకు అనివార్యమైనవి సద్గుణములు. అవి వివేకము, వైరాగ్యము, తపస్సు, తితీక్ష, భక్తి మరియు ముముక్షత్వము. ఈ గుణములేకాక సాధకుని అంతఃకరణములో సాత్వికత నుండి ఉత్పన్నమైన అన్ని సద్గుణములు కూడా నిండి ఉంటాయి. ఈ సద్గుణములన్నీ కూడా నిజంగా జీవాత్మ యొక్క నిర్మలమైన వెలుగు యొక్క కిరణములు. వీటివల్లనే ఇది కాంతివంతమై ఉన్నది.

జీవాత్మ తన సామర్థ్యముతోనే తన ఆత్మరాజ్యమును, మనోరాజ్యమును, దేహరాజ్యమును సంచాలనము చేస్తుంది. ఒకవేళ ఏదో ఒక శక్తి ఈ సద్గుణములను ధ్వంసము చేస్తే ఆత్మ రాజ్యము ఛిన్నాభిన్నమైపోతుంది. ఇలా ఎందుకు జరుగుతుంది అనే కారణములను విశ్లేషిస్తే, వివేచన చేస్తే జీవాత్మకు తన సాత్వికత, పుణ్యము, సత్కర్మలు, సద్గుణములపట్ల అహంకారము పెరిగింది అన్న విషయము అర్థమవుతుంది. జీవాత్మయొక్క కులాన్ని శత్రువులు ఆక్రమణ చేయటానికి ఉపయోగపడే ఛిద్రము ఇదే. భ్రాంతితో పుట్టిన ఈ అహమే జీవాత్మ కులాన్ని, కోలానగరమును నాశనము గావిస్తుంది. ఈ వినాశనము నుండి బయటపడాలంటే కేవలము ఆదిశక్తి జగనాత్మ యొక్క కృప అవసరము. ఆమెకు శరణాగతి చేసుకుంటే ఈ కోలావిధ్వంసులను నశింపజేయుట సంభవమే.

భగవతిపట్ల విముఖుడైన జీవాత్మ తన ఆత్మకళ్యాణము నుండి విముఖుడౌతాడు. అతడు జన్మజన్మల వరకు పుణ్యము, పాపము, సత్కర్మ, దుష్కర్మల జంజాటములో చిక్కుకుని తిరుగుతూ ఉంటాడు. ఒకప్పుడు అతనికి తన సామర్థ్యము మీద గర్వముంటుంది. మరోప్పుడు సామర్థ్యము ఉండికూడా పరాజయముపాలగుట సంభవిస్తుంది. జీవాత్మకు ప్రతీకయైన సురథుని స్థితి ఇది. అతను నీతిగల ప్రజాపాలకుడు. ప్రజలను కన్నబిడ్డలవలె పాలించేవాడు. నీతివంతుడై, ధర్మపరాయణత కలిగి ప్రజలను కన్నబిడ్డలవలె పాలిస్తున్నా కూడా అతనిలో అహంకారము, అభిమానము ఉన్నాయి. అతడు పుణ్యాత్ముడైన అహంభావి. అదే అతని పరాభవానికి, పరాజయానికి, పతనానికి కారణమైనది. నీతివంతుడగుట, పుణ్యపురుషులగుట, నిరంతరం సత్కర్మలను చేయుట శుభప్రదము, శ్రేష్ఠము అనేది నిజమే, కానీ జగన్మాతపట్ల భక్తి లేకపోతే ఆ శ్రేష్ఠత నిశ్చయంగా కోలావిధ్వంసులను ఆహ్వానిస్తుంది. మహారాజైన సురథునికి పట్టిన గతే అందరికీ పడుతుంది. దీనినుండి బయటపడటానికి ఆదిశక్తి జగన్మాతను స్మరించాలి.

ఈ శ్లోకమంత్రములలో ఐతిహాసిక, పౌరాణిక, ఆధ్యాత్మిక సత్యముతోపాటు ఒక మంత్రపరమైన సత్యము కూడా ఉన్నది. దీనికి ప్రత్యేకమైన సాధనావిధానము కూడా ఉన్నది.

## సాధనా విధానము

**వినియోగః ఓం అస్య శ్రీ 'తస్య పాలయతః' ఇతి సప్తశతీ పంచమ మన్త్రస్య శ్రీబ్రహ్మఋషిః, శ్రీమహాలక్ష్మీదేవతా, హ్రీం బీజమ్, చూడామణి శక్తిః, లక్ష్మీమహావిద్యా, సత్త్వగుణః, నేత్ర జ్ఞానేన్ద్రియం, సౌమ్యరసః, కర కర్మేన్ద్రియం, మధ్యమ స్వరం, జల తత్త్వం, ప్రతిష్ఠా కళా, శ్రీం ఉత్కీలనం, మోహినీముద్రా, మమ జ్ఞాన భక్తి వైరాగ్య క్షేమస్థైర్యాయురారోగ్యభివృద్ధ్యర్థం శ్రీఆదిశక్తి మాతా గాయత్రీ రూపేణ యోగమాయా భగవతీ క్షమహాదుర్గా ప్రసాద సిద్ధ్యర్థం చ నమోయుత ప్రణవ-వాగ్బీజ-స్వబీజ-లోమ-విలోమ పుటితోక్త పంచమ మంత్ర జపే వినియోగః ॥**

## న్యాసః

| | కరన్యాసః | షడంగన్యాసః |
|---|---|---|
| ఓం ఐం హ్రీం | అంగుష్ఠాభ్యాం నమః | హృదయాయనమః |
| ఓం నమో నమః | తర్జనీభ్యాం నమః | శిరసే స్వాహా |
| తస్య పాలయతః | సమ్యక్ మధ్యమాభ్యాంనమః | శిఖాయైవషట్ |
| ప్రజాః పుత్రానివౌరసాన్ | అనామికాభ్యాంనమః | కవచాయహుమ్ |
| బభూవః శత్రవో భూపాః | కనిష్ఠికాభ్యాంనమః | నేత్రత్రయాయవౌషట్ |
| కోలావిధ్వంసినస్తదా | కర-తల కరపృష్ఠాభ్యాంనమః | అస్త్రాయఫట్ |

**భయం పురుగులాగా నిరంతరంగా మనస్సును తొలిచేస్తుంది**

## ధ్యానం

**కాన్త్యాకాఞ్చన సన్నిభం హిమగిరి ప్రఖ్యైశ్చతుర్భిర్గజైః ।**
**హస్తోత్క్షిప్త హిరణ్యామృత ఘటైరాసిచ్య మానాం శ్రియమ్ ॥**
**విభ్రాణాం వరమబ్జ యుగ్మమభయం హస్తైః కిరీటోజ్జ్వలామ్ ।**
**క్షౌమాబద్ధ నితమ్బ బిమ్బ వలితాం వన్దేఽ రవిన్ద స్థితామ్ ॥**

## మంత్రం

**ఓం ఐం హ్రీం నమః**
**తస్య పాలయతః సమ్యక్ ప్రజాః పుత్రానివౌరసాన్ ।**
**బభూవః శత్రవోభూపాః కోలావిధ్వంసినస్తదా ॥**
**నమో హ్రీం ఐం ఓం ॥ 5 ॥**

1000 జపాత్ సిద్ధిః దశాంశ పాయస హోమః ।

గాయత్రీ మహామంత్ర జప 10,000, గాయత్రీ విధానేన దశాంశ హోమః ॥

10 మాలలు గాయత్రి చేసి ఒక మాల సప్తశతీమంత్రం చేయాలి. ఈవిధంగా పదిరోజులు చేయవలెను. ఆ తరువాత దశాంశ హోమము, హవనము చేయాలి.

**దీనికి ఆధ్యాత్మిక ఫలశృతి:** ఆధ్యాత్మిక సాధనకు అడ్డువచ్చే అవరోధాల పట్ల జాగరూకత.

**లౌకిక ఫలితము:** రహస్య శత్రువులను గుర్తించుట.

గాయత్రీ సాధనా విధానముతో కలిసిన ఈ సప్తశతీమంత్రము తన విలక్షణమైన ప్రభావమును చూపిస్తుంది. దీని ప్రభావము వలన సాధకునిలో ఒక అద్భుతమైన జాగృతి కలిగి దోషములను, లోటుపాట్లను, ముఖ్యంగా సాధనలో వచ్చే అవరోధాలను గుర్తించేలా చేస్తుంది. ఆధ్యాత్మికదృష్టితో చూస్తే ఇదేమీ సామాన్యమైన లాభము కాదు, చాలా పెద్ద లాభము. ఎందుకంటే సాధకుడు సాధారణంగా తన సాధనా విధానాలను, సంపూర్ణ కర్మకాండను పూర్తి చేసికూడా దాని ఫలితము పొందకుండా వంచించబడతాడు, దీనికి కారణము సాధనను, సఫలతను సాధనయొక్క అవరోధక తత్త్వాలు నశింపజేస్తూ ఉంటాయి. ఈ కారణముగానే దీర్ఘకాలం వరకు చేసే సాధనలు కూడా సముచితమైన ఫలితాలను ఇవ్వక పోవడం కనిపిస్తుంది. సాధకులు తమ సాధనలోని అవరోధాలను గుర్తించి వాటిని తొలగించుకోలేక పోవడమే దీనికి కారణము. దుష్టులవలన, దుర్జనులవలన, చెడు సహవాసముల వలన జీవితంలో అపజయాలు అడ్డు ఆపు లేకుండా వస్తాయి. దీనివలన కలిగే లాభాలు మాత్రము పొంచి ఉన్న దుర్జనుల చేత చిక్కి నశించి పోతుంటాయి. వీటిని గనుక గుర్తించగలిగితే ఒక నూతన జీవన విధానము వికసింపజేసుకొన వచ్చును. దాని ఫలితము శుభకరంగా, సౌభాగ్యవంతంగా ఉంటుంది. అందుచేత జగన్మాత ప్రియ సంతానము నిష్కామ భావనతోనే తమ సంపూర్ణసాధనను చేయవలసి ఉంటుంది.

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 2009*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

## శ్రీ గాయత్రీ శతకం

**81.** ***మత్స్య, కూర్మ, వరాహక మాది గల్గి***
***ముద్ర లిరువది నాలుగు ముదము మించ***
***స్మరణ జేసెడు భక్తాళి కెరుకయగును***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:– గాయత్రి వర్ణక్రమాన్ని అనుసరించి 24 ముద్రలు గలవు. అవి: సుముఖం, సంపుటం, వితతం, విస్తృతం, ద్విముఖం, త్రిముఖం, చతుర్ముఖం, పంచముఖం, షణ్ముఖం, అధోముఖం, వ్యాపకాంజలి, శకటం, యమపాశం, గ్రంథితం, సుముఖోన్ముఖం, ప్రబలం, ముష్టికం, మత్స్యం, కూర్మం, వరాహకం, సింహాక్రాంతం, మహాక్రాంతం, ముద్గరం, పల్లవం. ఇట్టి మంత్రమును స్మరించు భక్తులకు ఆ యమ్మ సంపూర్ణంగా అవగతమవుతుంది.*

**82.** ***ధృతి, అనుష్టుపు, త్రిష్టుపు, బృహతి వంటి***
***నాదఛందస్సు లిరువది నాల్గు గలిగి***
***మనన మొనరించు కవులకు ఘనత నొసగు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:– గాయత్రి 24 అక్షరాలలో 24 ఛందస్సులున్నాయి. అవి : గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతి, పంక్తి, త్రిష్టుప్, జగతి, అతిజగతి, శక్వరి, అతిశక్వరి, ధృతి, అతిధృతి, విరాట్, ప్రస్తారపంక్తి, కృతి, ప్రకృతి, ఆకృతి, వికృతి, సంకృతి, అక్షరపంక్తి, భూః, భువః, స్వః, జ్యోతిష్మతి. ఇట్టి మంత్రమును నిత్యం జపిస్తే కవులకు, కవయిత్రులకు సాహిత్య సభలలో గౌరవాన్ని పెంచుతుంది.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**బాధ, కోపం, ఈర్ష్య, అసూయ మన శక్తిని లాగేస్తాయి**

# అసలైన సంపద

ఆత్మను దివ్య గుణములతో నింపడమే అసలైన సంపదకు మార్గము. ఇది నిజమని నమ్మండి. హృదయాంతరాళములలో ఉన్న సత్సంకల్పాలని వదిలేసి బయట ఎక్కడో సుఖం దొరుకుతుందనుకోవడం భ్రమే. ఈ భ్రమతోటే బాహ్య ప్రపంచంలో సుఖం దొరుకుతుందని వెంపర్లాడుతుంటాం. పనిపాటలు లేని వ్యక్తి, దురాగతుడు కూడా అనాయాసంగా ధనవంతుడు అవవచ్చు. నిజానికి వారు అసలైన ధనవంతులు కానే కాదు. కానీ వారు నీ కంటే ఎక్కువ దారిద్ర్యాన్ని అనుభవిస్తుంటారు. వారి ధనం నిష్ఫలం, వ్యర్థం, ఎందుకు కొరగానిది, చివరికి ఆ ధనమే అతనికి దుఃఖాన్ని కూడా తెచ్చి పెడుతుంది. దుర్గుణాలు కలిగిన ధనవంతుడు కేవలం ఒక భిక్షకుడే. మరణించేవరకు ధనవంతుడుగా ఉన్న వ్యక్తిని భాగ్యవంతుడు అంటుంది లోకం, కానీ మా ఉద్దేశ్యంలో అతడు అభాగ్యుడే ఎందుకంటే తరువాత జన్మలో తన పాపఫలాన్ని స్వయంగా అనుభవించవలసినదే. ఎందుకంటే ధనాన్ని తనతోపాటు తీసుకుపోలేడు, ధనాన్ని అనుభవించలేడు. బాహ్య ప్రపంచంలో ఓ వ్యక్తి ఎంత నిరుపేద జీవితం గడుపుతున్నప్పటికి, హృదయంలో సదా మంచి ఆలోచనలు ఉంటాయో వాడే అందరికంటే గొప్ప ధనవంతుడు. సద్గుణవంతులు ఎల్లప్పుడూ సుఖంగానే ఉంటారు. ఇది నిశ్చయం. సమృద్ధి వారి ఇంట ఎల్లప్పుడూ తలుపు తెరచి ఉంటుంది. **శాశ్వతమైన సంపద కావాలని కోరుకుంటే ధర్మాత్మునిగా ఉండటం అలవాటు చేసుకో.** సదాచారమే నిజమైన సంపద. ధన వ్యామోహంలోపడి దుష్కర్మలు చేస్తూ అధిక ధనాన్ని సంపాదించారా జాగ్రత్త! లోభిగా మారిపోగలవు. చివరికి నీకు మట్టే మిగిలేది.

ఎడిసన్ ఓ చోట ఇలా రాశాడు "మనుష్యజాతిపై దేవతలు వరాలు కురిపించాలనుకుంటే తుఫాన్‌ల్లాంటి దుర్ఘటనలు ఉత్పన్నం చేస్తారు. దానిలో మనుష్యుల్లో దాగుకున్న రోషాలు, పౌరుషాలు వికాసం కొరకు తోడ్పడతాయి. కొన్ని వేల సమ్మెట దెబ్బలు తిన్న తరువాతే ఓ శిల సుందరమైన ఆకృతిని పొందుతుంది. ఎకమండవర్క్ అంటారు "బలమైన వస్తాదు అంటే ఎవరో తెలుసా తన శిష్యులను బలిష్టమైన పహిల్వానులుగా చేయడానికి వారితో తానే తలపడతాడు, మరో పహిల్వానును పడగొట్టడానికి కావలసిన బలాన్ని పెంపొందించటానికి తన శిష్యుల శరీరాలను గాయపరుస్తాడు" జాన్ బాంధన్ భగవంతుడిని ఈ విధంగా ప్రార్థించేవాడు "హే ప్రభూ! నాకు ఎక్కువ ఆపదలను కలిగించు, నేను ఎక్కువ సుఖంగా ఉండగలుగుతాను"

వృక్షం బండరాళ్ళ మధ్యలోంచి, భూభాగంలోంచి చొచ్చుకుని వచ్చి, తన జీవన మనుగడ కోసం, ఎండ, వాన, చలి, అంధకారం నుంచి కూడా భయపడక మొక్కవోని ధైర్యంతో ఉంటుంది. ఆ వృక్షమే ఎక్కువ కాలం తన మనుగడ సాగించగలుగుతుంది, బ్రతకగలుగుతుంది. కఠినమైన పరిస్థితులు ఎవరైతే ఎదుర్కొనరో, వారి జీవితంలో మహత్వపూర్ణమైన విషయాలు, ఏమీ ఉండవు. ఒక తత్వజ్ఞాని అంటుండేవారు "మహా పురుషులు దుఃఖాల కడలిలో తేలియాడుతుంటారు. విపత్తుల ఒడిలో నివసిస్తుంటారు. సమస్యల అగ్ని మనలను స్టీలుకన్నా గట్టిగా బలంగా ఉండేట్లు చేస్తాయి." ఒకసారి ఓ విద్యార్థి ఉపాధ్యాయుడిని ప్రశ్నించాడు "నేను ఎప్పటికైనా గొప్ప చిత్రకారుడిని కాలేనా?" దానికి ఉపాధ్యాయుడు "కాలేవు" అన్నాడు. దానికి అతడు విస్తుబోయి "ఎందుకు?" అని ప్రశ్నించాడు. దానికి ఉపాధ్యాయుడు ఇలా జవాబిచ్చాడు" ఎందుకంటే పిత్రార్జిత ధనముతో నెలకు ఒక వెయ్యి రూపాయల ఆదాయం వచ్చి కూర్చుంటుంది". ధన సంపాదన జిలుగు వెలుగుల్లో పడి మనిషి తన యొక్క కర్తవ్యం వీడి, దారి త్రప్పి, ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. లోహాన్ని మాటిమాటికి వేడిచేసి దానిని ఖరీదైన ఆయుధంగా తయారుచేస్తారు. రాయి మీద బలంగా అనేకమార్లు రుద్దడం వల్లనే కత్తి పదునెక్కుతుంది. రాయిని రాపిడికి గురిచెయ్యయకపోతే, అందులో అంతర్లీనంగా సూక్ష్మరూపంలో ఉన్న అగ్ని సుషుప్త అవస్థలోనే పడిఉంటుంది కదా! పరమాత్మ మనిషికి ఎన్నో అమూల్యమైనవి ఇచ్చాడు. వీటిలో అన్నింటికంటే ఉత్కృష్టమైనవి పేదరికం, కష్టాలు, నష్టాలు, ఆపదలు, అసౌకర్యాలు. కానీ వీటి ద్వారానే తనలోని సర్వోత్తమైన గుణాలను పెంపొందించడానికి ఆస్కారం లభిస్తుంది. ప్రతి వ్యక్తి యొక్క పనులను పరమేశ్వరుడు సులభతరం చేసుకుంటూపోతే, మనిషి ఎందుకు పనికిరానివాడై ఏనాడో మట్టిలో కలిసిపోయి ఉండే వాడేమో.

మీరు మోసం చేసి లక్షల కొద్దీ డబ్బు కూడబెడితే, ఏదో గొప్ప పని చేసినట్లా? దీనులు, దుఃఖితుల రక్త మాంసాలు పీల్చి, తమ పొట్ట నింపుకుంటే, గొప్పగా సిద్ధించినట్లా? మీరు

**అనుమానం హానికారకం**

ధనవంతులు అయ్యే క్రమంలో ఎదుటి వ్యక్తి దరిద్రుడయిపోతుంటే మీ వ్యాపారం వల్ల ఎదుటి వారి జీవనం పతనమైపోతుంటే, అనేకుల సుఖ–శాంతులకు నష్టం వాటిల్లుతుంటే అటువంటి వ్యక్తి పట్ల ప్రకృతికి తిరస్కారమే, అది గుర్తుంచుకోండి. మీరు కూడబెట్టిన డబ్బు ఎలా సంపాదించారు? ఎలా ఖర్చు పెట్టారు? ఏదోనాటికి ఆ కర్మ మిమ్మల్ని న్యాయ దేవత ముందు నుంచో పెడుతుంది. అప్పుడు మీరు చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెందుతారు. అప్పుడు తెలుసుకుంటారు చేసింది తప్పని, ఒకటి చెయ్యబోయి మరోటి చేశామని.

ధనము లేకుండా ఎవరైనా ఐశ్వర్యవంతుడవుతాడంటే మీకు ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ ఇది నగ్న సత్యం. ప్రపంచంలో అనేకమంది ఉన్నారు జేబుల్లో ఒక్క పైసా లేనివారు, అసలు జేబేలేనివారు, కానీ వారు ధనవంతులే. ఎలాంటి గొప్పవారో తెలుసా? వారితో మరొకరిని పోల్చలేనేము, వారికి సరి సమానులు లేరు. **ఎవరు ఆరోగ్యంగా ఉంటారో, ఎవరి హృదయము కరుణ కలిగి ఉంటుందో, ఎవరు ఉదార స్వభావులో, ఎవరి మనస్సు పవిత్రంగా ఉంటుందో, యదార్థానికి వారే ధనవంతులు.** స్వస్థత కలిగిన శరీరం ఎంతో విలువైనది, ఉదార హృదయం బంగారం కంటే అమూల్యమైనది, పవిత్ర మనస్సు ఎన్నో రత్నాలకంటే అధికమైనది. లార్డ్ కాలింగ్‌వుడ్ అనేవారు "ఎవరైనా ఇతరుల ధనం మీద పడి చావని, నేను మాత్రం డబ్బు లేని ధనవంతుడిని, ఎందుకంటే సంపాదించింది నిజాయితీగా సంపాదిస్తాను". సిసిరో అంటారు "నా వద్ద నిజాయితీగా సంపాదించిన కొద్ది డబ్బే ఉంది, కానీ అది కోటీశ్వరుడుకంటే అధికమైన ఆనందాన్ని ఇస్తుంది"

దధీచి, వశిష్ఠుడు, వ్యాసుడు, వాల్మీకి, తులసీదాస్, సూరదాస్, రామదాస్, కబీర్‌లాంటి వారు డబ్బులేకనే ధనికులు, వారికి మనుష్యుని అవసరాలన్నీ ఆహారం నోటిద్వారా మాత్రమే పోవని, జీవితాన్ని ఆనందమయం చేయడానికి ఉపకరించే ఉపకరణాలు డబ్బుపెట్టి కొనుక్కోలేమని తెలుసు. పరమేశ్వరుడు జీవితపు పుస్తకంలో ఎక్కడో ఓ పేజీలో అమూల్యమైన రహస్యాలని దాచి ఉంచాడు. కోరుకుంటే వాటిని వెదికి పట్టుకొని మన జీవితాన్ని పూర్ణమయం చేసుకోవచ్చు. విశాల హృదయం, ఉన్నతమైన ఆత్మ కలిగిన వ్యక్తి పూరి గుడిసెలో ఉన్నా కూడా, రత్నాలకంటే ఎక్కువ ప్రకాశించగలుగుతాడు. సదాచారునికి, పరోపకారికి డబ్బు లేకపోయినా కూడా వారు ధనవంతులే. నీవు వినయశీలివి, ప్రేమమయుడివి, నిస్వార్థివి, పవిత్రుడివి అయితే, మీరు అత్యంత ధనవంతులే అని నమ్మండి.

ధనం లేకుంటే వాడిని పేదవాడుగా చిత్రీకరిస్తారు, కానీ ఎవడి వద్ద కేవలం ధనం మాత్రమే ఉంటుందో వాడు అందరికంటే దుర్మార్గుడు. సద్బుద్ధి, సద్గుణాలను సంపద అని మీరు భావించరా? అష్టావక్రుడును చూడండి శరీరం అంతా వికృతంగా ఉన్నా, అతి పేదవాడు. కానీ జనక మహారాజు సభలోనికి ప్రవేశించి, తనను పరిచయం చేసుకోగానే, జనకుడు అష్టావక్రునికి శిష్యుడయ్యాడు. ద్రోణాచార్యుడు, కౌరవ రాజదర్బారులో ప్రవేశించినప్పుడు వారి ఒంటిమీద సరైన వస్త్రాలే లేవు. కానీ వారిలోని గుణగణాలు రాజకుమారులను తమ శిష్యులుగా చేసుకునేట్లు చేశాయి.

గురు గోవింద సింగ్, వీర హరేకత్ రామ్, ఛత్రపతి శివాజీ, రాణా ప్రతాప్ మొదలైనవారు డబ్బుకోసం తమ జీవితాన్ని పణంగా పెట్టలేదు. మహాత్ముడైన గోఖలే గారిని ఓ సంపన్న కుటుంబానికి చెందిన వ్యక్తి "మీరు ఇంత రాజనీతిజ్ఞులై ఉండి కూడా ఇంత పేద జీవితాన్ని ఎందుకు గడుపుతున్నారు?" అని ప్రశ్నించాడు. దానికి ఆయన సమాధానమిస్తూ" నాకు ఇదే ఎక్కువ, డబ్బు కూడబెట్టాలనే తపనలో మహత్వమైన జీవితాన్ని వ్యర్థపరచడం నాకు తెలివిగలది, సరియైనదని అనిపించలేదు" అని అన్నారు.

ఫ్రాంక్లిన్‌ను ఓసారి డబ్బున్న మిత్రుడు ప్రశ్నించాడు, "నా వద్ద ఉన్న ఈ డబ్బంతా ఎక్కడ దాచిపెట్టాలి?" దానికి ఆయన నవ్వుతూ అన్నాడు, "నీవు నీ ధనసంచుల్ని తల లోపల దాచి పెట్టుకో ఎవరూ దొంగిలించలేరు".

తత్వజ్ఞులు ఏమంటున్నారో చూడండి, "ఐశ్వర్య ప్రేమికులారా! మీలోని తుచ్ఛమైన స్వార్థాన్ని చినిగి, పనికిరాని చొక్కాని విసిరేసినట్లు విప్పి పారేయండి, ప్రేమ, పవిత్రతను ధారణ చేయండి. రోదన, భయం, నిరాశ వదిలెయ్యండి. అనంతమైన సంపద మీలో ఉన్నది. ధనవంతుడు అవ్వాలంటే దాని కోసం బయట ఎక్కడో వెతక్కండి, లోపల శోధించండి. ద్వేషం, క్రోధం, దురాచారం, అసూయలాంటి వాటిని వశంలో ఉంచుకోండి. ప్రేమ, పవిత్రత, సజ్జనత్వం, నమ్రత, దయ, ధైర్యం, ప్రసన్నతలో మనస్సును నింపండి. అంతే దారిద్ర్యము మీ హృదయ ద్వారం నుండి తన్నుకొని బయటకెళ్ళిపోతుంది. నిర్బలత్వం, దీనత్వం కనిపించనే కనిపించదు. దానిలో అనిర్వచనీయమైన సార్వజనీన శక్తి ఆవిర్భవిస్తుంది అది ఎంతోదూరం వరకు ప్రకాశిస్తుంది.

*– అఖండజ్యోతి, మార్చి 1941*

*అనువాదం: ఎమ్.ఎస్.ఎస్. గుప్త*

**జరిగేదాన్ని ఎలాగు ఆపలేనప్పుడు ఇక టెన్షన్ ఎందుకు?**



మనం - మన ఆరోగ్యం

# స్నానం, ఈతకొట్టే కళ



చక్కటి ఆరోగ్యమే అన్ని సుఖాలకు మూలం. వాతాది దోషాలు, రసాది ధాతువులు, మలక్రియ సక్రమంగా ఉండి, ప్రసన్నమైన ఆత్మ, మనస్సు కలిగిన మనిషే ఆరోగ్యంగా ఉన్నట్టు. అయితే ఆరోగ్యం, రూప లావణ్యం అనేవి ఎలా వస్తాయి , ఎలా నిలుస్తాయి అనేది తెలుసుకోవాలి. పైపైన వాడే వస్తువులతో ఇది సాధ్యమా అంటే మందులు, సబ్బులు, క్రీములు, పౌడర్లు, ఫాషన్ హేయిర్ స్టయిలు, డిజైనర్ బట్టలు, సూటు, టై, ఉంగరాలు, బంగారము, గడియారాలు, కళ్ళద్దాలు, పిన్నులు మొదలైన రూప లావణ్యం పెంచే వస్తువులతో ఆరోగ్యంకాని, అందంకాని వస్తుందా? వచ్చినా నిలుస్తుందా? నిలవదు. ప్రాకృతిక జీవితం గడిపితేనే అవి నిలుస్తాయి. నిత్య వ్యాయామం, శుభ్రత అన్నింటి కన్నా ముఖ్యం. పరిశుద్ధమైన, స్వచ్ఛమైన, తాజా, సాదా, రసయుక్తమైన, తేలికైన, రుచికరమైన భోజనమే చెయ్యాలి. వీలైనంతగా ఆకుపచ్చని కూరలు వాడాలి. **"ఎవరు ఎటువంటి ఆహారాన్ని తింటే, వారు అలాగే మారతారు"** అని పెద్ద పెద్ద విద్వాంసులు చెప్తారు. ప్రతి ముద్దని చక్కగా నమిలి తినాలి. పళ్ళు ఎక్కువగా తినడం చాలా మంచిది. పాలకన్నా పళ్ళు సంతానోత్పత్తికి ఎక్కువ తోడ్పడతాయి. రోజుకు రెండు సార్లు భోంచేయాలి. పొద్దున 10 నుండి 12 లోపల, మళ్ళీ రాత్రి ఎనిమిది లోపల పూర్తి చేసుకోవాలి. పడుకునే ముందు వీలైతే గోరువెచ్చని పాలు తాగాలి. **నిలువ ఉంచిన పదార్థాల వల్ల బుద్ధి, తేజస్సు, ఆయువు తరిగి పోతాయి.** ఎప్పుడూ ప్రశాంతంగా, రుచికరమైన భోజనాన్నే చేయాలి. **తినే ఆహారం నుండి జీవనశక్తిని పొందుతున్నామనే భావనతో తినాలి.** తినేటప్పుడు ఎక్కువ నీళ్ళు త్రాగకూడదు. ఒక అరగంట ఆగాక త్రాగాలి. తిన్న వెంటనే 150 అడుగులైనా వెయ్యాలి. ఆ తరువాత ముందు కుడివైపుకి, ఆ తరువాత ఎడమవైపుకి తిరిగి పడుకుని విశ్రాంతి తీసుకోవాలి.

ఎక్కువ మొత్తంలో నీళ్ళు తాగాలి. ప్రవహించే నీరు ఉత్తమమైనది, బావి నీళ్ళు కూడా మంచివే. కాకపోతే వాటికి తగినంత సూర్యరశ్మి, గాలి తాకుతూ ఉండాలి. తగినంత సూర్య రశ్మి శరీరానికి కూడా అందాలి. పొద్దుటి ఎండవల్ల బలం, సంతానోత్పత్తి వృద్ధి చెందుతాయి. ఆరోగ్యం ఎలాగూ వస్తుంది, రూపలావణ్యం కూడా వస్తుంది, నిలుస్తుంది. ప్రకృతిని సేవించే మనిషికి ఆరోగ్యం, రూపలావణ్యం దాసోహమంటాయి. నిత్యం కనీసం అరగంట సేపు ఉదయం సూర్యరశ్మిని ఆస్వాదించాలి.

ఏ కాలానికి ఆ కాలం, వర్షా కాలంలో వర్షాన్ని, చలికాలంలో చలిని, ఎండాకాలంలో ఎండని తగినంతగా ఆస్వాదించాలి. ప్రకృతిని సేవించేవారు, పరిస్థితులను బట్టి, సమయానుకూలంగా, నియమపూర్వకంగా పనులు చేస్తారు. తెల్లవారుఝామున నాలుగు గంటలకు లేచి నిత్యకృత్యాలు పూర్తి చేసుకుని, రెండు మైళ్ళు స్వచ్ఛమైన గాలి పీలుస్తూ నడవాలి. తరువాత వదులైన వస్తువులు ధరించి వ్యాయామం చేయాలి. ఇలా చేయడం వల్ల అవయవ సౌష్టవం పెరుగుతుంది.

**ఆరోగ్యానికి వ్యాయామం అమృతంలాంటిది.** వ్యాయామం చేసేటప్పుడు గాలి ముక్కుతోనే పీల్చాలి, నోటితో వదలవచ్చు. వ్యాయామం అయిపోయిన వెంటనే కూర్చుండిపోవడం లేదా నీళ్ళు త్రాగడం చాలా హానికరం. నోరు ఎండిపోతే పుక్కిలించుకోవాలి లేదా పటికబెల్లం చప్పరించాలి. వెంటనే స్నానం చేయడం కూడా హానికరం. వేడి శరీరాన్ని ఉన్నట్టుండి చల్లబరచడం కూడా హానికరం. ఒక అరగంట అయ్యాక స్నానం చేయాలి.

స్నానం చేసేటప్పుడు సబ్బుకు బదులుగా మెత్తని మట్టితో బాగా రుద్ది 10,15 నిమిషాలు అలాగే వదిలేసి తర్వాత స్నానం చేయడం వల్ల చర్మ రంధ్రాల్లో పేరుకున్న మాలిన్యం పూర్తిగా పోతుంది. చర్మ రంధ్రాలు తెరుచుకుని శుభ్రంగా ఉండడం చాలా అవసరం.

ఒకసారి దసరా పండగకి పులి వేషం వేసుకుని ఒక మనిషి వంటినిండా పసుపు రంగు పూసుకున్నాడు. రోజంతా బాగా ఆడి, పాడి రాత్రికి అలిసిపోయి అలాగే పడుకుండిపోయాడు. మర్నాడు ఎంత పొద్దెక్కినా బయటకు రాకపోయేసరికి చుట్టుపక్కల వారు తలుపులు విరగ్గొట్టి చూస్తే అతను అపస్మారక స్థితిలో ఉన్నట్టు అనిపించింది. డాక్టరును పిలిపించి చూపిస్తే ఆయన హడావిడిగా టర్పెంటైను, నూనె వగైరా తెప్పించి వంటి మీద రంగంతా తీయించి శుభ్రంగా కడిగిన చాలాసేపటికి గాని మామూలు మనిషి కాలేకపోయాడు. దీన్ని బట్టి మనం అర్థం చేసుకోవలసింది శరీరానికి ఊపిరి ముక్కుతో మాత్రమే కాదు చర్మ రంధ్రాల నుండి కూడా అందుతుంది. అవి మూసుకుపోయిన పక్షంలో ప్రాణం

పనిలేని వాళ్ళకే అనుమానాలు ఎక్కువ

నిలవడం కష్టం. శారీరిక శుభ్రతను ఎప్పటికి నిర్లక్ష్యం చేయకూడదు. బాగా రుద్దుకుని స్నానం చేయడం వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుని లోపలి మాలిన్యాలు చమట ద్వారా తొలిగి పోవడానికి వీలవుతుంది. బాగా రుద్దుకుని స్నానం చేయడం ద్వారా మనిషి సహజంగానే నిర్వికారి, బ్రహ్మచారి, దీర్ఘజీవి కాగలడు. మాలిన్యాల వల్ల రోగి, బద్ధకస్తుడు, విషయభోగి, అల్పాయువు అవుతాడు. స్నానానికి ఉదయమే సరైన సమయం. చలి కాలంలో 5-10 నిమిషాలు స్నానం చేయాలి, అదే ఎండా కాలంలో అరగంట సేపైనా చేయాలి.

బావి నీరు ఏ కాలంలోనైనా స్నానానికి శ్రేష్టమైనదే. గాలి, వెలుతురు బాగా తగిలే పారుతున్న నీరు, చెరువు నీరు కూడా చాలా మంచిది. ఏదో ఒక చెంబుడు పోసుకోకుండా సరిపడా నీళ్ళతో స్నానం చేయాలి. తల మీద చల్లటి, స్వచ్ఛమైన నీరు పోసుకున్నాక మృదువైన ముతక బట్టతో తుడుచుకుంటే దురదలు రావు. ఈ విధంగా ప్రతిరోజు చేయడం వల్ల మనిషి ఆనందంగా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా, ఉత్సాహంగా, కాంతివంతంగా మారతాడు. నిత్యం అభ్యసించడం వల్ల ఆరోగ్యం, రూప లావణ్యంగా కచ్చితంగా లభిస్తుంది, నిలుస్తుంది. జపనీయులు ఈ విధమైన స్నానానికి చాలా ప్రాముఖ్యతనిస్తారు, అందుకే వారు పరిశ్రమశీలురు, తేజస్వులు, దీర్ఘజీవులుగా ఉంటారు.

**స్నానానికి సాధారణ నియమాలు :**

1. దేశ, కాల పరిస్థితులను బట్టి నిత్యం రెండు పూటలా స్నానం చేయాలి. అలా చేయలేని పక్షంలో పొద్దున్నే కొంతసేపు ఈదాలి, తర్వాత స్నానం చేయాలి. రెండో పూట తడి తువ్వాలతో వొళ్ళంతా గట్టిగా రుద్దుకోవాలి. రోజంతటా పేరుకున్న చెమట పోయి, చక్కటి నిద్ర పడుతుంది, తిన్నది అరుగుతుంది.
2. రోజు వేడి నీటితో స్నానం చేయడం అప్రాకృతికమైనది. అలా చేయడం వల్ల శరీరం బలహీనంగా, నాజూకుగా, భోగాసక్తంగా మారుతుంది. బ్రహ్మచర్యానికి ఇది హానికరం.
3. శాస్త్రాల్లో సముద్ర స్నానానికి కూడా మహత్తునిచ్చారు. దానికి కారణం సముద్రంలో ప్రవహించే ఒక రకమైన విద్యుత్ ప్రవాహం వల్ల శరీరానికి ఆరోగ్యం చేకూరుతుంది. వీలైతే ఇంట్లోని నీటిలో సముద్రపు ఉప్పు కలుపుకుని స్నానం చేయాలి. ఆ తరువాత స్వచ్ఛమైన నీటితో స్నానం చేయాలి. ఇది చాలా లాభదాయకం.
4. తిన్న వెంటనే స్నానం చేయడం, స్నానం చేసిన వెంటనే తినడం రెండూ హానికరం. అలా చేయడం వల్ల తిన్నది అరగక పిత్త రోగాలు వస్తాయి.
5. రోగులు, బలహీనులు, సున్నితమైన వాళ్ళు కనీసం తడి తువ్వాలతోనైనా బాగా రుద్దుకోవాలి. మెల్లి మెల్లిగా చన్నీటి స్నానం అలవాటు చేసుకోవాలి.
6. శరీరంలో మడతపడే స్థానాల్లో, గుప్త స్థానాల్లో బాగా రుద్దుకుని స్నానం చేయడం వల్ల అక్కడ చెమట తొలిగిపోతుంది.
7. స్నానం చేసేటప్పుడు చలేసినా, రోమాలు నిక్కపొడుచుకున్నా వెంటనే ఆపేసి పొడి తువ్వాలతో తుడుచుకోవాలి. లేకపోతే జలుబు, జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది.
8. గాలి వెలుతురు ఉన్న, సూర్యకిరణాలు అందేట్టుగా ఉన్న ఏకాంతమైన స్థలంలో స్నానం చేయాలి.
9. స్నానం చేసేటప్పుడు వీలైనన్ని తక్కువ బట్టలతో చేయాలి. భారతీయులు గోచీ కట్టుకుని స్నానం చేసేవారు. వీర్య పాతమైన కొంత సేపటిలోనే స్నానం తప్పని సరిగా చేయాలి.
10. వ్యాయామం చేసిన వెంటనే స్నానం చేయకూడదు. అరగంట సేపైనా ఆగాలి.

ఐదు నిమిషాలైనా సరే సూర్యోదయానికంటే ముందు ఈత కొట్టే అలవాటు చాలా మంచిది. శరీరం శుభ్రపడడంతో పాటు అన్ని అవయవాలకు చక్కటి వ్యాయామం అందుతుంది. ఛాతి వెడల్పవుతుంది, ఊపిరి తిత్తులు బలపడతాయి. శరీరం మొత్తం ఆరోగ్యంగా, పుష్టిగా, ఉత్సాహంగా, శక్తివంతంగా మారుతుంది. చల్లటి నీళ్ళు మెల్లి మెల్లిగా తగలడం వల్ల మెదడు కూడా చల్లగా, నిర్వికారంగా మారుతుంది. ముఖవర్చస్సు రెట్టింపవుతుంది. కనీసం ఆరోగ్యం కోసమైనా సరే ప్రతివ్యక్తి, గొప్పపేద తేడా లేకుండా తప్పకుండా ఈత నేర్చుకోవాలి. ఎవరైనా మునిగి పోతున్నా రక్షించవచ్చు. ఒక్కసారి ఊహించుకోండి, మునిగి పోతున్న ఒక్క ప్రాణిని రక్షించినా ఎంతో మనశ్శాంతి, ఆత్మ తృప్తి కలుగుతుంది.

నలుగురైదుగురు విద్యార్థులు కలిసి ఈత నేర్చుకుంటే ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. అధ్యాపకులు స్వయంగా ఈత యొక్క ఉపయోగాన్ని వివరించి, పిల్లలను ప్రోత్సహించాలి.

*- అఖండజ్యోతి, నవంబర్ 1940*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**మనం భయపడే అనేక కష్టాలు అసలు రావు**

# మీ స్వర్గాన్ని మీరే తయారు చేసుకోండి

స్వర్గాన్ని పొందాలనే కోరిక ప్రతివారికి ఉంటుంది. కొందరు స్వర్గం ఈ ప్రపంచం నుండి వేరుగా ఉందని భావిస్తారు, మరణించిన తరువాత అక్కడకు వెళ్తారని లేక వెళ్ళగలమని విశ్వసిస్తారు. ఈ విశ్వాసం ఆధారంగా మనుష్యులు జపం, తపం, పూజలు, పునస్కారాలు, పుణ్యం, పరమార్థం, సాధన, ఉపాసన కూడా చేస్తారు. ఈ పృథ్వికన్నా వేరే లోకంలో స్వర్గం వంటిది ఉన్నదో లేదో అనేది ఒక వివాదస్పద విషయం. కాని దానిని ప్రాప్తించుకునేందుకు ఇచ్ఛ, మనిషి ముందుకు వెళ్ళాలనే ఆకాంక్షను తెలియచేస్తుంది. దీనిని అనుచితం అని చెప్పజాలము.

మనిషికి ఈ రకమైన ఇచ్ఛ స్వాభావికమే. ఉన్నచోట నుండి ముందుకు వెళ్ళడమే అతనికి కావలసినది. అతని దగ్గరలేని వస్తువులను పొందాలనుకుంటాడు. మనిషి జన్మ ఎత్తిన ఈ ప్రపంచంలో సుఖం ఉన్నది, దుఃఖం ఉన్నది, అనుకూలతలు ఉన్నాయి, ప్రతికూలతలు ఉన్నాయి. కాని ప్రతి మనిషి దుఃఖముల నుండి, కష్టముల నుండి, ప్రతికూలతల నుండి దూరంగా ఉండాలనుకుంటాడు. అతను వీలయినంత ఎక్కువ సుఖంగా, సంతుష్టిగా, అన్ని రకముల వసతులతో హాయిగా ఉండాలని భావిస్తుంటాడు. ఈ స్థితి బ్రతికుండగానే లభిస్తుందో, లేక మరణించిన తరువాత లభిస్తుందో అనేది వేరే విషయం.

కాని అస్తికులు, విశ్వసించేవారి నుండి బుద్ధ జీవులు (intellectuals), నాస్తికులు, శ్రద్ధ లేని మామూలు మనుష్యులు అందరు కూడా సుఖంగా, హాయిగా, ఎక్కువ వనరులతో సంపన్న జీవనం గడపాలనే ఆకాంక్ష ఉంటుంది.

ప్రతి మనిషికి తమ ప్రకృతికి అనుసారం లభించిన స్థితి నుండి ఇప్పటి వరకు లభించని వాటిని పొందటానికి ఆకాంక్ష ఉంటుంది. ఆ ఆకాంక్షను తీర్చుకోవడానికి చేసే ప్రయత్నాలకు, పురుషార్థాలకు తగిన ఫలితం లభిస్తుంది, సంతోషం కలుగుతుంది. స్వర్గాన్ని పొందటం కొరకు జపం, తపం, పూజలు, పారాయణలు చేసేవారు దానిని ఈ పృథ్విపైనే ప్రాప్తించుకుంటారు.

వాస్తవంగా వేరే ఏదో లోకంలో స్వర్గంవంటి స్థానం ఉంటే దానిని పొందటానికి ఈ జీవితంలో పాత్రత పొందాలి. స్వర్గం అంటే ఆనందం, అంతా ప్రేమమయంగా ఊహించుకోవచ్చు. ఈ ప్రపంచంలోని అన్ని ధర్మ గ్రంథాలలో స్వర్గం యొక్క వర్ణన వస్తుంది. ఈ మతముల మధ్య ఎన్నో భేదాభిప్రాయాలున్నప్పటికి స్వర్గం గురించి చెప్పినప్పుడు అది చాలా ఆనందాయకమనే చెప్పబడింది. స్వర్గంలో మనిషికి కష్టము, బాధ, దుఃఖం ఉండనే ఉండవు. అటువంటి ఆనందదాయకమైన స్వర్గమును ఈ జీవితములోనే తయారుచేసుకోవచ్చు. తన మనఃస్థితిని పరిస్థితులకు అనుకూలంగా మార్చుకున్నట్లయితే, దానిపై ప్రతికూలతల ప్రభావం పడకుండా చేసుకొనవచ్చు. వాటి కారణంగా దుఃఖ శోక సంతాప మంటలలో కాలిపోవలసిన అవసరం లేదు. అంటే ప్రతికూలతలు ఉన్నప్పటికి కూడా మనిషి ఆనందమయంగా, ప్రేమ పూర్వకమైన స్థితిలో ఉండవచ్చు.

ఇలాంటి స్థితిని మనిషి వశం చేసుకొనవచ్చు, కోరుకున్న స్వర్గాన్ని ఇక్కడే తయారుచేసుకొనవచ్చు, తప్పనిసరిగా సాధించు కొనవచ్చు. దీనిలో ఎటువంటి సందేహం లేదు. కావలసినదల్లా దృష్టికోణాన్ని కొంచెం మార్చుకోవాలి. మనిషి తన దుఃఖానికి, కష్టానికి కారణం వెతకాలి.

మనిషి తను కోరుకున్నవి లభించినప్పుడు క్షోభ, నిరాశ కలుగుతాయి. ఈ క్షోభ, నిరాశలే దుఃఖాన్ని కలిగిస్తాయి. ఈ ప్రపంచంలో కోరికలన్నీ తీరినవారు ఎవరయినా ఉన్నారా అంటే లేరనే సమాధానం వస్తుంది.

కోరికలు తీర్చుకొని సంతోషం పొందాలి అనేదానికి బదులుగా ప్రయత్నాలు, కర్తవ్యాలు నిర్వహించడమే సరియైన పద్ధతి అని భావించుకున్నట్లయితే, ఏ స్వర్గం యొక్క ఆనంద దాయకమైన పరిస్థితులు వాంఛిస్తున్నామో అవి మన చేతిలోకి వస్తాయి. మనం మన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, ప్రయత్నాలు చేస్తుండమని గీతలోని కర్మయోగం చెప్తుంది. గొప్ప ఆదర్శముల కొరకు ప్రేరణ పొందామని, బాధ్యతతో, పురుషార్థంతో పూర్తి మనోయోగంతో ఆ పనిని చేస్తున్నామని సంతోషించాలి. అభీష్ట వస్తువు లభ్యం కాకపోయినప్పటికి దుఃఖించకూడదు. సిగ్గుపడడం, చిన్నబుచ్చుకోవడంవంటివి చేయకూడదు. ఎందుకంటే సఫలత అనేది వ్యక్తి యొక్క ప్రయత్నం, పురుషార్థమేగాక అనేక ఇతర విషయాల మీద ఆధారపడి ఉంటుంది. ఇవి మనిషి వశంలో ఉండవు. ఉదాహరణ కొరకు మంచి పంట కొరకు పొలాలు చక్కగా దున్ని కలుపు మొక్కలు తీసివేయవచ్చు. మంచి విత్తనాలు నాటవచ్చు, ఎరువులు వేయవచ్చు. కాని వర్షం పడటం అనేది వ్యవసాయదారుని చేతిలో లేదు. మేఘములు అధిక వర్షాన్ని

**అనారోగ్యం గురించి ఆలోచించిన కొద్దీ ఆరోగ్యం పాడవుతుంది**

కురిపించవచ్చు. లేదా వర్షం అసలు పడకపోవచ్చు. దీని కొరకు మనం ఏమి చేయగలం?

ఏదైనా లక్ష్యప్రాప్తికి పూర్తి మనస్సుతో ప్రయత్నం చేయండి కాని ఎవరైనా లక్ష్యం చేరేటప్పుడు అడ్డం పడుతుంటే ఏమి చేయాలి? అందువల్ల అనుకున్న లక్ష్యం నెరవేరిందా అనే దాని మీద కాక కర్తవ్యపాలన, ప్రయత్నశీలత మన సుఖానికి కేంద్ర బిందువు కావాలి. మన మనస్సు ఎలా ఉండాలంటే, అనుకున్న పని అయిందా కాలేదా అనే దాని మీద కాక కర్తవ్యపాలనలోనే సుస్పష్టంగా ఉంటే మన దృష్టికోణం సరిగ్గా ఉందని, మన ఆనందం, మన ప్రసన్నత మన చేతులలోకి వచ్చిందని అర్థమవుతుంది. ప్రసన్నత అనేది కర్తవ్యపాలన మీద ఆధారపడి ఉంటే ప్రసన్నత కూడా మన చేతులలోనే ఉందని, ఆ శక్తి స్ఫూర్తి ఇస్తుందని, అదే చిత్తాన్ని ఆనందంతో, ఉత్సాహంతో, సంతోషంతో నింపుతుందని తెలుస్తుంది. ఈ విధంగా ప్రతి నిమిషం ప్రసన్నంగా ప్రస్ఫుటంగా ఉండేందుకు సూత్రం చేతికందినప్పుడు ఇంకా అనుకున్న వస్తువు లభించినప్పుడే సంతోషంగా ఉంటాము, అనుకున్న లక్ష్యం సాధించినప్పుడే సంతోషంగా ఉంటాం అనేది సవ్యమైన ఆలోచనకాదని తెలుస్తుంది. ఈ విధంగా ఎదురు చూడటంలో ఎంత కాలం గడిచిపోతుందో! సఫలత లభించినా కూడా సంతోషం కలుగుతుందో లేదో తెలియదు. అప్పుడు అది జరిగినా జరగకపోయినా ఒకటేననిపించవచ్చు.

ఫలం కోసం ఎదురుచూడవద్దని, దాని మీద మనస్సు ఎక్కువ లగ్నం చేయవద్దని, సఫలత కొరకు ఆతురత పడవద్దని, గీతాకారుడు చెప్తాడు. ఇదే మన స్వర్గాన్ని మనం తయారు చేసుకునేందుకు అమోఘమైన, తిరుగులేని మందు చీటి (Prescription) చిత్తాన్ని, శాంతంగా ఆరోగ్యంగా ఉంచుకుని కర్తవ్యాన్ని పురుషార్థంవలె చేసేవానికి స్వర్గంలో లభ్యమయ్యే ఆనందం, సుఖశాంతులు, నచ్చిన పరిస్థితులు ప్రాప్తించుకుంటాడు. మీరంతట మీరు తయారు చేసుకునే ఈ స్వర్గం నిజమైనది, అతి తేలికైనది, అతి మహత్వ పూర్ణమైనది, వ్యావహారికమైనది.

*– అఖండజ్యోతి, జనవరి 1980*

*అనువాదం: రేవిణిపాటి రమాదేవి*

## స్వశక్తితో జీవిస్తా

*దేవమానవుల విశిష్ఠత ఏమంటే వారు పారమార్థిక కార్యక్రమాలు చేపట్టటమేగాక తమ సత్పరామర్శతో ఇతరులకు శిక్షణ ఇచ్చి వారి మార్గమును సుగమం చేస్తారు.*

*ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌ని ఒక బాలుడు ఆకలిగా ఉన్నది ఒక పైసా ధర్మం చేయమంటాడు. రెండు పైసలిస్తే ఏమి చేస్తావని ప్రశ్నించగా మా అమ్మకు కూడా నాతోపాటు ఒక పైసా సెనగలు కొని ఇస్తానని పలుకుతాడు. రూపాయిస్తే ఏమి చేస్తావని మరల ఆయన ప్రశ్నిస్తాడు. వ్యాపారం చేసుకుని స్వశక్తితో జీవిస్తానని బాలుడు జవాబిస్తాడు. విద్యాసాగర్ వెంటనే జేబులో నుంచి ఆ బాలునికి ఒక రూపాయి ఇచ్చి ముందుకు సాగిపోతాడు. కొంతకాలం తర్వాత ఆయన ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు అక్కడే వ్యాపారం చేసుకుంటున్న ఒక యువకుడు విద్యాసాగర్ చూడగానే గుర్తు పట్టి పరుగున వచ్చి పాదాలకు నమస్కరిస్తూ ఈ వ్యాపారం మీ అనుగ్రహంతో సాగుతున్నదే. అడుక్కునే నీచమైన వృత్తిని నాకు శాశ్వతంగా దూరం చేసిన మీకు కృతజ్ఞతలంటూ పలుకుతాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*


## మోహం

*ఒక చోట ఒక మామిడి వృక్షం ఉంది. దాని నిండా బాగా కాయలు కాసాయి. ఆ కాయల్లో ఒక కాయ మాత్రం చాలా పిరికిది. అన్ని కాయలు పండి నేలమీద రాలి పడుతున్నాయి. దాని యజమాని చెట్టు నుండి పండిన కొన్ని కాయలను కోసుకొనిపోయాడు. ఆ పిరికి కాయ మాత్రం ఆకుల గుబుర్ల మాటున దాక్కొని ఉండిపోయింది. తన సహచరులందరు దూరమవటంతో ఎంతో గాభరా పడి పోయింది. ఇంత జరిగినా అది చెట్టుకే అతుక్కుపోయే మోహం నుండి బయటపడలేదు. దాని 'మోహం' పురుగుగా మారి దానినే తినుట ప్రారంభించుటతో అది ఎండి, కురూపిగా మారిపోయింది. ఒకనాడు వేగంగా వీచిన గాలి ఎండిన ఆకులతో సహా దీన్ని కూడా ఒక్క ఊపులో త్రెంచి ఒక గుంటలోకి విసిరివేసింది.*

*ఆవిధంగానే మానవుని మోహం, పిరికితనం ఏదో ఒక రోజున పండి జీవనగతిలో ప్రారబ్ధ కర్మగా మారి అనేక జన్మ-జన్మాంతరాల వరకు వెంటబడి వేధిస్తూనే ఉంటుంది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

## భయం, కోపం హృద్రోగాలకు కారణం



గాంధీ జయంతి ప్రత్యేకం

# చిన్న పని, పెద్ద పని

గాంధీగారు ఆఫ్రికాలో ఉన్న రోజులు. అప్పటికింకా స్వాతంత్ర్య సంగ్రామం మొదలు కాలేదు. కానీ వర్ణ భేధానికి విరుద్ధంగా సత్యాగ్రహాన్ని ప్రయోగించి విజయం సాధించారు. గాంధీగారు ఆఫ్రికాలో సాధించిన ఈ విజయం గురించి దేశదేశాల్లో చర్చించుకున్నారు.

1909 సంవత్సరంలో గాంధీగారు లండన్‌కు వెళ్ళారు. అక్కడ కొంతమంది భారతీయ యువకులు చదువుకుంటున్నారు. ఆయుధమే వాడకుండా యుద్ధం గెలిచిన వీర సైనికుడు నగరానికి వచ్చాడని తెలుసుకున్నారు. వారి దగ్గరకు పిలిపించుకోవాలని ఉబలాటపడ్డారు.

ఆ విద్యార్థుల ప్రతినిధి గాంధీగారి దగ్గరకు వెళ్ళాడు. వారిని సన్మానించాలని నిర్ణయించుకున్నామని చెప్పి, సమావేశానికి ఆహ్వానించాడు. విద్యార్థుల ఉత్సాహాన్ని చూసి వారి తృప్తి కోసం గాంధీగారు ఆహ్వానాన్ని స్వీకరించారు. ఆ సమావేశంలో భోజనాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అందులో మాంసా హారం, మద్యం ఏ మాత్రం ఉండరాదని గాంధీగారు షరతు విధించారు.

సమావేశం జరిగే రోజు రానే వచ్చింది. విద్యార్థులందరు ఎవరి పనిలో వాళ్ళు మునిగిపోయారు. వాళ్ళల్లో సన్నగా, పొడుగ్గా ఉన్న ఒక భారతీయ కుర్రాడు చకచకా పనులు చేస్తున్నాడు. అతను పాత్రల్నీ, ప్లేట్లనీ తోముతున్నాడు. వంటలో వాడే గిన్నెలను, పాత్రలను తోమి మళ్ళీ వాడడానికి వీలుగా వంట చేసే విద్యార్థులకు అందిస్తున్నాడు.

భోజనం తయారయ్యాక అతిథులుగా వచ్చిన విద్యార్థులందరికి వడ్డన మొదలుపెట్టారు. వంట ఏర్పాటు చూసుకున్న విద్యార్థులే వడ్డన చేసారు. ఎంగిలి పళ్ళాలు తీసి అంట్లు తోముతున్న ఆ కుర్రాడి దగ్గర పెట్టారు. అందరి భోజనాలు పూర్తయ్యాక స్వయంసేవకులు కూడా భోజనానికి కూర్చున్నారు. విద్యార్థుల ప్రతినిధి ఈ కుర్రవాడి దగ్గరకు వచ్చి, "నీవు కూడా భోజనం త్వరగా ముగించుకో మిత్రమా! గాంధీ గారు ఏ క్షణమైనా వస్తారు, అప్పుడు అందరం వారితో కలిసి కూర్చుందాం" అన్నాడు.

తన చేతిలోని పళ్ళెం కడిగి పక్కన పెట్టి తలెత్తిన ఆ కుర్రవాడ్ని చూసి ఆ ప్రముఖుడు నిర్ఘాంతపోయాడు. "గాంధీగారు మీరా! ఈ పనులు చేయవలసిన అవసరం మీకేంటి" అని ఆశ్చర్యంతో అన్నాడు.

తమ మధ్య ఆ పరిస్థితిలో గాంధీగారిని చూసిన విద్యార్థులందరు ఆశ్చర్యపోయారు. వారిని ఎవరు గుర్తించనందుకు, వారికి అటువంటి పని అప్పజెప్పినందుకు, సభలో ఆ ముఖ్యుడు గాంధీగారిని క్షమించమని కోరాడు.

వెంటనే గాంధీగారు తమ సందేశాన్ని వినిపిస్తూ, "అనవసరంగా చింతించకండి. నేను స్వచ్ఛందంగా ఈ పనిని ఎన్నుకున్నాను. ఏ పనీ చిన్నదీ కాదు, పెద్దదీ కాదు. అన్ని పనులు పనులే. మన మనం ఇళ్ళలో ఇలాంటి పనులు చేసుకుంటాం కదా! అక్కడ ఎవరు ఏ పనినీ చిన్నదీ, పెద్దదీ అనుకోరు, మరి అలాంటప్పుడు మీరెందుకు బాధపడుతున్నారు?" అని స్పష్టంగా జవాబిచ్చారు.

*– అఖండ జ్యోతి, డిశంబర్ 1970*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

## షహజాదుల అభ్యాసం

*ఖలీఫా మామూరషీద్ యొక్క కుమారులిద్దరిని మౌలవీ సాహెబ్ బాగా చదివించేవాడు. ఒకనాడు ఆయన బయటకు వెళుతున్నానని, తన చెప్పులు తెచ్చి పెట్టుమని రాజ కుమారులను ఆదేశించాడు. ఇద్దరు పిల్లలు పరుగెత్తుకెళ్ళి చెరొక చెప్పును తెచ్చి ఆయన పాదాల ముందు పెట్టారు. ఈ సమాచారం ఖలీఫాకు అంది మౌలవీ సాహెబ్‌ను పిలిపించారు. ఖలీఫాకు ఖచ్చితంగా కోపం వచ్చి ఉంటుందని అందరు అనుకున్నారు. కానీ ఆయన మౌలవీ సాహెబ్‌ను ప్రశంసిస్తూ అయ్యా! పిల్లల శ్రద్ధను, భక్తిని గెలుచుకొని వారిలో సేవా భావాన్ని పెంపొందించగల మీ వంటి గురువులు ఈనాడు సమాజానికి ఎంతైనా అవసరం. నీ మార్గదర్శనం వలన మా పిల్లల ద్వారా మా కుటుంబాలలో మంచి సంస్కారాలు పెంపొందుతాయి. ఈ విధంగా దేశం కూడా శక్తివంత మవుతుంది' అని ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. వ్యక్తి పదవి దృష్ట్యా ఎంత గొప్పవాడుగా ఉన్నప్పటికి ఆయన శ్రేష్ఠత మాత్రం ఆదర్శాల ఆధారంగానే అంచనా వేయబడుతుంది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**కష్టంలో తృప్తి పొందగలగాలి**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# విగ్రహారాధన యందు దాగి ఉన్న సంకేతాలు, శిక్షణలు - 1

నేనిప్పటివరకు శంకర భగవానునికి సంబంధించిన విషయాలను మీకు చెప్పాను. ప్రస్తుతం ఆయన మూర్తి గురించి, బాహ్యస్వరూపమును గురించి మీకు తెలియచేస్తాను. అందులో దాగి ఉన్న శిక్షణలు, ప్రేరణల గురించి మీకు చెప్తాను. ఈ శిక్షణలను మూర్తీభవింపచేసేందుకే హిందూ సమాజమునందు విగ్రహారాధన అనేది ఏర్పరచబడింది. ప్రతి దేవతామూర్తి వెనుక ఏదో ఒక రహస్యము దాగి ఉంటుంది. గాయత్రీ మాత వాహనం హంస. హంసకు పాలను, నీటిని వేరు చేయగలిగే సామర్థ్యం, వివేకం ఉంటుంది. అటువంటి పక్షి మాత కృపకు పాత్రురాలై ఆమెకు వాహనమైంది.

దీని అర్థం అమ్మవారు హంసపై ఊరేగుతుందని కాదు. అది చాలా చిన్న పక్షి. గాయత్రీమాత బరువును అది మోయలేదు. కూర్చున్నా ఎగరలేదు, నడవలేదు. ఆమె దానిపై కూర్చోనదు. మనం అందులో దాగి ఉన్న విద్యను అర్థం చేసుకోవాలి. హంసను పూజించడం కాదు, దాని ద్వారా మనం ఆ తల్లివద్దకు చేరుకునే మార్గం వెతుక్కోవాలి. వినాయకుడు ఎలుకపై కూర్చుంటాడా? అది అర్థమైతే రహస్యం బోధపడినట్లే! మనం పిల్లలకు అక్షరజ్ఞానం వచ్చేందుకై 'అ' అంటే అవు అని నేర్పుతాము, అక్షరాలన్నీ వచ్చేశాక కూడా వాడు అ అంటే అవు అనకూడదు, విద్య నేర్చుకోవాలి. అదే విధంగా మూర్తిపూజకు హిందూధర్మంలో చాలా ప్రముఖ స్థానం ఉంది. అందుచేత దాని వెనకాల ఉన్న విద్యను, ప్రేరణలను మనం తెలుసుకోవాలి.

## మన సందిగ్ధ స్థితి

విశ్వానికి కళ్యాణకారకుడైన శంకరభగవానుడు హిందూ సమాజమునందు పూజనీయుడు. అందరం ఆయనను పూజిస్తాం, మంత్రాన్ని జపిస్తాం. శివరాత్రి ఉపవాసం చేస్తాము. కానీ ఆయన మన సమస్యలకు సమాధానం చెప్పలేడా? ఆయన మన ఎదుగుదలకు సహాయం చేయడా? మనం ఆయనకు ఎంతో ప్రీతిపాత్రులము, ఆయన ఉపాసకులము. మన మనస్సు ఎక్కడినుండి ఎక్కడికో వెళ్ళిపోతుంది. ఆయన తనకు కనీసం పూజకూడా చేయని వారినెందరినో ఉన్నతస్థితికి చేర్చాడు కదా అని అనిపిస్తుంది. అంతే మన ఆస్తికత బీటలు వారుతుంది. మనస్సులో ఊగిసలాట మొదలౌతుంది. మన పూజ సరైనదా, కాదా అనే సందేహాలు మొదలౌతాయి. ఇందుకు సమాధానం ఒక్కటే, మనం భక్తి, పూజ పాటించామే కానీ దాని వెనుక దాగిఉన్న సిద్ధాంతాలను అర్థం చేసుకొని ఆచరించే ప్రయత్నం చేయలేదు. కేవలం మూర్తిపూజ దగ్గరే ఆగిపోయాము.

## పాత్రతదే తప్పు

వర్షం కురుస్తుంది. అది అందరిపైనా కురుస్తుంది. ఆ సమయంలో త్రవ్విన తటాకాలు, చెరువులు, కుంటలు, ఇంట్లో పెట్టిన పాత్రలు అన్నీ నిండుతాయి. కానీ నిండేదుకు ఖాళీ చేసిన పాత్రను ఉంచాలి కదా! ఏదీ ఉంచకపోతే అంత వర్షం పడ్డా త్రాగేందుకు చుక్కనీరు కూడా ఉండదు.

## పూజ యొక్క ఉద్దేశ్యమేమిటి?

పాత్రతను వికసింపచేసుకోవడమే భక్తి యొక్క ముఖ్య ఉద్దేశ్యము. భగవంతుడిని ఎవరు ప్రార్థించినా, ప్రార్థించకపోయినా, గొప్పగొప్ప నివేదనలు ఇచ్చినా, ఇవ్వకపోయినా ఆయన అందరిపై ప్రేమ కురిపిస్తాడు. అందరికీ అన్నీ ఇస్తాడు. ఆయన దేన్నీ దాచుకోడు. మనం గంధ, ధూప, దీప, అక్షతలతో పూజించేది ఆయన్ని సంతోషపెట్టేందుకు కాదు. అవన్నీ ఆయన దగ్గర లేవనికాదు. అలాగే జంతువులు, పక్షులు, తనను పూజించడం లేదు కదా అని ఆయన వాటిపై కోపించడు. మనం పాత్రతను సరిగ్గా వికసింపచేసుకోలేదని ఆయన మనపై కినుక వహిస్తాడు.

**ఎప్పుడైతే మనస్సులోని మాలిన్యాలను, కలుష్యాలను, దోషాలను, దుర్గుణాలను తుడిచేసి శుభ్రం చేసుకుంటామో, అప్పుడు పాత్రత వికసించి ఆయన స్నేహహస్తం మీకు నిరంతరం లభిస్తుంది. ఇదే పూజ యొక్క అసలు ఉద్దేశ్యం.**

## ఉపాసన యొక్క రహస్యము

మనం ఎప్పుడు అంతర్ముఖమౌతామో అప్పుడే ఉపాసన ప్రారంభమౌతుంది. మన లోపలుండే విశేషగుణాలను చక్కగా మెరుగుపరుచుకొని, గుణ,కర్మ, స్వభావాలను సంస్కరించుకోవాలి. శంకర భగవానుడు మేఘం వంటివాడు. మన పాత్రత వికసిస్తే ఆయననుండి వర్షించే లాభాలు మనకందుతాయి. లేకపోతే కేవలం పూజ దగ్గరే ఆగిపోతాము. దోషాలను వదలివెయ్యకపోతే ఆయన వరదానాల వల్ల మనకేమీ ప్రయోజనం ఉండదు.

సరదాగా నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవారికి సామాన్యంగా ఏ అనారోగ్యం రాదు

## భస్మాసురుడు ఎలా భస్మమైనాడు?

శంకర భగవానుని ఉపాసన చేస్తే ప్రజలకు మంచి ఉన్నతి, లాభాలు కలుగుతున్నాయని గ్రహించిన భస్మాసురుడు రుద్రాష్టాధ్యాయమును, మహేంద్రస్తోత్ర పాఠము, ఉపవాసము, పూజలతో తపస్సు చేయడం మొదలుపెట్టాడు. అది చూసి మెచ్చిన శివుడు ప్రత్యక్షమైనాడు. ఆ అసురుడు 'నేను ఎవరి తలపై చేయి పెడితే వారు భస్మమైపోవాలి' అనే వరం కోరాడు. ఇచ్చాడు శివుడు. మనస్సులో మాలిన్యం తొలగని కారణంగా ప్రక్కనే ఉన్న పార్వతిమాతపై మనస్సు పారేసుకున్న అసురునికి ఆమె తనకు దక్కేందుకు అడ్డుగా ఉన్న శివునిపైనే తన వరప్రభావమును పరీక్షించి అడ్డుతొలగించుకోవాలనుకుని ఆయన వెంటపడ్డాడు. శివుడు నేరుగా విష్ణుభగవానుని సన్నిధికి చేరి తన సంకటస్థితిని వివరించాడు. అప్పుడు భగవానుడు ఇలా అన్నాడు, 'పరమేశ్వరా! వరమిచ్చేముందు అతని పాత్రతను పరీక్షించకుండా వరమిస్తే ఇలానే అవుతుంది.' అన్నాడు. తప్పు ఒప్పుకున్నాడు శంకరుడు. అప్పుడు విష్ణుమూర్తి మోహినీ అవతారమెత్తి శివుడిని అసురుని బారినుండి కాపాడిన కథ అందరికీ తెలుసు.

## అర్థం తెలుసుకొని సాధన చేయాలి

ఈ భస్మాసురుడే మీ మెంబసాలో క్యాంటిన్ పెట్టి 50 పైసలుకు కొబ్బరికాయలు అమ్మితే చాలా గొప్ప ధనవంతుడయ్యే వాడు. మీకందరికీ ఇక్కడ సంపాదించుకొని రెండింట మూడవ భాగము భారతదేశంలో మీ ఇంటికి పంపితే ఆనందంగా ఉంటుంది కదా! భస్మాసురుడికి ఏం లాభం దక్కింది? కాలి బూడిదైపోయాడు. కష్టపడి తపస్సు చేసినా ఫలితం దక్కలేదు, కారణం మనస్సు శుభ్రపడలేదు, అందుచేతనే శంకరభక్తి వెనుక దాగి ఉన్న కళ్యాణకారక భావాలు దరిచేరలేదు. 'శివ' అంటే కళ్యాణకరమైనది అని అర్థం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొనే మనం చేపట్టే కార్యక్రమాలు, ఆలోచించే విధానం తయారవ్వాలి. అది అలవడిన తరువాత 'శివ' భగవానుని నామము యొక్క అర్థము తెలుసునని చెప్పవచ్చు. అర్థము తెలియకుండా **'ఓం నమఃశివాయ'** మంత్రం జపిస్తాము. బాహ్యస్వరూపం వల్ల మనకు ఫలితం రాదు. ఆలయములందు జరిగే హారతికి ప్రతి హిందువు తప్పక హాజరౌతాడు. అందరం ఆయన ముందు తలవంచుతాము. కానీ ఆయన ద్వారా సృష్టింపబడ్డ ఈ జగత్తనే కళాకృతిని అర్థం చేసుకునే ప్రయత్నం చేయము. మరి అప్పుడు చేసిన పూజ అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. సంపూర్ణమైన పూజకు సంపూర్ణమైన ఫలితం, అసంపూర్ణ పూజకు అసంపూర్ణమైన ఫలితము వస్తుంది. శివప్రతిమ వెనుక ఎన్నో రకాల విద్యలు దాగి ఉన్నాయి.

## శివుని మూడవనేత్రము

అందరికి రెండు కళ్ళు ఉంటే శివునికి మూడు కళ్ళు ఉన్నాయి. ఆ కన్ను పేరే వివేకము. కామదేవుడు (మన్మథుడు) ఆయన మనస్సును చలింపచేసే పాపం చేయబోయినప్పుడు ఆయన తన మూడవకన్ను తెరచి మన్మథుడిని భస్మం చేశాడు. ఈ కథ మీకందరికీ తెలుసు. సైన్సు తెలిసిన వారికి త్రీడైమన్షన్ ఫోటోగ్రఫీ ద్వారా వచ్చే ఫొటోల్లో పొడవు, వెడల్పులే తప్ప లోతు చూడడం అందరికి తెలియదు. లోతు చూడడం కనుక నేర్చుకుంటే ఆ ఫొటోలో ఉన్న గొప్పతనం, వాస్తవం అర్థమై ఆనందం కలుగుతుంది.

## సామాన్యదృష్టికి అవతల

త్రీడైమన్షన్‌లో ఉండే ఫొటో మనం మూడవకన్ను తెరచి లోతును గమనించడం నేర్పిస్తుంది. మనకు బాహ్యంగా చూడడమే తెలుసు కనుక బైటవుండే సౌకర్యము-అసౌకర్యము, సుఖము-దుఃఖము, లాభం-నష్టం అనేవి మాత్రమే కనిపిస్తాయి. నాలుకకు ఏది రుచికరమైనది, ఏది కాదు, ప్రాపంచిక లాభనష్టాలు, మానసికమైన ఆనందాలు, చక్కని విశ్రాంతి ఇవే మనకు తెలిసేది. మన కళ్ళు బాగా పనిచేస్తాయి కనుక అన్నీ గమనించి అర్థం చేసుకోగల తెలివితేటలు ఉన్నాయని, మనం చాలా ఖచ్చితమైన వ్యక్తులమని అనుకుంటే చాలా సంతోషంగా అనిపిస్తుంది. బాగా ధనవంతులమవ్వాలని, మంచి సంతానం కలగాలని, ప్రక్కవారి దృష్టిలో చాలా ఎత్తుగా ఉండాలని అనుకుంటాము. ఇవి శరీరము మరియు బుద్ధికుండే ఆనందాలు. అందరికుండేవి ఆ రెండు కళ్ళే.

## దూరదృష్టి అనేది అలవాటు చేసుకోండి

కానీ శంకరభగవానునికి దూరదృష్టి అనే మరోకన్ను ఉన్నది. ఆయన యొక్క ప్రత్యేక భక్తులు కూడా ఈ కన్నును తెరచి చూడడం నేర్చుకోవాలి. అప్పుడు వారికి రేపటి లాభం కొరకు ఈనాటి లాభాన్ని త్యాగం చేయక తప్పదు అనే విషయం అర్థమౌతుంది. వ్యవసాయం గురించి ఏమీ తెలియనివారు రైతు విత్తనాలను మట్టిలో పడేస్తున్నాడని నీరుపోసి కుళ్ళబెడుతున్నాడని అనుకుంటారు. కానీ అలా చేస్తేనే మరో ఆరు నెలల్లో పచ్చగా కళకళ్ళాడే పొలం కంటిముందు ఉంటుందని తెలివైనవారికి మాత్రమే తెలుసు.

## రెండు కళ్ళు అంటే మూడు కళ్ళు అని అర్థం

విద్యార్థి పాఠశాలకు వెళ్తాడు. పరీక్షలకు చదువుతాడు. పరీక్ష

చిన్న చిన్న ఆనందాలు మనిషికి ఎప్పుడూ ముఖ్యమే

రోజున తోటి స్నేహితుడు వచ్చి 'ఈ పరీక్షలు ఎవరు వ్రాస్తారు? ఆడుకుందాం, సినిమాకెళ్దాం, ఇప్పుడు చదివి ఏం చేయాలి?' అంటే తెలివైన విద్యార్థి వినిపించుకోకుండా పరీక్షవ్రాస్తాడు. కారణం దాని విలువ తెలుసుకున్నాడు. రాబోయే రోజులలో తను అమ్మా నాన్నల సేవచేయాలి, భార్యాబిడ్డలను పోషించాలి అంటే సంపాదించాలి, అందుకోసం ఈ వయస్సులోనే చదువుకోవాలి అనే దూరదృష్టి ఉన్నది.

## శంకరభగవానుడనే మూసలో మిమ్మల్ని మీరు అచ్చుపోసుకోండి

మూసను అచ్చు పోసేందుకు వాడతారు. అందులో ఏది పోస్తే అలానే వస్తుంది. శంకరుని భక్తులందరు ఆయన చరణ వైభవమును చూసి తమని తాము ఆ చరణాలకు సమర్పించు కోవాలనుకుంటారు. కుమ్మరి మట్టిని పిసికి మూసలో పోసి కుండలు చేస్తాడు. భగవంతుడు మనమిచ్చే హారతికోసమో, పూజ కోసమో ఎదురుచూడడు. భగవద్భక్తులు భగవంతుని వద్దకే వెళ్ళాలి. ఉపాసన అంటే ప్రక్కనే కూర్చోవడం అని అర్థం. కర్ర, నిప్పు ప్రక్కప్రక్కన ఉండకపోతే అగ్నియందు వెలుగు రాదు, కర్ర అగ్నిగా మారదు. మనం కూడా శంకరభగవానునివలె మారాలంటే ఆయనకు దగ్గరగా వెళ్ళగలగాలి. దూరంగా ఉండి ప్రణామం చేస్తే కుదరదు. ఆయనతో కలిసి ఆయనలా మారిపోవాలి. మన జీవితం కూడా ఆయన జీవితంవలెనే మారిపోవాలి. మన యొక్క మూడవకన్ను కూడా తెరుచుకోవాలి. సుదూర భవిష్యత్తును గమనించి అర్థం చేసుకోగలగాలి. ఆ ప్రయత్నంలో ఈనాడు మనకు నష్టం కలుగవచ్చు కానీ రేపు చాలా లాభం ఉంటుంది. ఆ పని చేసేందుకు ముందు మనం అంతటి సాహసం కూడా చేయగలగాలి, అందుకు వివేకంతో కూడిన దృష్టి వికసించాలి.

## సుదూర లాభమే అసలైన దృష్టి

రామాయణమును అందరు లోతైన దృష్టితో చదవాలి తప్ప పారాయణ చేస్తే కుదరదు. అప్పుడే అందులో మనకు రాముడు ఎన్ని రకాల శిక్షణలిచ్చాడో అర్థమౌతుంది. ఇప్పుడు మనం ప్రస్తుత లాభాన్ని వదిలి సుదూర లాభమును గురించి ఆలోచించాలి. రాముడి జీవిత చరిత్ర ఎంతో సుందరంగా, ఎన్నో రకాల శిక్షణలతో నిండి ఉంటుంది. ఆయన మూడవకన్ను తెరిచాడు. రాముడు ఇలా చెప్పాడు–'నా భక్తులు, శివభక్తులు కూడా శివునివలె మూడవ నేత్రాన్ని తెరవాలి'. రాముడు, భరతుడు రాజసింహాసనం విషయమై వాదులాడుకున్నారు. రామచంద్రుడేమో నా చిన్నతమ్ముడే రాజ సింహాసనంపై ఆసీనుడు కావాలి అని, భరతుడేమో కాదు, కాదు పదవి, డబ్బు, శాశ్వతం కాదు, లోకపరలోకాలే గొప్పవి, కనుక రాముడు మాత్రమే రాజ్యాధికారం చేపట్టేందుకు అర్హుడు అని, ఇలా ఇద్దరు నువ్వు తీసుకో అంటే నువ్వు తీసుకో అని ఆ పదవిని బంతివలె చేసి ఆడుకున్నారు. నేను తండ్రిమాట తప్పను, వన వాసం చేస్తాను, ధనవ్యామోహం వదిలేస్తాను అని ఎవరు బంతిని అవతలివారి వైపు వదిలితే వారు అంతగా గెలిచిన వారౌతారు.

## మన సంస్కృతి యొక్క గొప్పతనం

రాముడు గెలిచాడా, భరతుడు గెలిచాడా అంటే ఇద్దరు గెలిచారు. తండ్రిమాట కోసం, తల్లి ఆజ్ఞను పాటించడం కోసం, తమ్ముడిని ప్రసన్నంగా ఉంచడం కోసం రాముడు రాజ్యభారాన్ని వదిలివేసి తమ్మునికి అప్పచెప్పాడు. తమ్ముడికి మాత్రం అన్న అంటే తండ్రి తరువాత తండ్రి కనుక ఆయన సింహాసనంపై నేను కూర్చోను అని రాముని పాదుకలను సింహాసనంపై ఉంచి ఆయనవలెనే వేషం ధరించి, అదే పద్ధతిలో జీవించాడు. ఈ జీవనశైలి భారతీయ సంస్కృతిలో ఇమిడిపోయి లక్షల సంవత్సరాల వరకు చెక్కుచెదరని విధంగా ముద్రించుకుపోయింది. మనము అలానే ఉన్నాము, ఉంటాము. కానీ బయటివారు మన దేశంలోకి చాలా ఉత్సాహంతో, ఉల్లాసంతో వచ్చి దాన్నంతటినీ నాశనం చేసి వెళ్ళిపోయారు. అన్నదమ్ములు ఒకళ్ళ తలలు ఒకళ్ళు నరుక్కొని పళ్ళెంలో పెట్టుకోగలిగే చరిత్రను సృష్టించగలిగారు. మన దేశంలో ఒక పాదుషా ఉన్నాడు, ఆయన తండ్రిని జైలుపాలు చేశాడు, తరువాత అతని కొడుకు అతడిని జైలుపాలు చేశాడు, ఆ తరువాత అతని కొడుకు అతడిని జైలుపాలు చేశాడు. ఈ పరంపర ఇలానే కొనసాగింది. ఈవిధంగా వారు వేయి సంవత్సరాలు గడవక ముందే మట్టినంతటిని మలినం చేసేశారు.

## జటాయువు మూడవకన్ను తెరచి చూసింది

వేలాది, లక్షలాది సంవత్సరాలు గడిచాయి, ఎన్నో సభ్యతలు వచ్చాయి, ఎన్నో సముద్రపుటలలు, ఎన్నో తుఫాన్లు, గాలివానలు వచ్చాయి. మన దేశము, సంస్కృతిపై ఎన్నో రకాల దాడులు జరిగాయి. కానీ రామాయణం మాత్రం మనకు ఎన్నో రకాల శిక్షణలిస్తూనే ఉన్నది. ఆ ఉపదేశాలు, మన పూర్వీకుల అమూల్య సంపద మన వద్ద ఉన్నంత వరకు మనలనెవ్వరు కదిలించలేరు. రామాయణమునందు ప్రేరణాత్మక శిక్షణలెన్నో ఉన్నాయి. రాముడు వనవాసంలో ఉన్నప్పుడు రావణాసురుడు వచ్చి సీతను అపహరించి తన రథంలో తీసుకెళ్తాడు. తీసుకువెళ్తున్నప్పుడు ఒక చెట్టుపై ఉన్న జటాయువు అనే ముసలి గ్రద్ద చూసింది. వెంటనే ఎంతో దూరదృష్టితో ఆలోచించింది. 'ఈ ముసలి వయస్సు లోనైనా నా శరీరమును భగవానుని పనికి ఉపయోగపరచాలి, లోభమోహ బంధాలతో ఎన్నాళ్ళు బంధింపబడి ఉంటాను.

**జీవితంలో ఏదైనా సాధించాలంటే పట్టుదల ఉండాలి**

రావణుడు చాలా బలవంతుడని నాకూ తెలుసు. నేను ఎదిరించలేను. కానీ నా ప్రాణమును ఆహుతినివ్వగలను కదా!' అనుకున్నది. మనం ప్రక్క వారికి కష్టాలు వచ్చినప్పుడు, అన్యాయం జరిగినప్పుడు కళ్ళు మూసుకొని ఇంట్లో కూర్చుని వాళ్ళు చేసుకున్నది వాళ్ళు అనుభవిస్తున్నారు, నాకెందుకొచ్చిన గొడవ అనుకుంటుంటాము.

### అన్నింటికంటే గొప్ప సౌభాగ్యము

ఇటువంటి పరిస్థితిలో శాంతితో, ప్రపంచ ప్రజలంతా కలిసి, మెలిసి ఎలా ఉండగలరు, ఉండలేరు. నా కష్టానికి మీ సాయం వద్దు. మీ కష్టానికి నేను సాయం చేయను అనే స్థితిలో అంతా నాశనం కాక ఏమౌతుంది? మనుషులంతా కలిసిమెలిసి చెడును ఎదిరించాలి. జటాయువు 'నాకు సగం కన్నే కనిపించినా ఎవరికి అన్యాయం జరిగినా, దాడి జరిగినా నేను ఎదిరిస్తాను, ఆపేందుకు ప్రయత్నిస్తాను' అనుకుంది. ఈ కథ మూడవనేత్రం తెరుచుకున్న జటాయువుది. రాములవారు అక్కడికి వచ్చి పడిపోయిన పక్షిని చూసి లేపి గుండెలకు హత్తుకున్నాడు. దానికంటుకున్న మట్టిని శుభ్రం చేసి, కన్నీరు పెట్టుకుంటూ దాని గాయాలకు కట్టుకట్టాడు. అంతకంటే పరమసౌభాగ్యం ఇంకేముంటుంది? ఇంతకంటే గొప్ప విశేషం ఇంకేముంటుంది?

### వెల చెల్లించవలసినదే

జటాయువు యొక్క సౌభాగ్యమేమి, రామభక్తిని పొందడం. భగవంతుని ప్రేమపొందడం, దానికి తగిన మూల్యం చెల్లించింది. శంకరుని మార్గంలో నడిచేందుకు మీరు ఎంత మూల్యం చెల్లించారు. ఎంతసేపు నా కోరికలు తీర్చు అని అడుక్కుంటూ తిరుగుతుంటారు. శివరాత్రికి మీరంతా బిల్వపత్రం తీసుకొని మందిరానికి వెళ్తారు. 'మహాదేవా! మేము రోజు ఉదయాన్నే బిస్కెట్లు తిని టీ త్రాగుతుంటాము, మీరు బిల్వపత్రాలు తినండి' అని చెప్తాము. అంతేకాదు భారతదేశంలో శివునికి ఉమ్మెత్త కాయలు, జిల్లేడుపూలు సమర్పిస్తారు. పాపం ఆయన ఇలా ఇవ్వు నాయనా అని అవి తింటాడు. వెంటనే మత్తు వచ్చేస్తుంది. అంతే శిష్యుడు ఆయన సంచి తీసుకొని పారిపోతాడు. శంకరుడు కళ్ళు తెరిచి చూసేసరికి రోజూ నీళ్ళు పోయడానికి వచ్చే భక్తుడు లేడు. ప్రక్క నున్న సంచీకూడా లేదు. మనం కూడా అటువంటి వారమే.

(సశేషం)

*(మెంబాసా కెన్యాలో డిశంబర్ 1972లో ఇచ్చిన దివ్యసందేశం)*

*– అఖండజ్యోతి, జనవరి 2012*

*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## నా నీడ ఎక్కడ పడితే అక్కడ శుభం జరగాలి

*ఒక సత్‌గృహస్థు సంయమనం కలిగి ఉండేవాడు. కుటుంబ సభ్యులందరిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దటంలో సదా నిమగ్నమై ఉండేవాడు. నీతిగా సంపాదించిన ధనంతోనే కుటుంబాన్ని పోషించుకొనేవాడు. అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన కాలాన్ని, ధనాన్ని పరమార్థ ప్రయోజనాలకు వినియోగించేవాడు. ఆయన తపోవనాలకు వెళ్ళటంకాక ఇంటినే తపోవనంగా మార్చుకున్నాడు. దేవతలు ఈ గృహస్థు యొక్క యోగ సాధనకు ప్రసన్నులై ఆయన ఎదుట సాక్షాత్కారించి ఏదేనా వరాన్ని కోరుకోమన్నారు. జీవితంలో కొరత, దుఃఖం వంటివే లేనప్పుడు కోరికలేముంటాయి. ఒకరి ముందు చేయిచాచి స్వాభిమానాన్ని ఎందుకు కోల్పోవాలి? అనే ఆలోచనలో పడ్డాడు గృహస్థు. అయినా దేవతలు తమంత తాముగా వచ్చి వరమిస్తామంటే నిరాకరించటం మర్యాదకాదని భావించి, ఒకరికి ఋణపడకుండాను, నిరాకరించాడని దేవతలు భావించకుండాను ఉండేందుకు ఒక ఉపాయాన్ని ఆలోచించాడు. తన నీడ ఎక్కడ పడితే అక్కడ శుభం కలిగేటట్లు అనుగ్రహించమని దేవతలను కోరాడు. దానికి దేవతలు ఆశ్చర్యంతో తలమీద చేయివేస్తే శుభం కలిగితే నీకు ఆనందం, ప్రశంస, ప్రత్యుపకారం వంటివి లభిస్తాయి. కానీ నీడవల్ల శుభాలు జరిగితే వీటి నుండి వంచించ బడతావు. ఇదేమి విచిత్రమైన కోర్కెయని అడిగారు. దానికి గృహస్థు వినమ్రతతో, దేవతలారా! ఎదుటి వ్యక్తికి తన వలన శుభం కలిగిందని తెలియటం వలన అహంకారం పుడుతుంది. దానితో సాధనలో విఘ్నాలు కలుగ నారంభిస్తాయి. కానీ నీడ ఎవరి మీద పడింది? ఎవరు లాభాన్వితులైనారు? అనేది మనకు తెలియదు. కాబట్టి సాధకుని జీవితంలో కోర్కెలంటూ ఉంటే ఇటువంటి కోర్కెలే శ్రేయస్కరములైనవని "ఇది సాధనయొక్క శ్రేష్ఠ స్వరూపమని" పలుకగా దేవతలు గృహస్థుపై అనుగ్రహ వర్షాన్ని కురిపించారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**సుఖానికి పెట్టుబడి కష్టం**

నా వారితో నా మాట

# యుగనిర్మాణ పరివారం

మన యుగ నిర్మాణ యోజన పరమపూజ్య గురుదేవుల శరీరం వంటిది. ఇందులోని ప్రతి కార్యకర్తను వారి యొక్క అవయవంగా భావించవచ్చు. కానీ శరీరంతో ముడిపడి ఉన్నప్పుడు మాత్రమే ఏ అవయవానికైనా ప్రాముఖ్యత ఉంటుంది అని గుర్తుంచుకోవాలి. శరీరంతో బంధాన్ని వదులుకుంటే ఆ బాధ శరీరానికి ఉంటుంది, విడిపోయినందుకు ఆ అవయవం కూడా కుళ్ళిపోతుంది. ఇది బాగా లోతుగా ఆలోచించవలసిన విషయం.

మన అసంఖ్యాకులైన కార్యకర్తలలో వెలుగుతున్న చైతన్య జ్యోతికి మూలం ఒకటే యుగఋషి పరమపూజ్య గురుదేవుల ప్రాణాలే మనల్ని పోషిస్తున్నాయి. వారి తపస్సుతో జీవనాన్ని పొందుతున్నాం. ఒక్కో నీటి అలలో ఒక్కొక్క సూర్యుడు కనిపిస్తాడు, కాని నిజానికి అది ఒకే సూర్యుని అనేక బింబాలు. సముద్రపు అలలన్నీ వేరు వేరుగా కనిపించినా అవి ఒక సముద్రానికి చెందినవే. మన మిషన్ మొత్తానికి ఒకే సమిష్టి చైతన్యం ఉన్నది, దాన్ని మనం పరమపూజ్య గురుదేవులు అని పిలుస్తాము, వారినే ప్రాణాలకన్నా మిన్నగా ప్రేమిస్తున్నాము. మనలను మనం గమనించుకున్నా, ఇతర కార్యకర్తల్లో చూసినా వారి ప్రతిభే కనిపిస్తుంది. మణులను కూర్చిన దారంలాగా, బైటకు చూడడానికి వేరు వేరుగా కనిపిస్తున్న మనందరినీ వారు ఒకే సూత్రంతో అల్లారు.

వారు అల్లిన ఈ బాంధవ్యంలో బద్ధులై ఉండడంలోనే మన ప్రాపంచిక, సామాజిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు ఉంటుంది. మిషన్‌లో ఒక ప్రత్యేకమైన గుర్తింపు కావాలనుకున్నా, వేరుగా ఉండి మరింత కీర్తిని, గౌరవాన్ని పొందే ప్రయత్నం చేసినా చాలా పెద్ద తప్పు చేసిన వాళ్ళమవుతాము. ఇలా చేయడం వల్ల సాధించేది ఏదీ లేదు కాని చాలా నష్టపోతాము. పరమపూజ్య గురుదేవుల దైవీచైతన్యం యొక్క కృపను పోగొట్టుకుంటాము, ఒంటరితనంలో లభించేది ఏదైనా చివరికి సరిపోదు, అనవసరం అనిపిస్తుంది.

చేతిలో భాగంగా ఉంటూ, అది చెప్పిందల్లా నేను ఎందుకు చేయాలి అని అనుకునే వేలు కలిసుండడం వల్ల నాకేంటి లాభం, నేను చేసిన శ్రమకు ఫలితం, కీర్తి నాకు మాత్రమే ఎందుకు దక్కకూడదు అనుకుని చేతినుండి విడిపోయిన వేలుకి కొంత సేపటిలోనే తన ఆలోచనలన్నీ తప్పని తెలుస్తుంది. శరీరంతో కలిసి ఉన్నప్పుడు జీవనదాత నుండి లభించే రక్తం ఇప్పుడు అందడం ఆగిపోయింది. వేలు ఎండిపోయి, కుళ్ళిపోయింది. ఈ కుళ్ళిపోయిన ముక్కను ముట్టుకోవడానికి కూడా జనాలు చీదరించుకుంటారు. చేతితో కలిసున్నప్పుడు అది భగవంతుడిని పూజించేది. చేతులతో కలిపినప్పుడు ఆత్మీయుల స్పర్శను ఆనందించేది. గొప్ప గ్రంథాలు రాసేది. ఎన్నో పెద్ద పనులు చేసిన కీర్తి లభించేది. వేరుపడ్డప్పటి నుండి అన్ని సౌకర్యాలు కోల్పోయింది. దానికి ఎలాంటి లాభం దక్కకపోగా చాలా నష్టపోయింది.

మిషన్‌లో కలవడం వల్ల మనమందరం ఎన్నో కుటుంబ పరమైన, సామాజిక లాభాలను పొందాం. కష్ట సమయాల్లో మనలోని ప్రతి ఒక్కరు దైవీ సంరక్షణను అనుభవించాం. ఈ మిషన్ వల్ల మన క్షేత్రాల్లో మనం కీర్తిని పొందాం. అందరం కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించాం. మనం కలిసుండడం వల్ల ఎన్నో పెద్ద కార్యక్రమాలు సఫలమయ్యాయి. కాబట్టి వర్చస్సు మనలో ఏ ఒక్కరిదో కాదని, మన సంఘటిత శక్తిదని అందరం గుర్తించాలి. మనలోని పరస్పర ద్వేషాలు, అయిష్టాలు, పక్కవారి కన్నా ఎక్కువ పేరు పొందాలనే తపన, మన సంస్థను బలహీన పరుస్తుంది. మనం ఎవరికి అవయవాలుగా ఉన్నామో వారికి కూడా చాలా బాధ కలుగుతుంది. ఎవరి వల్ల స్వర్గవాసులైన తల్లిదండ్రుల కీర్తి రెట్టింపవుతుందో, అటువంటి వారినే మంచి సంతానం అంటారు. వీరు చేసే పనుల వల్ల ఇహ పరలోకాల్లో వారి గౌరవం పెరగాలి. అలా చేయలేని పిల్లలు వారి పరిస్థితి ఏంటో వారే గమనించుకోవాలి.

పిల్లలు వేరుపడడం, దూరంగా వెళ్ళిపోవడం, పరస్పర ద్వేషాలు, కలహాలు తల్లిదండ్రులకు చాలా బాధను కలిగిస్తాయి. మనలో ఎవరో ఒకరు మిగిలిన వారికన్నా గొప్పవారై ఉండవచ్చు, కాని కలిసి ఉండడంలో ఉన్న గొప్పతనం ఒంటరిగా ఉండడం వల్ల రాదు. ఒక్క పువ్వు అందంగా ఉండచ్చు, కాని మాల అల్లినప్పటి అందం అది ఒంటరిగా ఉన్నప్పుడు రాదు. ఆ ఒక్క పువ్వు దేవుడి మెడలో నిలవదు. స్వార్థపరులు, సంకీర్ణ స్వభావం కలవారు తమని తాము విడిగా ఉండాలని కోరుకుంటారు వారి లాభాన్ని మాత్రమే చూసుకోగలరు. పక్కవారిని ఉపేక్షించి, అవమానించి, హేళన చేసి, తిరస్కరించగలరు. వారి అహంకారాన్ని పెంచి పోషించుకుంటారు. కాని చివరికి దూరదృష్టి లేకుండా చేసే ఈ పనులన్నిటి వల్ల, ఐకమత్యంతో పొందే లాభాలు దక్కవు. సముద్రంలోని ప్రతి తరంగం వేరు కాపురం పెడితే,

**దిగులుతో కుమిలిపోయి సాధించేది ఏమీ ఉండదు**

అవి ఎండిపోతాయి. అలలుగా ముందుకు సాగినప్పుడు కనబడే అందం వాటికి దక్కదు. అలా విడిపోయిన అలలు గర్జించలేవు, ఓడలను సైతం తిరగవేయగల శక్తి వాటికి ఉండదు. ఏదో ఓ గొయ్యిలోకి చేరి చివరికి ఎండి పోతాయి. ఎండిపోయాక దానికి అస్తిత్వమే ఉండదు. ఇక దాని గురించి, దాని అందం గురించి ఎవరూ చర్చించుకోరు. స్మశానంలో బూడిదలాగా, సముద్రపు ఇసుకలో ఉప్పులాగా మిగిలి పోతుంది. మన నుండి దూరమైన స్నేహితుల పరిస్థితి కూడా ఇంతే అవుతుంది. కాబట్టి ఒకరితో ఒకరు కలిసి మెలిసి ముందుకు సాగడమే అందరికీ శ్రేయస్కరం, శుభకరం, సౌభాగ్యకరం. కీర్తి, యశస్సు, సౌభాగ్యం వాటంతటవే మన దగ్గరకు పరిగెత్తుకు వస్తాయి.

ఎన్నో ఇటుకలు కలిస్తేనే భవంతి నిర్మాణం పూర్తవుతుంది. బిందువులు కలిసి మేఘాలవుతాయి. పరమాణువుల సమూహంతో పదార్ధ రచన జరుగుతుంది. అవయవాల సంఘటిత స్వరూపం శరీరం. ఎన్నో విడి భాగాలు కలిసి ఒక యంత్రం అవుతాయి. పంచతత్త్వాలతో ప్రపంచం నిర్మించబడింది. పంచ ప్రాణాలు ఈ శరీరాన్ని నడిపిస్తున్నాయి. కార్మికుల సమూహమే సంస్థలను, ప్రభుత్వాన్ని నడిపిస్తుంది. ఈ సంఘటనల్లో వేర్పాటువాదం తలెత్తితే, ఎవరి కుంపటి వారిదే అనుకుంటే ఎంత గొప్ప సంఘటనలైనా తుచ్ఛమైనవిగా మారిపోతాయి.

ఇటువంటి తుచ్ఛమైనవి తమ అస్తిత్వాన్ని నిలుపుకోలేవు కూడా. పరస్పర సహకారంతోనే ప్రగతి సాధ్యం. మిగిలిన వారందరినీ వదిలేసి తాను మాత్రమే ముందుకు సాగిపోవాలి అనుకునే వారు వారి అస్తిత్వం నిలుపుకోవడానికి పడవలసిన కష్టాలను ముందుగా చూడలేరు. చేతి వేలు విడిపోవడం లాభదాయకమని భావించినప్పటికి, సమూహంలో ఉండడమే దానికి శ్రేయస్కరం.

యుగ నిర్మాణ యోజన తన ప్రయాణంలో మనందరికి ఒక ప్రత్యేక గుర్తింపుని తెచ్చి పెట్టింది. ఈ గుర్తింపు మన సమూహానిది. ఇది మనందరం కలిస్తేనే ఇది సాధ్యమైంది. మనలో ఎవరు ఎక్కువ కాదు, తక్కువ కాదు. స్త్రీ పురుషుల సమానత్వం, జాతి, కులాల సమానత్వం వంటి అందమైన, శుద్ధమైన, సౌమ్యమైన ఉదాహరణలు మన దగ్గర కనిపించినట్టుగా మరెక్కడా కనిపించదు. మనమందరం పరమపూజ్య గురుదేవులకి సమర్పణ చేసుకోవడం వల్లనే ఇది సాధ్యపడింది. వారిలో మన అస్తిత్వాన్ని వదలి, వారి తేజస్సును ధరించడం వల్ల ఇది సాధ్యపడింది. మన శ్రద్ధను వారికి అర్పించి, వారి ప్రేమను చూరగొన్నాము. ఇప్పుడు అదే ప్రేమను మన కొత్త పరిజనులకు అందివ్వాలి. వారికి సహకారాన్ని అందివ్వాలి, స్నేహాన్ని పంచాలి. మన మిషన్ ఒక సంస్థ కాదు, ఒక కుటుంబం. పరస్పర ప్రేమతోనే అది పోషించ బడుతుంది.

పరమపూజ్య గురుదేవుల చైతన్యం మనలో నిండుగా ఉన్నది. ఈ తథ్యాన్ని అవగాహన చేసుకోవాలి. ఒకే సూర్యుని అనంత కిరణాలతో వెలుగుతున్న వాస్తవిక స్థితిని గుర్తుంచుకోవాలి. మిషన్ యొక్క సామూహిక భావమే ప్రగతికి, వికాసానికి మూలం. మనకందిన వరాలన్నీ కూడా ఈ సామూహిక ప్రవృత్తి వల్లనే. ఈ ప్రవృత్తి వల్ల వరాలు లభించాయే కాని లాభాల వల్ల సామూహిక భావం ఏర్పడలేదు.

మిషన్ యొక్క అవయవంగా ఉండడమే మనకు గౌరవం. మిషన్‌లో ఒక భాగంగానే మనలను మనం భావించాలి. ఒంటరిగా ప్రగతి సాధ్యపడదని గుర్తుంచుకోవాలి. ఒంటరిగా లభించిన కీర్తి, యశస్సు లెక్కలేనన్ని వికృతులకు జన్మనిస్తుంది. పరస్పర ఈర్ష్య ద్వేషాలు తప్ప మరేమీ మిగలవు. జాగృదాత్మలు ఆత్మగ్లానిలో దహించుకుపోతారు. వ్యక్తిగత గౌరవానికి పాటుపడే వారిని స్వార్ధపరులు అనాలి, స్వార్ధపరులకి ఎప్పటికి నిజమైన గౌరవం దక్కదు, చివరికి తిరస్కారమే మిగులుతుంది.

అటువంటి మార్గంలో పతనం తప్పదు. సంకీర్ణత అనే గోతిలోని నీళ్ళు ఎండిపోతాయి, పాచిపట్టిపోతాయి. ప్రవహిస్తున్న నీరు మాత్రమే స్వచ్ఛంగా, సజీవంగా ఉంటుంది. మన మిషన్ ఒక సమర్ధవంతమైన దైవీ ప్రవాహం. కాబట్టి పరిపూర్ణంగా దానికి సమర్పించుకోండి. వ్యక్తిగత గుర్తింపు అనే ఉచ్చులో చిక్కుకోకండి. మిషన్ యొక్క ఉన్నతిలోనే మన ఉన్నతిని చూసుకోవాలి. మిషన్ యొక్క ఆనందంలోనే మన ఆనందాన్ని వెతుక్కోవాలి. మన సంపద, ప్రతిభ, గౌరవం అన్నీ గురుదేవుల వరాలు అని తెలుసుకోండి. అవన్నీ వారికి తిరిగి ఇవ్వడమే వాటిని సద్వినియోగ పరచడం.

గురుదేవులు మనకి ప్రజాసేవను నేర్పించారు. సముద్రుడు తన నీటిని మేఘాలకిస్తే, మేఘాలు వాటిని నేలకిస్తాయి, ఆ నేల నదుల రూపంలో అదే నీటిని మళ్ళీ సముద్రుడికి అందజేస్తుంది. ప్రపంచంలో శాంతి, సౌఖ్యం, సస్యశ్యామలానికి కారణం ఈ నీటి చక్రమే (Water Cycle). మన మిషన్‌లో కూడా ఈ ప్రక్రియే కొనసాగుతుంది. గురుదేవులు తమ కార్యకర్తలకు అందించిన వరాలను, వారి ప్రతిభగా తిరిగి వారికి, వారి మిషన్‌కి అందజేస్తేనే మిషన్ యొక్క ప్రగతి పథం విస్తరిస్తుంది. కాబట్టి మనల్ని మనం మిషన్‌లో, మిషన్‌ని మనలో చూసుకోవాలి. అలా చేయడం వల్ల మనలోని తుచ్ఛభావాలు తొలిగిపోతాయి, గొప్పతనం దానంతటదే వరిస్తుంది.

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 2012*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**ఇతరులు ఏమనుకుంటారో అనేదానికి ప్రాముఖ్యత ఇవ్వకూడదు**



ఆరోగ్యమే మహాభాగ్యం - 23

# హోమియో వైద్య సేవ



## మూత్రపిండాల్లో రాళ్ళు - హోమియో చికిత్స

ప్రస్తుత కాలంలో అనేకమంది మూత్రపిండాల్లో రాళ్ళ సమస్యతో బాధపడుతున్నారు. వేసవికాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి కారణం శరీరంలోని నీటిశాతం తగ్గిపోయి లవణాల గాఢత పెరిగి రాళ్ళు ఏర్పడే అవకాశం ఉండటమే. మానవ శరీరాన్ని సురక్షితంగా కాపాడే విషయంలో మూత్రపిండాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. మూత్రపిండాలు శరీర ద్రవాల్లోని లవణాల సమతుల్యత కాపాడి శరీరంలోని నీటి పరిమాణాన్ని తగ్గకుండా చూస్తూ జీవకార్య నిర్వహణలో పేరుకుపోయే కాలుష్యాన్ని విసర్జిస్తాయి.

**రాళ్ళకు కారణాలు :** మూత్రపిండాల్లో రాళ్ళు ఏర్పడటానికి చాలా కారణాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి మూత్రాశయాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్, నీరు తగినంతగా తాగకపోవడం, ఆహారపు అలవాట్లు, కొన్ని జన్యుపరమైన లోపాలు.

**రాళ్ళలో రకాలు :** మూత్రపిండాల్లో ఏర్పడే రాళ్ళలో కొన్ని ముఖ్యమైన రకాలు కాల్షియం ఆగ్జలేట్స్, కాల్షియం ఫాస్ఫేట్, సిలికాన్ స్టోన్, యూరిక్ ఆసిడ్ స్టోన్స్ మొదలైనవి. మూత్రపిండాల్లో రాళ్ళను సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే యూరినరీట్రాక్ట్‌లో (మూత్రనాళంలో) ఆటంకం ఏర్పడి మూత్రవ్యవస్థ సమస్యలు తీవ్రమవుతాయి.

మూత్రపిండాల్లో తయారయ్యే రాళ్ళు వివిధ పరిమాణంలో ఉంటాయి. ఇవి మూత్రనాళం ద్వారా మూత్రాశయంలోకి చేరే ముందు నొప్పి తీవ్రంగా ఉంటుంది. రాళ్ళు నునుపుగా కాక వివిధ కోణాకృతుల్లో ఉండటం వల్ల అవి జారేప్పుడు లేదా కదిలి నప్పుడు మూత్రకోశానికి గుచ్చుకోవడం వల్ల నొప్పి భరించలేనిదిగా ఉంటుంది. రాళ్ళు గుచ్చుకోవడంవల్ల రక్తస్రావం జరుగుతుంది. కనుక మూత్రంలో రక్తం వెలువడుతుంది.

**చికిత్స :** వ్యాధి నిర్ధారణ జరిగిన ప్రారంభ దశలో హోమియో మందులను వాడితే శస్త్ర చికిత్స నుండి నివారణ పొందవచ్చు. కానీ అరుదుగా మళ్ళీ మళ్ళీ వస్తుంటాయి. ఇటువంటి వారికి హోమియో మందులను తత్వానుసారం వాడితే పదే పదే రాళ్ళు రాకుండా ఆగిపోతాయి.

### మందులు

**లైకోపోడియం :** కుడివైపు కిడ్నీలో ఏర్పడే రాళ్ళకు ఈ మందు ఆలోచించదగినది. కుడి కిడ్నీ వైపు నొప్పి వస్తుంటుంది. మూత్రాన్ని గమనిస్తే ఇటుక రంగులో ఉంటుంది. ఈ పర్సనాలిటీ వ్యక్తులు చూడటానికి సన్నగా కనబడతారు. వీరు దైనందిన జీవితంలో ఆచి తూచి అడుగు వేస్తారు. మానసిక స్థాయిలో కొంచెం భయస్తులు, భయం వలన సామర్థ్యం ఉన్నా నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తారు. ఇలాంటి వ్యక్తులకు ఈ మందు ముఖ్యమైనది.

**బెర్బెరెస్ వల్గారిస్ :** ఎడమ కిడ్నీ వైపు నొప్పి ప్రారంభమై ముందుకు వ్యాపిస్తుంది. నొప్పి మంటతో కూడి భరించలేనిదిగా ఉంటుంది. ఇలాంటి లక్షణాలు ఉండి, ఎడమ వైపు కిడ్నీలో ఏర్పడే రాళ్ళకు ఈ మందు ఆలోచించదగినది.

**ఎపిస్ :** కిడ్నీలో రాళ్ళ వలన ఇన్‌ఫెక్షన్‌కు గురై మూత్ర విసర్జన బాధాకరంగా ఉంటుంది. మూత్రం పోసే సమయంలో మంట, చురుక్కుమని గుచ్చుకున్నట్లు నొప్పితో బాధపడటం వంటి లక్షణాలున్న వారికి ఈ మందు తప్పక ఆలోచించదగినది.

**టెరిబెంత్రైనా :** మూత్రం నల్లగా ఉండి చుక్కలు చుక్కలుగా వస్తుంది. మూత్రం తరుచుగా ఎక్కువసార్లు పోస్తూ ఉంటారు. మూత్రం ఎరుపు రంగులో ఉండి మంటగా అనిపిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ఈ మందు వాడుకోదగినది.

**బెల్లడోనా :** నొప్పి తీవ్రంగా ఉండి, ఏ మాత్రం కదిలినా నొప్పి వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ఈ మందు వాడి ప్రయోజనం పొందవచ్చు. ఈ మందులే కాకుండా హైడ్రాంజియా, నక్స్‌వామికా, తూజా, మెర్క్యురియస్, ఫాస్ఫరస్, టాబాకమ్ వంటి మందులను లక్షణ సముదాయమును పరిగణలోకి తీసుకొని వైద్యం చేసిన ఎడల మూత్రపిండాల్లో తయారయ్యే రాళ్ళకు శస్త్ర చికిత్స లేకుండా విముక్తి పొందవచ్చు.

**జాగ్రత్తలు :**

- మద్యం ఇతర మత్తు పానీయాలు సేవించకూడదు.
- టీ, కాఫీలు మానేయాలి.
- మాంసాహారం తగ్గించాలి, సాత్వికాహారం తీసుకోవాలి.
- పొగాకు ఉత్పత్తుల వినియోగం, ధూమపానం త్యజించాలి.
- ఫాస్ట్‌ఫుడ్స్, మసాలాలు, నూనె పదార్థాలు, ఉప్పు ఎక్కువగా వాడటం వంటివి తగ్గించాలి. వీటిని వీలైతే పూర్తిగా మానకుంటే మంచి ప్రయోజనం పొందవచ్చు.
- తగినంత నీరు త్రాగాలి, కనీసం రోజుకు 4 లీటర్ల నీరు త్రాగాలి.
- ద్రవ పదార్థాలు, పండ్లు, తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.


**- డా॥ టి. నీలవేణి**, బి.హెచ్.ఎమ్.ఎస్.

ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*

**ఉత్సాహం, చిరునవ్వు, ఆసక్తి శరీరాన్ని శక్తితో నింపుతాయి**



# సుమతి సూక్తం - 1

'పద్యపఠనం' విద్యార్థుల మనస్సులలో విత్తనం నాటడం వంటి ప్రక్రియ. బాల్యంలో చక్కటి అర్థవంతమైన, నీతి బోధాత్మకంగా ఉండే పద్యాలను నేర్చుకుంటే, విద్యార్థులు పెద్ద అయ్యాక వారి వయస్సుతో బాటే ఈ పద్య విజ్ఞానం పెరిగి, జీవితంలో నైతిక విలువలు' అనే ఫలాలను అందిస్తాయన్నది అక్షర సత్యం. చిన్నప్పుడు కేవలం పద్యాలను కంఠస్థం చేసిన, ఎందరో పెద్దలు, గౌరవ ప్రదమైన వృత్తులలో స్థిరపడ్డాక, ఈ పద్యాలను ఉటంకిస్తూ, అద్భుత ప్రసంగాలతో, ఆకట్టుకుంటూ 'పద్యాలు ప్రతి ఒక్కరు నేర్చుకోవాలి' అని భావించి, వారి వారి పిల్లల కోసం ఈ వాఙ్మయాన్ని జాగ్రత్తపరచడం మనం చూస్తూనే ఉన్నాం. అందుకనే "పద్యం-మన సంస్కృతి నేపథ్యం" అని నినదిస్తున్నాం మనం.

ఆ సంస్కృతిలో భాగంగానే 13వ శతాబ్దికి చెందిన బద్దెన కవి రచించిన 'సుమతి శతకం' జన బాహుళ్యంలోనికి చొచ్చుకుపోయిన అద్భుత శతకం. దెబ్బతగిలి బాధపడుతున్న శిశువుకు మందు రాస్తూ నడక, నడతలలో తీసుకోవలసిన జాగ్రత్తలను, అమ్మ ఎలా చిన్న చిన్న పదాలతో (గోరు ముద్దలు తినిపిస్తున్న రీతిలో) చెబుతుందో అలాగే ఈ శతకం మనలను అలరిస్తుంది. ఇందులో ఉన్న ఆంతర్యాన్ని మనం గ్రహించి, రేపటి తరానికి అందజేయగలిగితే మన ప్రయత్నం సఫలమైనట్లే. కంద పద్యాలలో అందంగా సాగే ఈ మకరందాన్ని ఆస్వాదించి, ఆత్మ పరిశీలన చేసుకోవడం మన ధర్మం.

పాఠకులను 'సుమతి' అంటూ సంబోధిస్తూనే, నీకు తెలియని నీతులను బోధిస్తున్నాననడంలోనే కవి చమత్కారం ఆవిష్కృత మవుతుంది. "నీకు ఏమీ తెలియదు. నేను నీకు బోధ చేస్తాను' అని ఎవరైనా చెబితే శ్రోతకు ఆగ్రహంతోబాటు చెప్పే విషయంపై అనాసక్తత కలిగే అవకాశం ఉంటుంది. అందుకనే 'ఓ సుమతీ! ఓ సద్బుద్ధి కలవాడా! అని సంబోధిస్తూ, నీకు మరిన్ని మంచి విషయాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. అని మకుటాన్ని మకుటాయమానంగా తీర్చిదిద్దారు బద్దెన.

***శ్రీరాముని దయచేతను***
***నారూఢిగ సకల జనుల నౌరాయనగా***
***ధారాళమైన నీతులు***
***నోరూరగ జవులు పుట్ట నుడివెద సుమతీ !***

ఓ మంచి బుద్ధిగలవాడా! అందరు ఆస్వాదించి, ఆచరించదానికి వీలైనవి, ఔరా! ఇంత అద్భుతమైన జీవిత సత్యాలు ఎంత సులభంగా ఉన్నాయి! అని ఆశ్చర్యపరిచే మంచి మాటలు, నదీ ప్రవాహంవలే ధారాపాతంగా వెలువడే నీతివాక్యాలు నీకు చెబుతున్నాను. ఇవి వింటే మళ్ళీ మళ్ళీ వినాలనిపించే (వినగా వినగా రాగం ఎంత ఆనందాన్నందిస్తుందో, అటువంటి అనుభూతిని కలిగిస్తాయి. ఇవి నేను చెపుతున్నానంటే కారణం ఆ శ్రీరాముని దయమాత్రమే. శ్రీరాముడు అంటే ఆదర్శం. మూర్తీభవించిన ఆకృతి. ధర్మానికి ప్రతీక. ఎన్ని ఒడుదుడుకులు ఉన్నా, ధైర్యంగా ఎదుర్కోవాలన్నా అద్భుత సందేశాన్నందించిన ఇహలోక వేలుపు. అందుకే ఆ మహనీయుని దయ ఉంటే ఎలాంటి అద్భుతాన్నైనా సాధించవచ్చును. (సముద్రంపై వారధి కట్టడం, శబరి, అహల్యలవంటి వారి జన్మలకు సార్థకతను చేకూర్చడం వంటివి రామునికే సాధ్యం). అటువంటి అద్భుత ఆదర్శ పురుషుని ఆశీస్సులతో నేను ఈ రీతిని నీకు తెలుపు తున్నానంటూ తన భక్తిని, మానవశక్తికి ఎటువంటి ఆదర్శమూర్తి తోడవ్వాలో తెలుపుతూ తన బోధనను ఇలా కొనసాగించాడు బద్దెన.

ఎవరు మనకు నిజమైన సహాయాన్ని చేస్తారో, ఎవరి తోడుంటే మనకు చైతన్యం, లక్ష్యసిద్ధి కలుగుతాయో, అట్టివారి సాంగత్యం అవసరం. లేకుంటే అటువంటి వారిని చేరనీయక పోవడమే మంచిదన్న సూచనను ఇలా వివరించారు బద్దెన.

***అక్కఱకు, రాని చుట్టము***
***మ్రొక్కిన వరమీనివేల్పు మోహరమునఁదా***
***నెక్కిన బాఱని గుఱ్ఱము***
***గ్రక్కున విడువంగ వలయు గదరా! సుమతీ!***

సమాజంలో ఒకరికి ఒకరు సహకరించుకోవడం మానవ ధర్మం. అటువంటి పరిస్థితిలో ఎంతటి దగ్గర బంధువు అయినా, అత్యవసరకాలంలో (శుభ, అశుభములు కలిగినపుడు) సహకరించని చుట్టముతో బంధుత్వము కేవలం వృధా.

ఆపన్న హస్తాన్నందిస్తాడని నమ్మి మ్రొక్కుతూ ఉంటాం. కానీ ఎటువంటి స్పందన లేకుండా, రాయిలా ఉంటూ నీ కష్టాలకు తగిన ఉపాయాన్ని సూచించకుండా నీ నుండి సేవలను మాత్రమే ఆశించే స్వాములు, బాబాలను ఎంత సేవించిన వృధాయే. కాబట్టి

**నిరంతరం పనిచేసేవాడి శరీరం ఆ శ్రమకు అలవాటయిపోతుంది**

కష్టకాలంలో చేయూతనిచ్చే వ్యక్తియే దైవ సమానుడు. ఎలాంటి సహాయం చేయని ఎంత గొప్పగురువైనా, మ్రొక్కడం వృధా. అలాగే మనం ఎక్కి, స్వారీ చేద్దామని ఎంత ప్రయత్నించినా పరుగెత్తని గుఱ్ఱం వృధా. కావున ఇటువంటి నిరుపయోగ ప్రయత్నాన్ని విరమించి, పనికి వచ్చే యత్నాన్ని చేయమని కవి బోధిస్తున్నాడు. యజమాని తన సేవకుల స్థితిగతులను గమనించి, వారికి సహాయం చేయాలనుకున్నప్పుడే సేవకుడు కృతజ్ఞుడై ఉంటాడు. సేవకుల పట్ల యజమానులు కఠినంగా, క్రూరంగా ఉంటే, అట్టి యజమానిని సేవించరాదు అన్న జీవన సత్యాన్ని ఈ పద్యంలో ఇలా వివరించాడు.

***అడిగిన జీతంబియ్యని***
***మిడిమేలపు దొరనుగొల్చిమిడకుటకంటెన్***
***వడిగల ఎద్దుల గట్టుక***
***మడిదున్నుక బ్రతకవచ్చు మహిలో సుమతీ ॥***

ఉద్యోగం చేయడం ద్వారా వచ్చే జీతంతో కుటుంబాన్ని నడపాలనుకోవడం ఉద్యోగి ధర్మం. అటువంటి స్థితిలో యజమాని సరియైన సమయంలో జీతం ఇవ్వకపోవడం, సేవకుడు ఎన్నిసార్లు అడిగినా, రేపు, మాపు అంటు వాయిదా వేయడం మహాదారుణం. అట్టి ప్రవర్తన కలిగిన యజమానిని సేవించడం వృధా. వెంటనే అట్టి వృధా ప్రయత్నాన్ని మాను కోవడం మంచిది. ఆ సేవ కంటే, నీటితో నిండిన నారుమడిని, చెప్పులు లేకుండా, బలం ఉన్న ఎద్దులను నాగలికి కట్టి దున్ని వ్యవసాయం చేయడం మేలు. మనసులేని యజమాని కన్నా, బలం ఉన్న ఎడ్లు మేలు. వాటి సహాయంతోనైనా పంటలు పండించి, జీవితాన్ని గడపడం మంచిది. అంటే మానవతలేని యజమాని కన్నా, మహాశక్తి ఉన్న ఎద్దు మిన్న అని కవి వ్యంగ్యంగా హెచ్చరించాడు పై పద్యంలో.

ఊరు అంటే ఎలా ఉండాలి? ఎటువంటి వాతావరణం ఉండాలి. అన్న అంశాలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ పద్యాన్ని వచించారు మన బద్దెన కవి.

***అప్పిచ్చువాడు, వైద్యుడు,***
***నెప్పుడు నెడతెగకపాయు నేఱును, ద్విజుడన్***
***చొప్పడిన ఊరనుండుము***
***చొప్పడకున్నట్టి యూరు చొరకుము సుమతీ!***

మనం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు చేబదులు ఇచ్చి సహాయం చేసే ధనవంతుడు, అనారోగ్యం కలిగినపుడు నిస్వార్థంగా చికిత్సనందించే వైద్యుడు, నిరంతరం పారే ఏరు, పురము యొక్క హితమును కోరే పురోహితుడు, నివాస యోగ్యమైన గ్రామం ఉండాలి. లేకుంటే ఆ గ్రామాన్ని విడిచి, అలాంటి స్థితి గతులున్న వేరొక గ్రామానికి వెళ్ళడం మంచిది అని కవి సూచిస్తున్నాడు.

అంటే ధనవంతుడు వ్యాపార దృష్టితో కాకుండా వాత్సల్య దృష్టితో ఆదుకోవాలి. వైద్యుడు ఆరోగ్యరక్షణ తన బాధ్యతగా చేపట్టాలే తప్ప, వృత్తిగా, ఆదాయాన్ని పొందే ప్రక్రియగా చూడరాదు. నీటి ఎద్దడి లేని గ్రామాన్ని (నిరంతరం ప్రవహించే ఏటి సమీపంలో) ఎంచుకోవాలి. మంచి, చెడులు చూసి, మంచి మార్గాన్ని బోధించే పురోహితుడు ఉన్నప్పుడే మానవ జీవన వికాసానికి తోడ్పడే మంచి వాతావరణం ఉంటుంది. అందుకే అలాంటి గ్రామాలు ఉన్న గ్రామస్వరాజ్యం రావాలని గాంధీజీ కలలు కన్నారు. అటువంటి గ్రామాలే నిజమైన "ఆరామాలు" అని బద్దెన కూడా తెలియజేశాడు.

– సాధన నరసింహాచార్య

## పొగరు కొంప ముంచుతుంది

*ఒక ఏనుగు అహంకారంతో సమూహంతో కలసి ఉండక, స్వార్థంతో ఒంటరిగా జీవించేది. ఏకాకితనం అనేక దుర్గుణాలను ప్రేరేపించింది. తనను మించినది లేదని విర్రవీగసాగింది. ఒకనాడు ఒక పక్షి తన గూడును, గుడ్లను ఆ ఏనుగు పాడుచేస్తుందనే భయంతో అటుగా వస్తున్న ఏనుగల దండును చూచి, ఆ దండుకు అధిపతియైన ఏనుగుకు నమస్కరించి తన గుడ్లకు రక్షణ కల్పించమని ప్రార్థించింది. కలసికట్టుతనం, ఆధిపత్యం ఈ రెండు ఉత్తమ గుణాల కారణంగా ఏనుగుల అధిపతి కరుణతో తన నాలుగు కాళ్ళ మధ్య పక్షి గూటిని దాచి ఏ ప్రమాదము రాకుండా రక్షించింది. కాని స్వల్ప వ్యవధిలోనే ఒంటరిగా జీవిస్తున్న ఏనుగు వచ్చి ఎంత బతిమాలినా వినక, దయాహీనురాలైన గుడ్లను త్రొక్కి పాడుచేసి వెళ్ళింది.*


*తన బిడ్డలు పోయినందుకు దుఃఖిస్తూ పక్షి ఇటువంటి దుష్టులను వదలిపెడితే ఎప్పటికైనా ప్రమాదమేనని భావించి తోటి పక్షులను, జంతువులను సహాయం కోరింది. నాలుగు కాకులు ఏనుగు ముందుకు వచ్చి దాని కన్నులు పొడిచి గ్రుడ్డిదానిని చేశాయి. కొన్ని కప్పలు లోతైన కందకంలో నుండి అరచి దానిలో నీళ్ళు ఉన్నట్లు ఏనుగుకి భ్రమ కలిగించాయి. నీళ్ళు త్రాగాలని గ్రుడ్డి ఏనుగు ఆ కందకం వద్దకు వెళ్ళి కాలుజారి పడి మరణించింది. ఏకాకులు, స్వార్థపరులు ఇలాగే సర్వనాశనమవుతారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**తిని ఖాళీగా కూర్చుంటే రకరకాల బాధలు, రోగాలను ఆహ్వానించినట్టే**

నిత్యస్మరణీయులు - 10

# సమైక్యతా స్థాపకుడు సర్దార్ పటేల్-3



**(గత సంచిక తరువాయి... )**

1930లో గాంధీజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి మోతీలాల్ నెహ్రూ తర్వాత ఎవరిని ఎంపిక చెయ్యాలి? అన్న సంశయంలో ఉన్నప్పుడు పటేల్, నెహ్రూలలో ఎవరికి ఆ పదవిని అప్పగించాలన్న సందేహం కలిగినప్పుడు, పటేల్ వృద్ధాప్యాన్ని దృష్టిలో ఉంచుకుని, యువకుడైన నెహ్రూను ఎంపిక చేసారు. ఆ సందర్భంలో పటేల్ ఏ మాత్రం కలత చెందకుండా, హుందాగా అంగీకరించి తన విశాల హృదయాన్ని ప్రకటించాడు. బ్రిటీష్ వారిని ధైర్యంగా ఎదుర్కొని వారిని లొంగదీసిన వ్యక్తి పటేల్ అని గాంధీజీ గుర్తించినా, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, తీసుకున్న నిర్ణయంగా భావించిన సంస్కారి పటేల్.

మళ్ళీ 1931లో అధ్యక్ష పదవికి పటేల్ పేరే సూచించబడి, ఎంపిక చేసినప్పుడు కూడా, స్వాతంత్ర్య సమరం కోసం కాంగ్రెస్‌ను పటిష్టంగా తీర్చిదిద్దుతామన్న ప్రతిన పూనాడు పటేల్. అనంతరం జరిగిన ఉద్యమంలో పటేల్‌ను, గాంధీని పూనా జైలులో 16 నెలలు బంధించినప్పుడు, వారిమధ్యగల మైత్రీ బంధం మరింత బలపడింది. పటేల్‌కు గల అజేయమైన సాహసం, దేశం కోసం తపించే ప్రేమ గాంధీజీకి బాగా అవగతమయ్యింది.

1942లో పటేల్‌ను బంధించి పాత అహమ్మద్‌నగర్‌లోని ఫోర్ట్ జైలులో ఉంచారు. అదే జైలులో నెహ్రూ, గాంధీలు కూడా ఉండడంతో వారి మధ్య మైత్రి మరింత బలిష్టమైంది.

1946లో ముస్లీం లీగ్ దేశ విభజనను కోరుతూ, తీవ్ర ఉద్యమం చేసి ఎందరినో హత్య చేసింది. అప్పుడు పటేల్‌కు అర్థమయ్యింది. ఇక విభజన తప్పదని 'రాయల్ ఇండియన్ నేవీ' (నావికాదళం) బ్రిటీష్ ప్రభుత్వం పట్ల ఆగ్రహంతో, జీతాల కోసం సమ్మెపేరుతో దారుణ మారణకాండను నిర్వహించింది. ఈ విషయం తెలుసుకున్న పటేల్ వారి ఆగ్రహానికి కారణం తెలుసుకుని, 'అహింసా' మార్గం యొక్క అవసరాన్ని వివరించి, వారి తప్పును వారికి తెలిసేలా చేయడంతో, వారు పటేల్ ముందు తమ ఆయుధాలను సమర్పణ చేసి లొంగిపోయారు. ఆ విధంగా వారిని వారి ఉద్రేకాన్ని అదుపుచేయడంలో పటేల్ పాత్రను నెహ్రూ, గాంధీలతోబాటు దేశ ప్రజలంతా ప్రశంసించారు.

1947 ఆగస్టు 15న భారత్, పాకిస్థాన్‌లు విడిపోయినప్పుడు, ఆస్తిపాస్తుల నుండి అన్ని విషయాలను పరిష్కరించిన ప్రముఖులలో పటేల్ ముఖ్యుడు. మళ్ళీ ఇండియా ముక్కలు కారాదన్న లక్ష్యాన్ని పూని, అదే మాటపై 562 సంస్థానాలన్నింటికి ఒకే త్రాటిపైకి తెచ్చిన మహనీయుడు.

భారత్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత తొలి ఉపప్రధానిగా బాధ్యతలు చేపట్టి, శాంతి భద్రతలను పటిష్టం చేసిన పటేల్ 1948 జనవరి 30న మరణించిన గాంధీజ మరణవార్త ఎంతగానో కృంగ దీసింది. ఆ సందర్భంలో ఒక ప్రకటన చేస్తూ పటేల్ ఇలా సందేశ మిచ్చాడు. "ఈ రోజు భారతదేశానికి, భారతీయతకు దుర్దినం. మిక్కిలి విచారకరం. ఈ సంఘటన వల్ల మనం కోపంతో రెచ్చిపోరాదు. మనకు కావాల్సింది ఆత్మసంయమనం, ఆత్మ పరిశీలన. ఈ ప్రకటనతో జాతి మొత్తం శాంతించి, గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టాలని తీర్మానించింది.

నిరాడంబరతతో, వ్యక్తిగత ఆస్తిని కూడబెట్టకుండా, నిస్వార్థ జీవితాన్ని గడిపిన ఆశయశీలి. అనంతర కాలంలో పటేల్ వయసు రీత్యా, గాంధీజీ వియోగం వల్ల మానసికంగా కలత చెంది తీవ్రగుండెపోటుకు గురి అయ్యారు.

1950వ సం॥లో పటేల్ ఆరోగ్యం క్షీణించసాగింది. ఉదర వ్యాధి (లివర్) తో బాధపడుతూ, ఏమి తినలేని స్థితిలో వ్యాధిగ్రస్తుడై, చివరికి సబర్మతీ ఆశ్రమంలో సేవికగా అంకితమైన తన కుమార్తె 'మణిబెన్' సపర్యలందుకుంటూ డిశంబర్ 15న దివంగతులయ్యారు. అందరికీ సమాన అవకాశాల కోసం, సుస్థిర పాలన కోసం హక్కులు, బాధ్యతలతో కూడిన అభివృద్ధి కొరకు తపించిన నిజమైన 'ఉక్కు మనిషి'. ప్రతి ఒక్కనేత పటేల్ ఆశయాలను ఆచరించినప్పుడే పటేల్‌కు యదార్థమైన నివాళి అర్పించిన వారమవుతాం. – సాధన నరసింహాచార్య

## నారాకోడూరు వార్తలు

గుంటూరు జిల్లా నారాకోడూరులోని గాయత్రీ శక్తిపీఠ మందు ప్రతి ఆదివారం ఉదయం ఉచిత హోమియో వైద్య శిబిరం డా॥ కె. లక్ష్మిజానకి, బి.హెచ్.ఎమ్.ఎస్.గారిచే సాయంత్రం ఉచిత ఎలోపతి వైద్య శిబిరం డా॥ వి.వి.భాస్కర్, ఎమ్.డి.గారిచే శ్రీ కోట సుబ్బారావుగారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నవి. ఈ ఉచిత వైద్య శిబిరములను 12.08.2012న తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీ ఎన్. శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. సుమారు 200 మంది ఈ ఉచిత వైద్య సేవలను ఉపయోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి దాల్ మిల్ అధ్యక్షులు శ్రీ జూటూరి సుబ్బారావుగారు, సెక్రటరి శ్రీ నంబూరు వెంకట కృష్ణమూర్తిగారు, భారతి సోప్ వర్క్స్ అధినేత శ్రీ మాణిక్యవేలుగారు పాల్గొన్నారు. వీరందరు ఇతోధిక సహకారం అందిస్తామని అన్నారు.

**స్వార్థపరత్వం మనిషిని అత్యంత కఠినుడిని గావిస్తుంది**